




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI








మంగళవారం | 24-3-2020 | పేజీలు: 10 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 339 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య మ. 2.57 వరకు తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర తె. 4.20 తదుపరి రేవతి; వర్జ్యం: మ. 12.09-1.57; దుర్ముహూర్తం: ఉ. 8.45-9.33, రా. 10.18-11.04; అమృతఘడియలు: రా. 10.56-12.44; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 6.24 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore


# లాక్ డౌన్ బేఖాతరు!



## స్టాకులన్నీ షేకు!

స్టాక్ మార్కెట్లకు మరో బ్లాక్ మండే

సెన్సెక్స్ సుమారు 4,000 పాయింట్లు డౌన్

ఇది.. విజయవాడలో ప్రకాశం బ్యారేజీ వద్ద దృశ్యం. పోరాట స్ఫూర్తి ఒక్క రోజేనా? ఇలాగైతే... కరోనాపై దేశం గెలిచేనా? ఇది సరికొత్త ఆందోళన! ఆదివారం 'జనతా కర్ఫ్యూ' విజయవంతమైంది. ఉదయం నుంచి రాత్రి వరకు జనం ఇల్లు కదల్లేదు. 'లాక్‌డౌన్' కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా... తెల్లారేసరికి మళ్లీ మామూలే! 'వివిధ అవసరాల' కోసం జనం పెద్ద సంఖ్యలో రోడ్లెక్కారు. వాణిజ్య సంస్థలు దాదాపుగా మూతపడినప్పటికీ... రహదారులపై సందడి పూర్తిగా ఆగలేదు. 'లాక్‌డౌన్'ను తీవ్రంగా పరిగణించాలన్న హెచ్చరికలతో మధ్యాహ్నం నుంచి రోడ్లపై జన సంచారం కొంత తగ్గింది. మరోవైపు... సెలవివ్వకుండా లాక్‌డౌన్ అంటే ఎలా విజయవాడలో ప్రభుత్వ ఉద్యోగులు వాపోయారు. విధులు ముగిసిన తర్వాత ఇళ్లు చేరడానికి నానా ఇక్కట్లు పడ్డారు.



జనసంచారం యథాతథం

కిక్కిరిసిన రైతు మార్కెట్లు

**కూరగాయలు భగ్గు**

**కిలో టమాట 80, బీర 100**

లాక్ డౌన్ విషయంలో పోలీసులు మంగళవారం నుంచి కఠిన వైఖరిని అవలంబించనున్నారు. తగిన కారణం లేకుండా ఎవరైనా ఇంటి నుంచి బయటకు వస్తే వారిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సరైన కారణం చూపలేక పోయిన వారి వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకుంటారు.

## నేటి నుంచి కఠిన చర్యలు

బయటకు వస్తే కారణం చెప్పాల్సిందే

## కరోనా పిడికిట భారత్

**20 రాష్ట్రాలు లాక్‌డౌన్.. ఆరు చోట్ల కర్ఫ్యూ**

**9కి పెరిగిన మృతులు.. 478 కొవిడ్ కేసులు**

**రేపటి నుంచి దేశీయ విమానాలూ బంద్**

**దేశవ్యాప్తంగా పెరోల్‌పై ఖైదీల విడుదల!**

**ఇక వారానికి ఒక్కరోజే సుప్రీం కోర్టు పని**

**తెలంగాణలో మరో ఆరు పాజిటివ్ కేసులు**

## 'ఎమర్జెన్సీ'లో ప్రపంచం!

**15 వేలు దాటిన కరోనా మరణాలు**

**ఇటలీ 6 వేలు.. స్పెయిన్‌లో 2 వేల పైనే..**

3, 7, 8, 9, 10

## క్యా.. కరోనా?

**మాస్కుల్లేవు.. రక్షిత పరికరాల్లేవు**

**వైరస్‌పై మేం ఎలా పోరాడాలి?**

**ప్రశ్నిస్తున్న ఐసోలేషన్ వైద్యులు**

**విశాఖలో కుట్టిన మాస్కులే గతి**

**చాలా ఆస్పత్రుల్లో ఒకరికి రెండే**

**వాటినే ఉతుక్కోవాలని సూచన**

**హెచ్‌ఐవీ వ్యాప్తినాటి పరికరాలే కరోనాపై యుద్ధంలోనూ వాడకం**

**వైద్యులకు సంకటంగా మారిన ఉన్నతాధికారుల అలసత్వం**

**రాత్రి 8 నుంచి ఉదయం 6 వరకూ**

## అన్నీ బంద్



**మెడికల్ షాపులకు మాత్రమే మినహాయింపు**

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**

**హౌస్ క్వారంటైన్‌ను ఉల్లంఘిస్తే కేసులే**

**కలెక్టర్లు, ఎస్పీలకు సీఎస్, డీజీపీ ఆదేశం**

**నలుగురికి మించి ఉండొద్దు**

లాక్‌డౌన్‌లో మరిన్ని నిబంధనలు

## ఇవీ 'పంచ్'లు

- ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ పతాకంలోని రంగులు వేయడం కుదరదని హైకోర్టు ఇప్పటికే చెప్పింది. దీనిని సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కూడా కొట్టివేసింది.
- రాజధాని కోసం రైతుల నుంచి సమీకరించిన భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడాన్ని హైకోర్టు నిలువరించింది. ఇది చట్ట విరుద్ధమని, సర్కారుకు అధికారం లేదని స్పష్టం చేసింది.
- విశాఖపట్నంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం ఆరువేల ఎకరాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో అమలును హైకోర్టు నిలిపివేసింది. రైతులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే భూములు తీసుకుంటున్నారన్న వాదనలతో ఏకీభవించింది.



- పాతిక లక్షల మందికి పంపిణీ చేసే ఇళ్ల స్థలాలను ఐదేళ్ల తర్వాత విక్రయించుకునే వీలు కల్పించే 'కన్వేయన్స్ డీడ్'లపై ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు సస్పెండ్ చేసింది. ఇల్లు కట్టుకుంటామనే షరతు లేకుండా స్థలాలు ఇవ్వడమేమిటని ప్రశ్నించింది.
- ఐదో పంచ్ ... రాజకీయంగా తగిలిన ఎదురు దెబ్బ. శాసన మండలి రద్దు సంగతి కనీస ప్రస్తావనకు రాకుండానే పార్లమెంటు సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# 5 పంచ్ పడింది!



### ఒకేరోజు ఐదు ఎదురు దెబ్బలు

**దూకుడుగా సీఎం జగన్ నిర్ణయాలు**

**తందాన అంటూ అధికారుల జీవోలు**

**తిప్పలకు ఇదే కారణమని విశ్లేషణ**

**వైసీపీ రంగులపై సుప్రీం అక్షింతలు**

**రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు కుదరదని హైకోర్టు స్పష్టీకరణ**

**శాసనమండలి రద్దు ఆశలు గల్లంతు**

**పార్లమెంటు నిరవధిక వాయిదా**



**మీకు అధికారం లేదు**

**రాజధాని భూముల్లో ఇళ్లస్థలాలు కుదరదు**

**ఆ జీవో చట్ట ఉల్లంఘనే**

**తేల్చి చెప్పిన హైకోర్టు**



**ఆ రంగు పోవాల్సిందే!**

**కేంద్ర కార్యాలయాలకు కాషాయం వేస్తే సరేనా?**

**వైసీపీ రంగులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం**

'నా రాజ్యం... నా ఇష్టం' అని యథేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోమవారం ఒక్కరోజే 'పాంచ్-పంచ్'లు పడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులు, రాజధాని భూములు, ఇళ్ల స్థలాల కోసం విశాఖలో భారీగా అసైన్డ్ భూముల సేకరణ, పేదలకు ఇచ్చే స్థలాల పట్టాల తీరులో మార్పు నిర్ణయాలను సుప్రీంకోర్టు, హైకోర్టులు నిలిపి వేశాయి. ఇక... పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడటంతో... మెరుపు వేగంతో శాసన మండలిని రద్దు చేయాలన్న ఆకాంక్ష కూడా నెరవేరలేదు.

**(అమరావతి - ఆంధ్రజ్యోతి)**

తప్పు అని తెలిసీ ముందుకెళ్లడం, ఆ నిర్ణయాన్ని హైకోర్టు తప్పుపట్టినా మొండిగా సుప్రీంకోర్టుకు వెళ్లడం... అక్కడ మొట్టికాయలు తినడం! హైకోర్టులోనూ వరుసగా ఎదురు దెబ్బలు! సోమవారం ఏకంగా నాలుగు అంశాలపై న్యాయస్థానాలు తప్పుపట్టడంపై తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఎదురుదెబ్బల్లో ముఖ్యమంత్రికి సన్నిహితంగా పనిచేసే సీనియర్ అధికారులకూ బాధ్యత ఉన్నట్లే! 'నేను చెప్పింది జరగాల్సిందే' అని సీఎం జగన్ పేర్కొంటుండగా... 'మీ మాటే శాసనం' అంటూ అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా, ముందూ వెనుకా చూడకుండా ఆదేశాలు ఇచ్చేస్తున్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి తనకున్న భావోద్వేగాలు, రాజకీయ అవసరాలు, సొంత ఆలోచనల మేరకు ప్రకటనలు చేయడం సహజం. కానీ... వాటిపై ఉత్తర్వులిచ్చి అమల్లోకి తీసుకొచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సింది అధికారులే. కీలక స్థానాల్లో ఉన్న కొందరు

మిగతా 2వ పేజీలో...



మధ్యప్రదేశ్ సీఎంగా

## శివరాజ్!

**నాలుగోసారి ప్రమాణం**

**గవర్నర్‌ని కలిసిన అరగంటకే**

9

భవిష్యత్తులో భారీగా

## పెట్రో వాత!

**ఎక్సైజ్ సుంకం పెంపునకు ముందస్తు సవరణ**

**చర్చ లేకుండానే ఆర్థిక బిల్లు ఆమోదం**






ముందు జాగ్రత్తగా

# హైడ్రాక్సీక్లోరోక్విన్

**హెల్త్‌కేర్ వర్కర్లకు సూచిస్తున్న ఐసీఎంఆర్**

**ప్రభావవంతంగానే పనిచేస్తోందని వ్యాఖ్య**



## అవును అది సరైన మందే!

**క్లోరోక్విన్‌తో కరోనాకు అడ్డుకట్ట!**

**ఇప్పటికే పలు పరిశోధనల్లో వెల్లడైంది**

**శాస్త్రీయ ఆధారాలు కూడా ఉన్నాయి**

**హెల్త్ వర్కర్లకు ఐసీఎంఆర్ కూడా ఈ మాత్రలనే సిఫారసు చేసింది**

**ప్రముఖ వైద్యుడు రవిచంద్ర బీరం**

న్యూఢిల్లీ, మార్చి 23: కరోనా బాధితులకు వైద్య సేవలు అందిస్తున్న హెల్త్‌కేర్ వర్కర్లు, హోం క్వారెంటైన్‌లో ఉన్న వారి కుటుంబసభ్యులు ముందు జాగ్రత్తగా హైడ్రాక్సీక్లోరోక్విన్ మాత్రలను వాడవచ్చని ఐసీఎంఆర్ సూచించింది. "హైడ్రాక్సీక్లోరోక్విన్ కరోనాపై ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు ప్రాథమికంగా ల్యాబ్‌లో జరిపిన పరిశోధనల్లో తేలింది" అని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ తెలిపారు. అయితే ఇతరులు ఈ మాత్రలను ప్రభుత్వ గుర్తింపు పొందిన వైద్యుల సలహా మేరకే వాడాలన్నారు. ముందు జాగ్రత్త పేరుతో వీటిని 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారికి ఇవ్వవద్దన్నారు. ఈ మాత్రలు వాడినప్పటికీ కరోనా లక్షణాలు కనిపిస్తే ఇప్పటికే ఉన్న విధివిధానాల ప్రకారం పరీక్షలు నిర్వహించుకోవాలని కోరారు.

హైదరాబాద్,మార్చి23 (ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణకు ఉపయోగించే క్లోరోక్విన్ కరోనా వైరస్ నియంత్రణకు కూడా ఉపయోగపడుతుందని ప్రముఖ వైద్యుడు రవిచంద్ర బీరం చెప్పారు. ఈ విషయం ఇప్పటికే పలు పరిశోధనల్లో వెల్లడైందని, ఇందుకు సంబంధించి శాస్త్రీయ ఆధారాలు కూడా ఉన్నాయని అన్నారు. ముందు జాగ్రత్తగా ఈ మాత్రలను వేసుకోవడం వల్ల

మిగతా 9వ పేజీలో...

## 30 కోట్ల మందికి కరోనా?

9

**తగిన చర్యల్లేకపోతే 25 లక్షల మంది మృత్యువాత.. సీడీడీఈపీ డైరెక్టర్ రమణన్**

# 'ఆంగ్లం'పై అడ్డదారి!

కోర్టులో ఇంగ్లీషు మీడియం వివాదం

అయినా అమలు దిశగానే అడుగులు

మండలానికో తెలుగు మీడియం బడి

అక్కడివరకు వెళ్లడానికి రవాణా చార్జీ

హైకోర్టుకు కౌంటర్‌లో చెప్పినవాటినే ఉత్తర్వుగా వెలువరించిన ప్రభుత్వం

తీర్పు రాకుండానే ఎలా చేసేస్తారు?

రాష్ట్రంలోని భాషాభిమానుల ఆవేదన

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకటి నుంచి ఆరో తరగతి వరకు పూర్తిగా ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ ఉత్తర్వులపై నమోదైన కేసులపై ఇంకా హైకోర్టు తీర్పు వెలువడనే లేదు. అయినా ఈ నిర్ణయం అమలు దిశగా మాత్రం రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసింది. కాకపోతే ఇటు నుంచి నేరుగా ముందుకెళితే

మిగతా 2వ పేజీలో...

**అమరావతి భూకొనుగోళ్లపై..**

# సీబీఐతో దర్యాప్తు!

## మంత్రివర్గ ఉపసంఘం నివేదిక మేరకే!!



**రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు**

**సీఐడీ నమోదు చేసిన కేసులన్నీ కేంద్ర సంస్థకు**

**మొదటి నుంచీ జగన్ 'ఇన్‌సైడర్' ఆరోపణలు**

**కోరుకున్నట్లు రిపోర్టులివ్వని వివిధ సంస్థలు**

**దీంతో సబ్‌కమిటీకి 'బాధ్యత' అప్పగింత**

**ఆ నివేదికతో మాజీ మంత్రులపై కేసులు**

**ఇప్పుడు అవే సీబీఐకి బదిలీ**

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి భూముల వ్యవహారాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో దర్యాప్తు జరిపించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాజధాని ప్రాంతంలో భూకొనుగోళ్లలో భారీగా అక్రమాలు, అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయంటూ మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ భూ వ్యవహారానికి సంబంధించి ఏపీ సీఐడీ నమోదు చేసిన వివిధ కేసులను

మిగతా 7వ పేజీలో...



పరంజ్యోతి

## కాలాన్ని శాసిస్తున్న నారద సంతానం



జగత్తునంతటినీ మోహపరిచే మహా మాయ తనను ఏమీ చేయలేదని ఒకసారి నారదుడు శ్రీమహావిష్ణువుతో చెప్పాడు. ఆ మాటలు విన్న విష్ణుమూర్తి మౌనంగా తలూపాడు. కొంతసేపటి తర్వాత వారిద్దరూ భూలోకానికి చేరుకుని కన్యాకుబ్జానికి దగ్గరలో ఒక సరస్సు దగ్గర దిగారు. అది సంధ్యా సమయం. అర్ఘ్యం ఇవ్వడానికి నారదుడు ఆ సరస్సులో ముమ్మారు మునిగాడు. పైకి లేచి చూసేసరికి ఒక స్త్రీగా మారిపోయాడు. ఈలోపు.. విష్ణువు నారదుని వీణాదులను తీసుకుని అంతర్థానం అయిపోయాడు. స్త్రీగా మారి సరస్సు ఒడ్డున విహరిస్తున్న నారదుణ్ని.. అటుగా వచ్చిన కన్యాకుబ్జపు రాజు తాళధ్వజుడు చూశాడు. అతిలోక సుందరిలా ఉన్న ఆమెను వివరాలు అడగ్గా.. ఆమె తన పేరు గానీ, గతం కానీ గుర్తులేవని చెప్పింది. తాళధ్వజుడు ఆమెకు సౌభాగ్యసుందరి అని పేరు పెట్టి వివాహం చేసుకున్నాడు. వారికి అరవై మంది సంతానం కలిగారు. వారు పెరిగి పెద్దవారయ్యాక పొరుగు రాజ్యంతో ఘోరమైన యుద్ధం సంభవించింది. ఆ యుద్ధంలో అరవైమందీ నిహతులయ్యారు. వృద్ధులైన తాళధ్వజుడు, సౌభాగ్య సుందరి పుత్రశోకంతో దుఃఖించడం మొదలు పెట్టారు. అప్పుడు ఒక వృద్ధురాలు అక్కడకు వచ్చి.. వారి దుఃఖం పోవాలంటే పుంతీర్థమనే సరస్సులో ఒక చెయ్యి మాత్రం పైకి ఉంచి స్నానం చెయ్యాలని చెప్పింది. ఆమె చెప్పినట్టు ఒక చేయి పైకి ఉంచి స్నానం చేసిన సౌభాగ్య సుందరి.. నీటిలోంచి పైకి లేచేసరికి నారదునిగా మారిపోయింది. నీటి పైకి ఉంచిన చెయ్యి మాత్రం.. అప్పటిదాకా జరిగిందంతా నిజమని రుజువు చేసేట్టుగా స్త్రీ హస్తంలాగానే ఉండిపోయింది. ఆ జ్ఞాపకాలన్నీ నారదుడి తలపుల్లోనే ఉన్నాయి. తల పైకెత్తి చూసేసరికి సరస్సు ఒడ్డున శ్రీమహావిష్ణువు చిద్విలాసం చేస్తూ కనిపించాడు. తాళధ్వజుడు మాత్రం కనిపించలేదు. అదంతా మాయ అని అర్థమైనా.. స్త్రీ రూపంలో ఉన్నప్పుడు తనకు జన్మించి, ఆ తర్వాత గతించిన అరవై మంది పిల్లలపై నారదునికి మమకారం మాత్రం పోలేదు. తన పిల్లలు శాశ్వతంగా అందరికీ గుర్తుండిపోయే వరమివ్వాలని మహావిష్ణువును, జగన్మాతను నారదుడు వేడుకున్నాడు. ఫలితంగా కాలవర్గీకరణలో సంవత్సరాలకు.. నారదుని పిల్లల పేర్లు అయిన ప్రభవ, విభవ మొదలైనవి స్థిరమైనాయి. ఈ క్రమంలోనే.. రేపటి నుంచి చాంద్రమానం ప్రకారం శార్వరి నామ సంవత్సరం ప్రారంభం కానున్నది. మనం చేయవలసిన విధులు ఏంటంటే.. తెల్లవారుజామునే లేచి అభ్యంగన స్నానం చేసి, నూతనవస్త్రాలను ధరించాలి. ఇష్ట దైవ పూజ, కాలాన్ని దైవంగా పంచాంగరూపంలో పూజించాలి. పంచాంగం అంటే.. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం. అలా కాల రూపమైన పంచాంగాన్ని, నవగ్రహాలను పూజించి సంవత్సర ఫలాలను తెలుసుకోవాలి. ఆరు రుచుల ఉగాది పచ్చడిని తినాలి. నవగ్రహాల పూజవల్ల.. సూర్యుడు ఆరోగ్యాన్ని, చంద్రుడు సంపదలను, కుజుడు భూమిని, బుధుడు చక్కని మాటను, గురుడు సౌభాగ్యాన్ని, శుక్రుడు శౌర్యాన్ని, శని ధైర్యాన్ని, రాహువు కీర్తిని, కేతువు ఇష్టసిద్ధిని కలుగచేస్తారని ప్రతీతి.

**- ఆచార్య రాణి సదాశివ మూర్తి** (రేపు ఉగాది)




# మీకు అధికారం లేదు!

సర్కారుకు హైకోర్టులో ఒకే రోజు మూడు కేసుల్లో చుక్కెదురైంది. అవన్నీ 'ఇళ్ల స్థలాల'కు సంబంధించినవే! రాజధాని కోసం రైతుల నుంచి సమీకరించిన భూముల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం... 'నవరత్నాల' పథకంలో భాగంగా పేదలు తమకు ఇచ్చిన ఇంటి స్థలాన్ని ఐదేళ్ల తర్వాత అమ్ముకునేందుకు వీలు కల్పించే కన్వేయన్స్ పట్టా జారీ జీవోలను ఒకే తీర్పులో తప్పుపట్టింది. విశాఖలో పేదలకు స్థలాల కోసం భారీగా భూములు సమీకరించడాన్ని ఆపివేస్తూ మరో తీర్పు చెప్పింది.



## ఇల్లు కట్టుకోకున్నా స్థలమా?

- షరతు లేకుండా కేటాయింపు ఎలా?
- ఐదేళ్ల తర్వాత విక్రయం సరికాదు
- పేదలకు ఇళ్ల జీవోపై అభ్యంతరం
- 'కన్వేయన్స్'ను నిలిపివేసిన హైకోర్టు

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ఇచ్చే స్థలాన్ని ఐదేళ్ల తర్వాత అమ్ముకునేందుకు వీలుగా కన్వేయన్స్ డీడ్‌లు ఇచ్చేందుకు జారీ చేసిన జీవో 44ను హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తప్పుబట్టింది. ఆ ఆదేశాలను సస్పెండ్ చేసింది. "ఇల్లు నిర్మించుకోవాలన్న షరతు లేకుండా ఆ స్థలం ఎలా కేటాయిస్తారు? ఐదేళ్ల తర్వాత స్థలాన్ని విక్రయించుకునేందుకు వీలు ఎలా కల్పిస్తారు?" అని ప్రశ్నించింది. రాజధానికోసం సమీకరించిన భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వడాన్ని సవాలు చేసిన ఎ.నంద కిశోర్ అనే వ్యక్తి... తన ప్రజాప్రయోజన వ్యాజ్యానికి అనుబంధంగా.... తప్పనిసరిగా ఇల్లు నిర్మించుకోవాలనే షరతు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా పాతిక లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం తప్పంటూ మరో పిటిషన్ వేశారు. లబ్ధిదారుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేసేందుకు తహసీల్దార్లకు అధికారాలు కల్పిస్తూ జారీ చేసిన జీవో 44ను కూడా నిలుపుదల చేయాలని ఆయన అభ్యర్థించారు. రాజధాని భూములపై ఇచ్చిన జీవో 107ను నిలిపివేస్తూ ఇచ్చిన మధ్యంతర ఆదేశాలలోనే, త్రిసభ్య ధర్మాసనం జీవో 44ను కూడా ఆపివేసింది. పిటిషనర్ తరపున న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపించారు.

- రాజధాని భూముల్లో ఇళ్లస్థలాలు కుదరదు
- ఆ అధికారం సీఆర్‌డీఏకు మాత్రమే ఉంది
- ప్రభుత్వ ఉత్తర్వులు చట్ట ఉల్లంఘనే
- రాజధానిలో 'ఇళ్ల స్థలాల'పై తేల్చి చెప్పిన హైకోర్టు
- జీవో 107 సస్పెండ్ చేసిన త్రిసభ్య ధర్మాసనం

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం రైతులిచ్చిన భూముల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడం కుదరదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని తేల్చి చెప్పింది. రాజధాని భూములను ఇళ్ల స్థలాలకు కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర ఉండబోదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో సర్వాధికారాలు సీఆర్‌డీఏకే ఉన్నాయని తెలిపింది. రాజధానిలో భూ కేటాయింపు అధికారం సీఆర్‌డీఏ అథారిటీ, అదనపు కమిషనర్, భూ కేటాయింపు పరిశీలనా మండలికి మాత్రమే ఉందని స్పష్టం చేసింది. ప్రభుత్వ జీవో సీఆర్‌డీఏ చట్ట నిబంధనలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. రాజధాని భూముల్లో ఇళ్ల స్థలాల కేటాయింపు జోనల్ రెగ్యులేషన్ విధానానికి వ్యతిరేకమని అభిప్రాయపడింది. రాజధాని కోసం రైతుల నుంచి సమీకరించిన భూమిలోని 1251 ఎకరాలను ఇళ్ల స్థలాలకు ఇస్తూ ఫిబ్రవరి 25వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 107ను సస్పెండ్ చేసింది. రాజధాని నిర్మాణం కోసం రైతుల నుంచి సమీకరించిన భూమిలో 'నవ రత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద స్థలాలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఎ.నందకిశోర్, కె.సాంబశివరావు, జి.హరిగోవిందప్రసాద్, పఠాన్ మున్నా అనే వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై... సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన త్రిసభ్య ధర్మాసనం మధ్యంతర తీర్పు వెలువరించింది.

### పిటిషనర్లు ఏమన్నారంటే?

పిటిషనర్ల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అశోక్‌భాన్, సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్, న్యాయవాదులు కారుమంచి ఇంద్రనీల్ బాబు, ప్రణతి తదితరులు వాదనలు వినిపించారు. "తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లోని గ్రామాలు మాత్రమే రాజధాని పరిధి కిందకు వస్తాయి. రాజధాని ప్రాంతంలో ఇతర మండలాలకు చెందిన వారికి భూములివ్వడం సరికాదు. ఇది సీఆర్‌డీఏ చట్ట నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. రైతులు స్వచ్ఛందంగా భూమిలిచ్చింది రాజధాని కోసమే తప్ప బయటి ప్రాంతాల వారికి ఇళ్ల స్థలాల కోసం కాదు. భూసమీకరణ సమయంలో ఆ భూముల్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు దాని నుంచి తప్పుకునేందుకు ప్రయత్నించడం సరి కాదు. రాజధానికి భూమిలిచ్చిన రైతులకు పంపిణీ చేసిన ప్లాట్లను అభివృద్ధి చేసిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పటి వరకూ ఆ విషయమే పట్టించుకోవడం లేదు. రాజధానిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పుడు 5 శాతం భూమిని ఇళ్ల స్థలాలకు ఇవ్వవచ్చు. కానీ... అసలు అభివృద్ధి పనులే చేపట్టలేదు. గృహాల కోసం కేటాయించిన భూముల్ని శుభ్రం చేసేందుకు, హద్దులు నిర్ణయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను కూడా పిలిచింది. కేసు విచారణలో ఉండగానే ప్రభుత్వం ఇలా టెండర్లు పిలవడం సరి కాదు. అందువల్ల విచారణ పూర్తయ్యే వరకూ ఈ వ్యవహారాన్ని అడ్డుకోవాలి. ఆ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలి" అని అభ్యర్థించారు. వారి వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. సదరు జీవోను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## 'దూకుడు'కు బ్రేక్

- విశాఖ జిల్లాలో అసైన్డ్ సేకరణ జీవో నిలిపివేత
- నిబంధనల ప్రకారం జరగడం లేదు: హైకోర్టు

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలో ఆరు వేల ఎకరాలకుపైగా అసైన్డ్ భూముల్ని సమీకరించి ఇళ్ల స్థలాలకు కేటాయించాలన్న ప్రభుత్వ యత్నాలకు హైకోర్టు అడ్డుకట్ట వేసింది. ఆయా భూములను ఇళ్ల పట్టాల పంపిణీకి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి 25వ తేదీన జారీ చేసిన జీవో నెంబరు 72ను హైకోర్టు సస్పెండ్ చేసింది. భూ సమీకరణలో తీవ్ర అవకతవకలు చోటు చేసుకున్నాయని, అందుకు తగిన ప్రాథమిక ఆధారాలున్నాయని స్పష్టం చేసింది. ఏపీ మెట్రోపాలిటన్ రీజన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ చట్టం-2016, భూసేకరణ చట్ట నిబంధనలకు ప్రభుత్వ ఆదేశాలు విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయపడింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. విశాఖ డివిజన్‌లోని ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం, సబ్బవరం, పెందుర్తి, పరవాడ, గాజువాక, పెదగంట్యాడ, విశాఖపట్నం రూరల్, అనకాపల్లి మండలాల్లోని 6116.50 ఎకరాల అసైన్డ్ భూముల్ని ల్యాండ్ పూలింగ్ స్కీం కింద సమీకరించి 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ఇళ్ల స్థలాలకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి 25వ తేదీన జీవో నెంబరు 72 జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ 'భూసేకరణ ల్యాండ్ పూలింగ్ రైతు కూలీ నిర్వాసితుల సంక్షేమ సంఘం' అధ్యక్షుడు శ్రీరాం, లోకనాథం హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఈ నెల 12వ తేదీన త్రిసభ్య ధర్మాసనం ముందు విచారణ జరిగింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. "భూములు సమీకరించేటపుడు 30 రోజుల ముందస్తుగా నోటీసులు ఇవ్వాలి. అధికారులు ఈ నిబంధనలేవీ పాటించలేదు" అని తెలిపారు. ఆ రిజర్వు చేసిన తీర్పును ధర్మాసనం సోమవారం వెల్లడించింది. పిటిషనర్ తరపు వాదనలతో ఏకీభవించింది. చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వం భూసమీకరణ చేపట్టిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అసైన్డ్ భూముల్ని స్వాధీనం చేసుకోరాదని తేల్చి చెప్పింది.

## ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రాజమండ్రి | 30.0 | 19.0 |
| శ్రీకాకుళం | 32.5 | 22.0 |
| హైదరాబాద్ | 34.6 | 22.7 |
| విజయవాడ | 35.5 | 23.6 |
| గుంటూరు | 36.7 | 25.1 |
| అనంతపురం | 38.4 | 23.2 |
| కడప | 39.0 | 26.0 |

## ఉత్తర కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సోమవారం కంటకాపల్లిలో 11, కళింగపట్నంలో ఎనిమిది, వాడ్రాపల్లి, అనకాపల్లి, నరసన్నపేటల్లో ఏడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో ఉత్తర కోస్తా జిల్లాల్లో ఉరుములు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు హెచ్చరించారు. దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల తరువాత వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం వుందని అంచనా వేశారు. కాగా కోస్తాలోని మిగిలినప్రాంతాలు, రాయలసీమలో ఎండ తీవ్రత కొనసాగింది. అనంతపురంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



## నా భవనాన్ని క్వారంటైన్‌కు వాడుకోండి

రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నాకు ప్రభుత్వం కేటాయించిన అధికారిక భవనాన్ని క్వారంటైన్ క్యాంప్ లేదా కోవిడ్-19 పరీక్షా కేంద్రంగా వాడుకోండి. ఈ క్లిష్ట సమయంలో నా నెల వేతనాన్ని కూడా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ఇస్తాను. కరోనా కట్టడికి ప్రభుత్వం తీసుకునే చర్యలకు అండగా నిలుస్తాం. వైరస్ వ్యాపించకుండా తీసుకునే చర్యలో ప్రజలూ తమ బాధ్యతను మరిచిపోరాదు.

*- తేజస్వి యాదవ్, ఆర్జేడీ నేత*



## బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు గుర్తించే సరికొత్త పరికరం

వాషింగ్టన్, మార్చి 23 : రక్తంలోని హానికారక బ్యాక్టీరియాను గుర్తించగలిగే ఓ పరికరాన్ని అమెరికాలోని రోచెస్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. తద్వారా బ్యాక్టీరియాలతో సోకే ప్రాణాంతక ఇన్ఫెక్షన్లను కచ్చితత్వంతో గుర్తించి, తగిన ఔషధాల వాడకంతో కట్టడి చేయవచ్చని వెల్లడించారు. చిన్న సైజులో ఉండే ఈ పరికరానికి అయస్కాంత శక్తి కలిగిన పూసలు వరుసగా ఒకదాని తర్వాత ఒకటిగా అమరి ఉంటాయి. శరీర ద్రవాల్లోని బ్యాక్టీరియా, దానికి సంబంధించిన హానికారక కణాలు ఈ పూసల మధ్య ఉండే చిన్నపాటి ప్రదేశాల్లో ఇంకిపోతాయి. ఆ విధంగా పరికరంలోకి చేరే బ్యాక్టీరియాలను విశ్లేషించి.. ఇన్ఫెక్షన్లకు గల కచ్చితమైన కారణాలను తెలుసుకుంటారు.



## వృద్ధుల్లో పెరుగుతున్న కాలేయ కేన్సర్ ముప్పు

బీజింగ్, మార్చి 23 : వృద్ధులకు కాలేయ కేన్సర్ ముప్పు పెరుగుతోందని చైనాలోని ఫుడాన్ వర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. 1990-2017 మధ్యకాలంలో 195 దేశాల్లో కాలేయ కేన్సర్ బారినపడిన స్త్రీ, పురుషుల గణాంకాలను వయసులవారీగా విభజించి విశ్లేషించగా ఈవిషయం తెలిసింది. 1990 సంవత్సరంలో ఆ వ్యాధి పంజాకు చిక్కిన వృద్ధుల సంఖ్య 2,16,561 కాగా.. 2017లో అది పెరిగి 2,41,189కి చేరిందని గుర్తించారు. ఇదేకాలానికి కాలేయ కేన్సర్ నిర్ధారణ అయిన 30 ఏళ్లలోపు వారి సంఖ్య గణనీయంగా తగ్గి 17,381 నుంచి 14,661కి చేరింది. హెపటైటిస్-బి వైరస్ కారణంగానూ ఈ వ్యాధి వస్తుంటుంది. యువతలో చాలామందికి బాల్యంలో చేయించిన హెపటైటిస్-బి వ్యాక్సినేషన్ రక్షణ కవచంగా పనిచేసి కాలేయ కేన్సర్ రాకుండా అడ్డుకుంటోందని శాస్త్రవేత్తలు విశ్లేషించారు.

# పంచ్ పడింది!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు... తాన అంటే తందానా అన్నట్లుగా తయారు కావడంవల్లే ఈ దుస్థితి వచ్చిందనే అభిప్రాయం నెలకొంది. ఉదాహరణకు... గ్రామ, వార్డు సచివాలయాలకు అచ్చంగా వైసీపీ జెండాలోని రంగులను వేయాలని జగన్ నిర్ణయించగానే, సంబంధిత అధికారులు ఎంచక్కా 'నమూనా' చిత్రంతో కూడిన జీవో జారీ చేసేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు పులమడం నిబంధనలకు విరుద్ధమని, ఎవరు కోర్టుకు వెళ్లినా ఎదురుదెబ్బ తప్పదని తెలిసినా పట్టించుకోలేదు. హైకోర్టు గట్టిగా అక్షింతలు వేసిన తర్వాతైనా తప్పుదిద్దుకోకుండా... సుప్రీంకోర్టుకు వెళ్లారు. చివరికి, అక్కడా ఎదురుదెబ్బ తగిలింది. దీంతో... అధికారులు జగన్‌కు సలహాలు ఇచ్చేందుకు సాహసించడం లేదా? ఒకవేళ, చెప్పినా ఆయన పట్టించుకోవడంలేదా? అనే చర్చ జరుగుతోంది.

### పొరుగున ఇలా...

"తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గంభీరమైన ప్రకటనలు చేస్తుంటారు. సంచలన నిర్ణయాలూ వెలువరిస్తుంటారు. అయితే, వాటిని అమల్లోకి తీసుకొచ్చేటప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత విభాగాల కార్యదర్శులు పరిశీలించి నిబంధనల ప్రకారమే ఉత్తర్వులిస్తున్నారు. అందువల్ల, ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురు దెబ్బలు తగలడం లేదు" అని ఒక అధికారి విశ్లేషించారు. సీఎం ప్రకటనలపై లిఖిత పూర్వక ఉత్తర్వులివ్వాల్సింది ప్రధాన కార్యదర్శి, సంబంధిత కార్యదర్శులే. భవిష్యత్తులో ఏదైనా తేడా వస్తే బాధ్యత వహించాల్సింది వీరే. "ఆ బాధ్యతతో అధికారులు తమ పని తాము చేయాలి. అప్పటికీ సీఎం వినకుంటే... నోట్‌ఫైల్ మీదతమ అభిప్రాయం రాయాలి.లేకుంటే చిక్కులు, కోర్టుల్లో చీవాట్లు తప్పవు"అని ఓ అధికారి వెల్లడించారు.

### మండలి రద్దుకోసం....

తెలుగు మీడియం రద్దు, ఎస్సీ-ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు, ఆ తర్వాత... మూడు రాజధానుల బిల్లు! ఇలా తమ నిర్ణయాలను అడ్డుకుంటోందంటూ... శాసన మండలినే రద్దు చేయాలని సర్కారు భావించింది. హుటాహుటిన అసెంబ్లీలో తీర్మానం చేసి... కేంద్రానికి పంపించారు. వీలైనంత త్వరగా దీనిపై పార్లమెంటు ఆమోద ముద్ర పొంది... మండలిని అటకెక్కించాలనుకున్నారు. కానీ... పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో దీనిపై కనీస ప్రస్తావన కూడా రాలేదు. కరోనా విజృంభణ నేపథ్యంలో సోమవారం లోక్‌సభ నిరవధిక వాయిదా పడింది. మళ్లీ... వర్షాకాల సమావేశాల్లో ఏం జరుగుతుందో చెప్పలేం. వెరసి... మండలిని అటకెక్కించాలన్న సీఎం జగన్ పట్టుదల ఇప్పట్లో నెరవేరేలా కనిపించడంలేదు.

## న్యాయం చేయలేకపోయా: కేవీపీ

న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): "రాజ్యసభ సభ్యునిగా జాతికి సేవలందించే మహాభాగ్యం నాకు కలిగింది. అయితే ఆంధ్రాకు ఆశించిన స్థాయిలో న్యాయం చేయలేకపోయా" అని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అన్నారు. మంగళవారం రాజ్యసభలో జరిగిన 'వీడ్కోలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విభజన హామీలను అమలు చేయడంలో బీజేపీ అన్యాయం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టును జాప్యం లేకుండా నిర్ణీత కాల వ్యవధిలో లక్ష్యం పూర్తి చేయాలని కోరారు.

# పట్టా... ఎట్టా?

- కన్వేయెన్స్ డీడ్‌కు హైకోర్టులో చుక్కెదురు
- అనుబంధ ఐదు ఉత్తర్వులకూ ముప్పు!

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): "కన్వేయెన్స్ డీడ్ ... ఇదో అద్భుతమైన కాన్సెప్ట్. పేదల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తాం. ఐదేళ్ల తర్వాత అమ్ముకోవచ్చు. ఎన్‌ఓసీ కూడా అక్కరలేదు" అంటూ గత కొంతకాలంగా జగన్ సర్కారు ఘనంగా చాటుకుంటోంది. ఉద్దేశం మంచిదే కావొచ్చు! కానీ అమలు మాత్రం 'చట్టబద్ధం'గా లేదు. దీంతో... 'కన్వేయన్స్'కు హైకోర్టులో చుక్కెదురైంది. పేదలకు ఇచ్చే అసైన్డ్ ఇంటి స్థలాలపై డి-ఫారం పట్టాలకు బదులుగా కన్వేయెన్స్ డీడ్‌లు ఇస్తామంటూ ప్రభుత్వం జీవో 44 జారీ చేసింది. కానీ, ఇందులో చిన్న లాజిక్ మిస్ అయింది. ఏ చట్ట ప్రకారం కన్వేయెన్స్ డీడ్‌లు ఇస్తారో నిర్ధారించలేదు. జీవోపై ఎవరైనా కోర్టుకు వెళితే నిలబడదని సీనియర్ అధికారులు, అసైన్డ్ చట్టాలపై అవగాహన ఉన్న నిపుణులు ముందే హెచ్చరించినా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. చివరికి హైకోర్టులో చుక్కెదురైంది. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ చట్టం-1977 (పీఓటీ యాక్ట్) ప్రకారం పేదలకు సాగు భూములతోపాటు, ఇంటి స్థలాలు ఇస్తున్నారు. దీని ప్రకారం 20 ఏళ్లపాటు ఆ భూమిపై అనుభవ హక్కు లబ్ధిదారుకే ఉంటుంది. యాజమాన్య హక్కు మాత్రం ప్రభుత్వానికి ఉంటుంది. అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాతే పేదలకు పూర్తిస్థాయి హక్కులు వస్తాయి. ఆ స్థలాన్ని ఏ చిన్న కారణాలతోనూ ఇతరులకు అమ్మేకోకుండా, బయటి వ్యక్తులు దాన్ని హస్తగతం చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిరోధించేందుకు ఈ నిబంధన విధించారు. అయితే జగన్ సర్కారు కొత్తగా పేదలకు ఇచ్చే ఇంటి స్థలాన్ని ఐదేళ్ల తర్వాత అమ్ముకునేలా వెసులుబాటు కల్పించాలని భావించింది. ఇందుకు పీఓటీ చట్టం ఒప్పుకోదు! రెవెన్యూ అధికారులు 'కన్వేయన్స్ డీడ్' అనే కొత్త దారి కనుక్కున్నారు. ఇళ్ల స్థలాలకు డి-పట్టా స్థానంలో కన్వేయన్స్ డీడ్ ఇవ్వాలని, దాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించారు. ఐదేళ్ల తర్వాత ఆ భూమిని అమ్ముకునే నిబంధన కూడా దానిపై ముద్రించాలని స్పష్టం చేశారు. ఆ మేరకు... రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌ల నుంచి వరుసగా ఆరు రకాల జీవోలు ఇప్పించారు. ఇందులో భాగంగా వచ్చిందే జీవో 44.

### చట్టబద్ధత ఏదీ?

కన్వేయెన్స్ డీడ్‌లను రిజిస్ట్రేషన్ చేసే అధికారాన్ని రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 7 కింద తహశీల్దార్‌కు ఇచ్చారు. తహశీల్దార్‌కు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా హోదా ఇచ్చారు. మరి ఈ డీడ్‌లను ఏ చట్టం కింద ఇస్తున్నారు? ఏ చట్టం కింద వాటిని రిజిస్ట్రేషన్ చేయాలి? ఏ ప్రాతిపదికన ఐదేళ్ల తర్వాత అమ్ముకోవచ్చు? అనే కీలకమైన అంశాలను జీవోలో ప్రస్తావించలేదు. నిజానికి, అసైన్డ్ చట్టం కింద కన్వేయెన్స్ డీడ్‌లు చెల్లుబాటు కావని రెవెన్యూ అధికారులే చెబుతున్నారు. అందువల్ల... మొదట దానికి చట్టబద్ధత కల్పించిన తర్వాతే అమలుకు ఉత్తర్వులు ఇవ్వాల్సిందని, అప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని పేర్కొంటున్నారు. ఇప్పుడు మిగిలిన జీవోల చెల్లుబాటుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అవి కూడా ప్రమాదంలో పడినట్లేనని అధికారులు చెబుతున్నారు. కన్వేయెన్స్ డీడ్‌కు చట్టబద్ధత కల్పించడమొక్కటే ప్రభుత్వ ముందున్న మార్గం. అలాకాదని, పైకోర్టులకు వెళ్లినా ఫలితం ఉండకపోవచ్చని చెబుతున్నారు. తొలుత ఉగాదికే 25 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. తర్వాత ఏప్రిల్ 14కు వాయిదా వేశారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో... ఇప్పటికే సిద్ధమైన కన్వేయెన్స్ డీడ్‌లు చెల్లుబాటయ్యే పరిస్థితి లేదు. అంటే, పట్టాల ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి మొదలు పెట్టాల్సిందే. చట్టం చేసేందుకు ఇప్పటికిప్పుడు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి. లేదా... ఆర్డినెన్స్ జారీ చేయాలని నిపుణులు చెబుతున్నారు.

# 'ఆంగ్లం'పై అడ్డదారి!

(మొదటి పేజీ తరువాయి)

చిక్కులుంటాయి కాబట్టి, అటునుంచి నరుక్కురావడం మొదలుపెట్టింది. ప్రతి మండలానికి ఒక తెలుగు మీడియం స్కూలును ఏర్పాటు చేస్తూ సోమవారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇంగ్లిష్ మీడియం విధానాన్ని ఏకపక్షంగా, ఉన్నపళంగా అమలు చేయాలన్న సర్కారును వ్యతిరేకిస్తూ పలు పిటిషన్లు హైకోర్టులో నమోదయ్యాయి. కోర్టు ఆదేశంతో వీటిపై దాఖలు చేసిన కౌంటర్‌లో.. ఇంగ్లిష్ మీడియం అమలు వల్ల తెలుగు విద్యార్థులు ఇబ్బంది పడకుండా పలు చర్యలు తీసుకొంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందులో భాగంగానే మండలానికో తెలుగు మీడియం పాఠశాల ఏర్పాటు చేస్తామని, మైనర్ భాషలు కొనసాగిస్తామని, అన్ని పాఠశాలల్లో తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేస్తామని తెలిపింది. అయితే ఇందుకు సంబంధించి ఇప్పటివరకు హైకోర్టు తీర్పును వెలువరించలేదు. ఈలోపే మండలానికో తెలుగు మీడియం పాఠశాలను అధికారికంగా ప్రకటించేయడం గమనార్హం. తెలుగు మీడియం కోరుకునే విద్యార్థులకు సదరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసే ఈ పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామని విద్యాశాఖ తన ఉత్తర్వుల్లో తెలిపింది. విద్యార్థులు తమ గ్రామం నుంచి మండల కేంద్రం లోని తెలుగు మీడియం పాఠశాలకు చేరుకునేందుకు రవాణా చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొంది. ఒరియా, కన్నడ, తమిళం, ఉర్దూ మీడియాలను కొనసాగిస్తామని కూడా తెలిపింది. వీటికి సంబంధించిన పుస్తకాలు, కరదీపికను రూపొందించాలని ఎస్‌సీఈఆర్‌టీ ని ఈ శాఖ ఆదేశించింది. అన్ని మాధ్యమాలలోనూ తప్పనిసరి సబ్జెక్టుగా తెలుగు ఉంటుందని స్పష్టం చేసింది. అయితే, హైకోర్టు తుది తీర్పు కోసం ఎదురు చూస్తున్న భాషాభిమానులను సర్కారు తీరు బాధించింది. ఇది భాషా వివక్ష కాదా ? అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలలు ఒక కిలోమీటరు దూరం లోపే ఉండాల్సి ఉంటుందని, మండలానికి ఒక తెలుగు మీడియం స్కూలు పెడితే విద్యార్థులు అంత దూరం ఎలా ప్రయాణించగలరని పీడీఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. ఇలాంటి విధానాలతో అన్ని భాషలవారికీ సమన్యాయం ఎలా జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆ రంగు పోవాల్సిందే!

- ఎవరు అధికారంలో ఉంటే ఆ పార్టీ రంగులేస్తారా?
- హైకోర్టు అన్నీ పరిశీలించే తీర్పు చెప్పింది
- తేల్చి చెప్పిన సుప్రీం ధర్మాసనం
- వైసీపీ రంగులపై తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలైన గ్రామ, వార్డు సచివాలయాలకు వైసీపీ పతాకంలోని రంగులు పులమడంపై సుప్రీంకోర్టు మండిపడింది. దీనిపై హైకోర్టు ఇప్పటికే జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ జెండాను పోలిన రంగులు వేస్తే ఎలా అని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ కాషాయ రంగు వేస్తే ఒప్పుకొంటారా అని నిలదీసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ లావు నాగేశ్వర రావు, జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. 'ప్రభుత్వ కార్యాలయాలకు వేసిన రంగులు వైసీపీ జెండాలోని రంగులు వేర్వేరు' అని తెలిపారు. దీనితో ధర్మాసనం విభేదించింది. 'రెండూ ఒకే రంగులని స్పష్టంగా కనిపిస్తోంది' అని తేల్చిచెప్పింది. రంగుల విషయంలో ప్రత్యేకంగా చట్టం ఏమీ లేదని, హైకోర్టు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని మెహతా చేసిన వాదననూ తోసిపుచ్చింది. "దీనికి జాతీయ భవనాల కోడ్ వర్తిస్తుంది. హైకోర్టు అన్ని విషయాలను పరిశీలించింది. చట్ట ప్రకారమే కేసును పరిష్కరించింది. ఈ కేసును విచారించడానికి మాకు ఏ కారణమూ కనిపించడంలేదు" అంటూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

## మామా... సూపర్... అందుకే నీతోనే..

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చెరపకురా చెడేవు అన్నట్లు చంద్రబాబు మీదకి వెళ్తుందని సీబీఐకి అనుమతిస్తే అది కాస్త జగన్ అండ్ కోకి రివర్స్ అయిందని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సోమవారం రాత్రి ట్వీట్ చేశారు. చమత్కారంగా వెంకన్న చేసిన ట్వీట్ ఇది..

**ఏ2:** అల్లుడూ మనం వీకయ్యాం.

**ఏ1:** ఎక్కడ మామా?

**ఏ2:** కోర్టులు ఉతికి ఆరేస్తున్నాయ్. బాబుపైకి వెళ్తుందని సీబీఐకి అనుమతించాం. కానీ సీబీఐ వాళ్లు బాత్రూమ్‌లో బాబాయ్ కేసుతో మన దగ్గరకే వచ్చారు.

**ఏ1:** ఇప్పుడేం చేద్దాం!

**ఏ2:** మనమీదకొచ్చిన సీబీఐని రాజధాని భూముల కేసు పేరుతో వాళ్ల మీదకి పంపేద్దాం.

**ఏ1:** మన సబ్ కమిటీలు, సీఐడీ పట్టుకోలేనిది వాళ్లకేమి దొరుకుతుంది మామా?

**ఏ2:** దొరకదల్లుడూ..! నువ్వు ప్రెస్‌మీట్‌కి వచ్చి పెట్టిన పెంట, కోర్టుల దెబ్బలు, బాబాయ్ బాత్రూమ్ కేసు... డైవర్ట్ చేయొచ్చు.

**ఏ1:** నువ్వు సూపర్ మామ! అందుకే ఎక్కడికెళ్లినా నీతోనే! ఏం చేసినా నీ వెంటే!

**- బుద్దా ట్వీట్**

# పేదలకు 5 వేలివ్వండి

- 2 నెలలకు సరిపడా రేషన్ కూడా..
- లాక్‌డౌన్‌తో ఇబ్బందులు పడకుండా
- రైతుబజార్లలో చౌకగా కూరగాయలు
- యుద్ధప్రాతిపదికన ప్రజారోగ్య చర్యలు
- ముఖ్యమంత్రికి చంద్రబాబు లేఖ



అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారిని నియంత్రించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో లాక్‌డౌన్‌తో పేదలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వారికి రూ.5 వేల నగదు, రెండునెలలకు సరిపడా రేషన్ ఇవ్వాలని టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌కు సోమవారం లేఖ రాశారు. 'కరోనా తీవ్రతతో ప్రపంచ దేశాలన్నీ వణుకుతున్నాయి. మన దేశంలోని అనేక రాష్ట్రాల్లో కోవిడ్-19వైరస్ ఇప్పటికే శరవేగంగా విస్తరిస్తోంది. విదేశాల నుంచి వచ్చేవారిని క్వారంటైన్ చేయడం, విడిగా ఉంచడం, స్వాబ్‌లను ఇక వైరస్ ఎవరికీ సోకకుండా నిరోధించడంపైనే ప్రభుత్వాలు పెద్దఎత్తున దృష్టి పెట్టాల్సి ఉంది. కేవలం లాక్‌డౌన్ చేయడంతో ఆశించిన ప్రయోజనాలు నెరవేరవని, పెద్దఎత్తున ప్రజారోగ్య చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రపంచ ఆరోగ్య సమాఖ్య ఇప్పటికే సూచించింది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని మన రాష్ట్రంలో కూడా కరోనా నిరోధక చర్యలు త్వరితగతిన చేపట్టాలి' అని సూచించారు. 'విదేశాల నుంచి దాదాపు 15వేల మంది రాష్ట్రానికి చేరినట్లు తెలుస్తోంది. వాళ్లందరికీ క్వారంటైన్ చేయాలి. పకడ్బందీగా వారందరినీ విడిగా ఉంచాలి. అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్యం-పరిశుభ్రతపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. లాక్‌డౌన్ వల్ల అత్యధిక పేద కుటుంబాల ఉపాధికి గండిపడింది. ఇంట్లోనుంచి బయటకు రాకపోవడం వల్ల అటు ఉపాధి కోల్పోయి, ఇటు రోజువారీ ఆదాయం లేక రెండువిధాలా నష్టపోయారు. విపత్తులు సంభవించినప్పుడు బాధిత ప్రజానీకాన్ని ఆదుకోవడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి రెండు నెలలకు సరిపడా రేషన్ (బియ్యం, పప్పులు, వంటనూనె, చక్కెర, కూరగాయలు, ఇతర నిత్యావసరాలు) ప్రతి ఇంటికి డోర్ డెలివరీ చేయాలి. ప్రతి పేద కుటుంబానికి రూ.5వేలు నగదు తక్షణమే ఏమాత్రం జాప్యం చేయకుండా అందించాలి. ఈ విపత్కర సమయంలో పేదలను ఆదుకోవాలి' అని లేఖలో పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాలు అందుబాటులో ఉంచడంతో పాటు ధరలు పెరిగిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే కూరగాయల ధరలు 300 శాతం పెరిగినట్లుగా మీడియాలో చూస్తున్నామని.. రైతుబజార్లలో చౌక ధరలకే అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

# కిలో బీర 100

**ధర 3 రెట్లు పెరిగిన అరటి, చిక్కుడు**

## రైతుబజార్లు కిటకిట.. కొద్దిసేపటికే దుకాణాలు ఖాళీ

- ఇతర కూరగాయలదీ అదే దారి
- లాక్‌డౌన్‌లో వ్యాపారుల మాయాజాలం
- ఎగబడుతున్న జనం.. సిబ్బందికి కరోనా భయం
- విజయవాడలో రైతుబజార్ల మార్పు
- బ్లాక్ మార్కెటింగ్ చేస్తే అరెస్టే: కొడాలి



ఏలూరు పత్తేబాద రైతుబజారులో కిక్కిరిసిన జనం

అమరావతి, విజయవాడ, ఏలూరు, గుడివాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కరోనా ప్రభావం మార్కెట్‌పై పడింది. ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో జనం ఎక్కువ రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు నిల్వ చేసుకునేందుకు ఎగబడుతున్నారు. దీంతో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాలో నిన్నమొన్నటి వరకు కిలో గరిష్ఠంగా రూ.30కు అమ్మిన బీర, ఇప్పుడు రూ.100కు చేరింది. మార్కెట్‌లో ధరలను నియంత్రిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో ఎక్కడా కనిపించలేదు. చిక్కుడు, బీర, అరటికాయ ధరలు ఒక్కసారిగా మూడింతలు పెంచేశారు. ఉల్లి . కిలో రూ.25 నుంచి రూ.50కు పెరిగింది. పప్పుల ధరలన్నీ 5-8 రూపాయల చొప్పున పెంచేశారు. మార్కెట్‌లో ఎక్కడ చూసినా కృత్రిమ కొరత కనిపిస్తోంది. లాక్‌డౌన్ చేశారని, రేపటి నుంచి సరుకు అందుబాటులో ఉండదని వ్యాపారులు పెద్దఎత్తున ప్రచారం చేయడంతోపాటు ఉగాది సమీపిస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పల్లెల్లోనూ కూరగాయలకు విపరీతమైన డిమాండ్ పెరిగి సోమవారం కొరత ఏర్పడింది. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడం కూడా కారణంగా చెబుతున్నారు. అధికారులకు కొందరు ఫిర్యాదు చేసినా తేలిగ్గా తీసుకున్నట్టు సమాచారం. రైతుబజార్లలోనూ సోమవారం మధ్యాహ్నం వరకు ఎడాపెడా ధరలు పెంచి అమ్మకాలు చేశారు. ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం మార్కెట్లన్నింటిలోనూ ధరలు అదుపు తప్పాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ధరలు నియంత్రిస్తామని పశ్చిమగోదావరి జేసీ వెంకటరమణారెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగానూ లాక్ డౌన్‌తో నిత్యావసర వస్తువులకు డిమాండ్ వచ్చింది. కిరాణా దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, రైతుబజార్లు సోమవారం కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. జనం గుంపులుగా ఎగబడటంతో కొందరు వ్యాపారులు దుకాణాలను మూసేశారు. కొన్ని చోట్ల పోలీసులే ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావొద్దని హెచ్చరిస్తూ, దుకాణాలు మూయించారు. ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ అమలు కానుండటంతో కిరాణా సరుకులు, కూరగాయల కోసం ప్రజలు దుకాణాల వద్ద ఎగబడుతున్నారు. రెండురోజులుగా ప్రజారవాణా నిలిచిపోవడంతో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల రవాణా స్తంభించింది. దీంతో పట్టణాల్లోని రైతుబజార్లకు వినియోగదారులు పోటెత్తుతున్నారు. దాదాపు అన్ని రైతుబజార్లు కిటకిటలాడాయి. విశాఖ, విజయవాడ, గుంటూరు, కాకినాడ, రాజమండ్రి, తిరుపతి తదితర నగరాల్లో రైతుబజార్లు రద్దీగా మారాయి. రైతుబజార్లలోని కొన్ని స్టాల్స్‌లో ఉన్న కిరాణా సరుకులతో పాటు కూరగాయలను వారానికి సరిపడా తీసుకెళ్తున్నారు. దీంతో కొన్ని రకాల కూరగాయలు పూర్తిగా అయిపోయాయి. అడుగుబొడుగు కూడా వదలకుండా కొనేస్తుండటంతో కొద్దిసేపటికే రైతుబజార్లు ఖాళీ అవుతున్నాయి. విజయవాడలో ఆరు రైతుబజార్లు ఉండగా, సోమవారం ఒక్కో రైతుబజారుకు సుమారు 30వేల మంది వరకు వచ్చారు. కొద్దిసేపటికే దుకాణాలు ఖాళీ అవడంతో జనం బయటి మార్కెట్లను ఆశ్రయించారు. బయటి మార్కెట్లలో కిలో టమాటా రూ.80కు, వంకాయలు రూ.60కు విక్రయించారు. వంట నూనెల ధరలూ పెంచేశారు. వేరుశనగ నూనె లీటర్ ప్యాకెట్ రూ.130 నుంచి రూ.150కి, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.91 నుంచి రూ.100కి, పామాయిల్ రూ.82 నుంచి రూ.88కి పెంచారు. కాగా, రైతుబజార్లు మాత్రమే తమ పరిధిలో ఉంటాయని, ప్రైవేటు మార్కెట్లలో ధరలతో తమకు సంబంధం లేదని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

### ఈ నెల 29నే రేషన్: మంత్రి నాని

లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్రంలో పేదలను ఆదుకునేందుకు 1.29 కోట్ల కుటుంబాలకు ఈ నెల 29న రేషన్ పంపిణీ చేయనున్నామని మంత్రి కొడాలి నాని తెలిపారు. పనుల కోసం బయటకు వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారి కోసం ఏప్రిల్ 4న కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున వలంటీర్ల ద్వారా అందజేస్తామన్నారు. దీనికోసం సీఎం జగన్ రూ.1500 కోట్లు కేటాయించారన్నారు.

### కృష్ణాజిల్లా రైతుబజార్ల వేళలు మార్పు..

లాక్‌డౌన్ నేపథ్యంలో కృష్ణా జిల్లా యంత్రాంగం రైతుబజార్ల వేళలను మార్చింది. విజయవాడలోని రైతుబజార్లు ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు మాత్రమే పనిచేస్తాయి. మిగిలిన ప్రాంతాల్లో ఉదయం పది గంటల వరకు పనిచేస్తాయి. అలాగే, ఎక్కువ మంది వచ్చినా మూడడుగుల దూరం పాటించేలా విశాలమైన ప్రాంగణాల్లోకి విజయవాడలోని రైతుబజార్లను తరలించారు. స్వరాజ్‌మైదానంలోని రైతుబజార్‌ను ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోకి, పటమట రైతుబజార్‌ను పటమట హైస్కూల్‌లోకి, కేదారేశ్వరపేట రైతుబజార్‌ను వన్‌టౌన్ గాంధీ హైస్కూల్‌లోకి మార్పు చేశారు. మంగళవారం నుంచే అది అమల్లోకి వస్తుందని కలెక్టర్ ఇంతియాజ్ ప్రకటించారు. కాగా, నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల మంత్రి కొడాలి నాని హెచ్చరించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వ్యాపారులను అరెస్ట్ చేస్తామన్నారు. ఈ నెల 31 వరకూ కృష్ణా జిల్లాలో 144 సెక్షన్ అమలవుతుందని చెప్పారు.

# ఇంటికే అంగన్‌వాడీ సరుకులు

- కరోనా దృష్ట్యా ప్రభుత్వం నిర్ణయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దిగొచ్చింది. కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా అంగన్‌వాడీలకు కీలక వెసులుబాటు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లాక్‌డౌన్ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం... మార్చి 31 దాకా టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్)ను అమలు చేస్తూ సోమవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికన్నా ముందు ఊగిసలాట ధోరణి కొనసాగింది. టీహెచ్‌ఆర్‌ను అమలు చేయాలని శనివారమే అధికారులు ఆదేశాలు ఇచ్చారు. కానీ అప్పటికింకా ప్రభుత్వం ఆ ప్రతిపాదనకు అధికారికంగా ఆమోదం తెలపనందున ఆ నిర్ణయాన్ని అమలు చేయవద్దంటూ ఆదివారం ఆదేశించారు. దీంతో అంగన్‌వాడీలు, ఉద్యోగులు, పేదల్లో ఆందోళన మొదలైంది. ఈ పరిణామంపై 'అంగన్‌వాడీలకు పెద్ద కష్టం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అంగన్‌వాడీలకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. తాజా ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 55వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారీగా భోజనం చేసే ఆరేళ్లలోపు చిన్నారులకు నేరుగా ఇంటికే ఆహార పదార్థాలు, గుడ్లు, పాలు పంపిస్తారు. అంటే ఒకేసారి ఈనెల 31 వరకూ సరిపడా ఆహారపదార్థాలను లబ్ధిదారులకు అందిస్తారు.

## ఐదేళ్లలో ఏపీకి లక్షా 92వేల కోట్లు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్ల కాలంలో... 2015-16 నుంచి 2019-20 వరకు రూ. 192037.04 కోట్లు ఇచ్చామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ వెల్లడించారు. అందులో పన్నుల వాటా, గ్రాంట్లు కలిపి రూ. 175877.03 కోట్లు, ఏపీ విభజన చట్టం కింద చేసిన ఆర్థిక సాయంలో రూ. 16160.01 కోట్లు ఉన్నట్లు లోక్‌సభలో టీఆర్ఎస్ ఎంపీ కొత్తా ప్రభాకర్ రెడ్డి, వైసీపీ ఎంపీ వంగా గీత అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి సోమవారం లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

## ఈఎస్ఐ అవకతవకలపై నివేదిక కోరాం: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ఈఎస్ఐ నిధుల అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కోరామని కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ వెల్లడించారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి సోమవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కాకినాడలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి సూత్రప్రాయంగా ఆమోదించామని వైసీపీ ఎంపీ మార్గని భరత్ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## మహాదుర్గగా భ్రమరాంబ



శ్రీశైలం, మార్చి 23: ఉగాది మహోత్సవాలలో భాగంగా శ్రీశైలంలో రెండో రోజు సోమవారం భ్రమరాంబదేవి మహాదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మల్లికార్జునుడు కైలాసవాహనంపై సేవలందుకున్నారు. ఉత్సవమూర్తులను ఆలయం లోపలే ఊరేగించారు. కరోనా వైరస్ వ్యాప్తిని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనాలను నిలిపివేశారు.

## అసెంబ్లీ సమావేశాలు వాయిదా వేయండి

- సచివాలయ ఉద్యోగుల సంఘం నేత వినతి

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలను వాయిదా వేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆర్డినెన్సు ద్వారా కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించుకునే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం లాక్‌డౌన్ ఆదేశాలు ఇవ్వడంతో సచివాలయానికి ఉద్యోగుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని.. వీలైనంత మేర ఇంటి నుంచే విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. కాగా.. పారిశుధ్య విభాగంతోపాటు కరోనా నియంత్రణ విభాగాల్లో పనిచేసే వారికి సాయం చేసేందుకు సచివాలయ ఉద్యోగులు ఒకరోజు వేతనాన్ని సీఎం సహాయ నిధికి ఇవ్వాలని నిర్ణయించినట్లు వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఉద్యోగుల ఏపీజేఏసీ ఛైర్మన్ చంద్రశేఖరరెడ్డి కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఒక రోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

## పేదలకు ఇబ్బంది లేకుండా చూడాలి: కన్నా

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): "కరోనా కట్టడికి లాక్ డౌన్ చేసిన ప్రభుత్వం పేదలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. ఉపాధి కోల్పోతున్న పేదలకు ఆర్థిక సహాయం అందజేయాలి" అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం సీఎంకు ఆమేరకు ఓ లేఖ రాశారు. ఏపీలో తెల్లకార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ తక్షణమే ఉచితంగా రేషన్ అందించాలన్నారు. గ్రామ వాలంటీర్లకు పంపిణీ ద్వారా వైరస్ వ్యాపించే ప్రమాదం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా బార్లు, వైన్ షాపులు, ఇతరత్రా జనరద్దీ ప్రాంతాలను మూసివేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా నియంత్రణలో తీసుకొంటున్న చర్యలు అభినందనీయమని కన్నా ట్విటర్‌లో కొనియాడారు.

## కరోనాపై కేంద్రానిది మొద్దు నిద్ర!: సాకే

విజయవాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కరోనా ప్రమాదం గురించి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ... నాలుగు వారాల క్రితం నుంచే హెచ్చరిస్తోంది. అయినా కేంద్రం మొద్దు నిద్రపోయింది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల పేరుతో నిర్లక్ష్యంగా వ్యవహరించింది" అని పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ విమర్శించారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలను కరోనాబారి నుంచి కాపాడటానికి ప్రభుత్వానికి అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. కేవలం రూ.1000 ప్రకటించి చేతులు దులుపుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు.

## అడుసు తొక్కనేల.. కాలు కడుగనేల?: తులసిరెడ్డి

విజయవాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): "పదేపదే తప్పులు చేయడం, కోర్టులతో అక్షింతలు వేయించుకోవడం వైసీపీ ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. 'అడుసు తొక్కనేలా? కాలు కడుగనేల?' అన్నట్టుగా జగన్ పాలన ఉంది" అని కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు తులసిరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

## విందుకు విచ్చేసిన వ్యక్తికి 'పాజిటివ్'!

- కరోనా కలకలంతో గ్రామం లాక్‌డౌన్

చింతలపూడి, మార్చి 23: ఐదు రోజుల క్రితం గ్రామంలో జరిగిన గృహ ప్రవేశ వేడుకకు కరోనా పాజిటివ్ వ్యక్తి హాజరయ్యాడన్న విషయం తెలిసి.. ఆ ఊరంతా ఉలిక్కిపడింది. అధికారులు అప్రమత్తమై ఆ గ్రామాన్ని లాక్‌డౌన్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం రాఘవాపురంలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ నెల 18న గ్రామంలో జరిగిన గృహ ప్రవేశ వేడుకకు తెలంగాణలోని కొత్తగూడేనికి చెందిన పోలీసు అధికారి కుటుంబం హాజరైంది. అయితే ఆ కుటుంబంలోని వ్యక్తి పది రోజుల క్రితమే లండన్ నుంచి వచ్చాడు. ఆ వ్యక్తి కూడా విందుకు వచ్చి వెళ్లాడు. ఆ తర్వాత అతను అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేరాడు. పరీక్షల్లో కరోనా పాజిటివ్ అని నిర్ధారణ కావడంతో అతన్ని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారని స్థానిక వైద్యాధికారులు చెబుతున్నారు. దీంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ, పోలీసులు గృహ ప్రవేశ వేడుకకు ఏ ఏ ఊర్ల నుంచి ఎవరెవరు వచ్చారన్నది ఆరా తీస్తున్నారు. రాఘవాపురం గ్రామం చుట్టూ రహదారులను మూసివేసి.. ఊరిలోని వ్యక్తులను బయటకు వెళ్లకుండా.. బయట వ్యక్తులను లోపలికి రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటికీ సర్వే చేస్తున్నారు. టి.నరసాపురం, వెంకటాద్రిగూడెం, భీమవరం, ఉంగుటూరు, కృష్ణా జిల్లాలోని చాట్రాయి, తుమ్మగూడెం ప్రాంతాల నుంచి సుమారు 150 మంది వరకు ఈ విందుకు హాజరయ్యారని గుర్తించారు. ఇప్పటివరకు 75 మందిని గుర్తించి వారందరికీ నోటీసులు ఇచ్చి, హోం ఐసోలేషన్‌లో ఉంచాలని ఆ ఏరియా అధికారులకు సూచనలు ఇస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు.



రాఘవాపురం గ్రామంలోకి ఎవరూ రాకుండా అడ్డుగా వేసిన బల్లలు

**ట్విటర్‌లో టీడీపీ**

## జగన్ క్రూరుడు: అయ్యన్న

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని లక్ష్యం చేసుకొని ట్విటర్ వేదికగా తెలుగుదేశం నేతలు విరుచుకుపడ్డారు. కరోనాని అడ్డుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, మద్యం దుకాణాలు మూసేయకుండా నడపడం వెనుక లిక్కర్ మాఫియా హస్తం ఉందని ఆరోపించారు. మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు "వైఎస్ జగన్‌ది క్రూరమైన మనస్తత్వం. అడ్డదారిలో స్థానిక సంస్థలు కైవసం చేసుకోవడానికి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. కరోనా ప్రభావం లేదు అని సుప్రీం కోర్టుని కూడా తప్పుదోవ పట్టించాలని చూశారు. ఆఖరికి సీఎస్‌ని బెదిరించి బలవంతంగా కరోనా లేదు అంటూ లేఖ రాయించారు. సుప్రీం కోర్టులో మొట్టికాయి పడ్డాక నిజాలు బయటపెట్టారు. మొన్నటి వరకూ లేని కేసులు ఉన్నట్లుండి ఎలా వచ్చాయి? రాష్ట్ర ప్రభుత్వం కరోనాని అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇక్కడి పరిణామాలపై కేంద్రం దృష్టి పెట్టకపోతే ప్రజల ప్రాణాలను జగన్ గాల్లో కలిపేయడం ఖాయం" అంటూ ట్వీట్ చేశారు.

## 'మందు'కూడా నిత్యావసరమే: అచ్చెన్న

"తుగ్లక్, ముఖ్యమంత్రి అయితే మందు కూడా నిత్యావసరమే... 'నేనొస్తున్నా... సంపూర్ణ మద్యపాన నిషేధమే' అన్న జగన్ కరోనా వచ్చి జనాలు చస్తున్నా చెత్త మందు ద్వారా వచ్చే ఆదాయాన్ని మాత్రం వదులుకోవడానికి సిద్ధపడటం లేదు. కల్తీ సారా కంటే దారుణమైన బ్రాండ్లు అమ్మడానికి కోట్లు కొట్టేశారు. ఆ మందు కరోనా కంటే ప్రమాదం. ఇప్పుడు సడన్‌గా షాపులు మూసెయ్యడానికి దొంగ లిక్కర్ మాఫియా అంగీకరించినట్లు లేదు. ఇచ్చే రూ.1000 మందు అమ్మి వెనక్కి తీసేసుకోవాలి... అంతేగా రివర్స్ టెండరింగ్ సీఎం గారూ!" అంటూ అచ్చెన్నాయుడు ట్వీట్ చేశారు.

## పేపర్లు కొట్టేసినోడు సీఎం అయితే...: బుద్దా

"పదో తరగతిలో పేపర్లు కొట్టేసిన వాడు ముఖ్యమంత్రి అయితే.. కరోనా కొరియా నుండి వస్తుంది. పేరాసిటమాల్ వేస్తే తగ్గిపోతుంది. బ్లీచింగ్ వేస్తే చచ్చిపోతుంది. కరోనా మీకు రాకుండా జాగ్రత్తపడండి సాయిరెడ్డి గారూ. లేకపోతే వైఎస్ జగన్ డాక్టర్ అవతారమెత్తి బ్లీచింగ్ పౌడర్‌తో మీ వెంట పడతారు" అని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ట్వీట్ చేశారు.

## సీఎం ప్రజలకు మరింత దగ్గరవ్వాలి: వర్ల

"జనతా కర్ఫ్యూని జయప్రదం చేసిన అందరికీ నమోవాకాలు. అవిశ్రాంతంగా సేవలందించిన ఆరోగ్య, పోలీస్ శాఖలకు అభివాదములు. మన ప్రభుత్వం ఇంకా ప్రజామోదాన్ని పొందాలి. ముఖ్యమంత్రి ప్రజలకు దగ్గరవ్వాలి. అనునిత్యం ఈ పనిమీద ఉన్నట్లు నమ్మకం కల్పించాలి. ప్రజలకు అభిముఖంగా ఉంటూ మాట్లాడాలి" అని వర్ల రామయ్య ట్వీట్ చేశారు.

## కోర్టులు మొట్టిందే జగన్‌కు నిద్రపట్టదు: లోకేశ్

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): "నెలకి హై కోర్టులో ఆరు మొట్టికాయలు, సుప్రీం కోర్టులో మూడు తలంటులు ఉండకపోతే వైఎస్ జగన్‌కు నిద్రపట్టదు. కరోనా దెబ్బకు పేదవాళ్లు పనులు లేక ఇబ్బందిపడుతుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదు... అర్థం చేసుకోండి అంటున్న జగన్... రూ.1400 కోట్లు వృథా చేసి వైసీపీ రంగులు ఎందుకేశారో చెప్పాలి. అన్ని చోట్లా నా రంగులే ఉండాలనుకోవడం సైకో మనస్తత్వంలో స్టేజ్ 2. గ్రామాల్లో వెసీపీ రంగుల కోసం రూ.1400 కోట్లు ప్రజా ధనం వృథా చేశారు. ఇప్పుడు వాటిని చెరపడానికి మరో రూ.1400 కోట్లు... మొత్తం రూ.2800 కోట్లు. ఎవరి సొమ్ము జగన్?"అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

## పేదలను మభ్యపెట్టిన జగన్: బొండా ఉమ

విజయవాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): "కోర్టు పరిధిలోని అమరావతి భూములను లక్ష మంది పేదలకు పంచుతామని ప్రభుత్వం మభ్యపెట్టింది. జీవో నంబరు 107 ద్వారా కుట్రకు తెరదీసింది. దీంతో అమరావతి రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పు చెప్పింది" అని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత బొండా ఉమ విమర్శించారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అమరావతి భూములను సీఆర్‌డీఏ ఒప్పందం ప్రకారమే చేయాలని, అమరావతి ప్రాంతంలోని పేదవాళ్లకు మాత్రమే ఇవ్వాలని హైకోర్టు చెప్పడం ప్రభుత్వానికి చెంపపెట్టు అని విమర్శించారు. టీడీపీ హయాంలో లక్షమంది పేదవాళ్లకు పక్కా ఇళ్లు కట్టించాలని జక్కంపూడిలో భూమి కొనటానికి కేటాయించిన రూ.100 కోట్లను ఈ ప్రభుత్వం రద్దు చేసిందని ఉమ విమర్శించారు. పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించే వరకు టీడీపీ పోరాటం చేస్తుందన్నారు.

# రాజధానికి సొమ్ములేదు.. రంగులు వేసేందుకుందా?

**97వ రోజు కొనసాగిన రాజధాని ఆందోళన**

- వెయ్యి కోట్లు ఖర్చు పెట్టండి
- అద్భుత నగరం సాక్షాత్కారం
- ప్రభుత్వానికి రైతుల విన్నపం
- రచ్చబండలే వేదికగా దీక్షా శిబిరాలు
- వంతుల వారీగా రైతుల నిరసన
- వాడవాడలా 'జై అమరావతి' నినాదాలు

గుంటూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): "రాజధాని నిర్మాణానికి సొమ్ములేదు.. ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులేసేందుకు మాత్రం సొమ్ములున్నాయా?" అంటూ రాజధాని రైతులు ప్రభుత్వాన్ని నిలదీశారు. రాజధాని గ్రామాల్లో ఉన్న రచ్చబండలే సోమవారం దీక్షా శిబిరాలయ్యాయి. రైతులు, మహిళలు వంతుల వారీగా వచ్చి దీక్షల్లో కూర్చున్నారు. రాజధానికి మద్దతుగా నినాదాలు చేశారు. "వెయ్యి కోట్లు ఖర్చు పెడితే అమరావతిలో 80% పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు పూర్తయ్యేవి. ప్రభుత్వ భవనాలకు రూ.1,300 కోట్లు ఖర్చు చేసి మీ పార్టీ రంగులు వేశారు. కోర్టు మొట్టికాయలతో మరో రూ.వెయ్యి కోట్లతో ఆ రంగులు మార్చాలి. ఇదంతా ప్రజా ధనం కాదా? అమరావతిపై కుంటి సాకులు చెబుతూ ఎందుకంత కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



దీక్షాశిబిరంలో చేతులు శుభ్రం చేసుకుంటున్న రైతులు

రాజధానిగా అమరావతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళనలు సోమవారానికి 97వ రోజుకు చేరాయి. 3 రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 29 గ్రామాల్లో రైతులు, మహిళలు, కూలీలు ఉద్యమాన్ని హోరెత్తించారు. 'జై అమరావతి' నినాదాలతో మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకించారు.

### దూరం.. దూరం!

కరోనా ఎఫెక్ట్‌ను తగ్గించేందుకు తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తున్నట్టు రాజధాని రైతులు చెప్పారు. సామాజిక దూరం పాటిస్తూ నిరసనలు తెలిపారు. గ్రామాల్లోని ప్రధాన సెంటర్లు, రేడియో రూమ్‌లు, రచ్చబండలు, పాఠశాల ఆవరణలు దీక్షా శిబిరాలుగా మారాయి. విడతల వారీగా రైతులు, మహిళలు శిబిరాల వద్ద నిరసనలు తెలిపారు. కోర్టుల తీర్పులతోనైనా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### గ్రామ, గ్రామాన శిబిరాలు

నిన్నటి వరకు మందడం, తుళ్లూరు, వెలగపూడి, కృష్ణాయపాలెం, పెదపరిమి, ఎర్రబాలెం, తాడేపల్లి, మంగళగిరి ఇలా ముఖ్యమైన సెంటర్లలో దీక్షా శిబిరాలను నిర్వహించిన రైతులు కరోనా ఎఫెక్ట్‌తో ఉద్యమం తీరు మార్చారు. 29 గ్రామాల్లో ఎక్కడికక్కడ శిబిరాలను ఏర్పాటు చేశారు. వాటిలో పదుల సంఖ్యలో ఆందోళనకారులు దూరం దూరంగా కూర్చొని నిరసనలు తెలిపారు. వంటావార్పును కరోనా దృష్ట్యా రైతులు సోమవారం నిలిపివేశారు.

### కొనసాగిన 'అమరావతి వెలుగు'

రాజధానిపై ప్రభుత్వతీరు మారాలనే డిమాండ్‌తో 'అమరావతి వెలుగు' కార్యక్రమం కొనసాగింది. సోమవారం రాత్రి 7.30కు విద్యుత్ నిలిపివేసి కొవ్వొత్తులు వెలిగించి మహిళలు నిరసన తెలిపారు. ఇళ్ల ముందు చేపట్టిన 'సేవ్ అమరావతి' ముగ్గుల నిరసన కొనసాగించారు.

# ఫీజు రీయింబర్స్‌కు షరతులు!

- జాబితాలో చేర్చాలంటూ ముందుగానే కాలేజీలు దరఖాస్తు చేసుకోవాలట!
- ఆర్థికభారం తగ్గించుకునేందుకు సర్కారు ఎత్తుగడ

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని ఉదారంగా ప్రకటించిన ప్రభుత్వం... ఆచరణలో మాత్రం ఇందుకయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు అన్ని అస్త్రాలను ప్రయోగిస్తోంది. ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ద్వారా ఇప్పటికే ఇంజనీరింగ్ కాలేజీలకు ట్యూషన్ ఫీజులో భారీగా కోత విధిస్తూ సిఫారసులు తెప్పించుకున్న ప్రభుత్వం... వాటిని అధికారికంగా ప్రకటించకుండానే 'జగనన్న విద్యా దీవెన'కు మార్గదర్శకాలంటూ సోమవారం కొత్త ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం నుంచి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కావాలనుకునే విద్యాసంస్థలు తమను జాబితాలో చేర్చాలని కోరు తూ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. గతంలో ఈ పద్ధతి లేదు. కనీసం తమ ఫీజు ఎంతో తెలియకుండానే మార్గదర్శకాలకు ఒప్పుకోవాలంటూ ప్రభుత్వం స్పష్టం చేయడంపై కాలేజీల యాజమాన్యాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఒక పద్ధతి అంటూ లేకుండా ఫీజులను సిఫారసు చేయించుకుని, అదనపు భారం పడకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతున్నట్లు వీటి ద్వారా తెలుస్తోందని కాలేజీలు అంటున్నాయి. విద్యాసంస్థలు కోర్టులకు వెళ్లకుండా కట్టడి చేయడం కూడా దీని ఉద్దేశమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### వసతి దీవెనకు 1090 కోట్లు

రాష్ట్రంలోని విద్యార్థులకు స్కాలర్‌షిప్పులకు బదులుగా అందిస్తున్న 'జగనన్న వసతి దీవెన'కు వచ్చే ఏడాది బడ్జెట్‌లో రూ1090 కోట్లకు అన్ని సంక్షేమశాఖలు ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. ఈ పథకం కింద 11.36 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించనున్నారు.

### మార్గదర్శకాలు ఇలా..

- నోటిఫై చేసిన ఫీజులను ఒప్పుకోవాలి.
- క్యాపిటేషన్ ఫీజు తీసుకోరాదు.
- విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను కాలేజీలు తమ వద్ద ఉంచుకోరాదు.
- యూజీసీ, ఏఐసీటీఈ, పీసీటీ, ఉన్నత విద్యామండళ్లు ఎప్పటికప్పుడు ఇచ్చే మార్గదర్శకాలను పాటించాలి.
- ఆన్‌లైన్ అడ్మిషన్/అఫిలియేషన్ మాడ్యూల్స్‌ను అనుసరించాలి.
- విద్యాసంస్థలు తమ అకడమిక్ పెర్ఫార్మెన్స్ రికార్డును అప్‌లోడ్ చేయాలి.
- బయోమెట్రిక్ అటెండెన్స్‌ను అమలు చేయాలి.
- సెక్యూరిటీ/డేటా రహస్యాల ప్రొటోకాల్‌ను పాటించాలి.

# కవ్వించి కాల్చేశారు..!

- జవాన్ల హత్యకు సూత్రధారి ఇడమ!!
- పోలీసులపై పోరుకు ప్రత్యేక బెటాలియన్లు
- బుర్కాపాల్‌లో పాల్గొన్నది వన్ బెటాలియన్
- ధ్రువీకరించిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు

చింతూరు, మార్చి 23: ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ పహార్' పేరిట తమ ఏరివేతకు బయల్దేరిన జవాన్లను మట్టుపెట్టేందుకు మావోయిస్టులు వివిధ వ్యూహాలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం వారు ప్రత్యేక బెటాలియన్లను ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. అందులో భాగంగానే బస్తర్ డివిజన్ కేంద్రంగా పని చేస్తున్న మావోయిస్టు వన్ బెటాలియన్ శనివారం బుర్కాపాల్‌లో జవాన్లపై దాడికి దిగినట్లు ధ్రువీకరించారు. ఆ బెటాలియన్‌కు మావోయిస్టు నేత ఇడమ నాయకత్వం వహించినట్లు కూడా తెలిపారు. శుక్రవారం బుర్కాపాల్, చింతగుప్ప పోలీసు క్యాంపుల్లో విధులు నిర్వర్తిస్తున్న డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, గ్రేహౌండ్స్ బలగాలు మొత్తం 251 మంది గ్రూపులుగా అడవిలోకి చొచ్చుకుపోయారు. దీనిని పసిగట్టిన మావోయిస్టులు.. వీరిలో ఒక గ్రూపును టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అడవిలో పరుగులు తీస్తూ జవాన్లను కవ్వించారు. అది తెలియని జవాన్లు మావోయిస్టులపై కాల్పులు జరుపుతూ వెళ్లారు. చివరకు వారి గన్స్‌లో బుల్లెట్లు అయిపోయాయి. ఆ వెంటనే మావోయిస్టులు ఒక్క సారిగా జవాన్లపై విరుచుకుపడ్డారని తెలిసింది. బుల్లెట్లు లేకపోవడంతో జవాన్లు ప్రాణాలు పోగొట్టుకోవలసి వచ్చిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. బస్తర్‌లో నక్సల్ నేత రామన్న తర్వాత అంతటి స్థానాన్ని సొంతం చేసుకున్న ఇడమ.. తాజా ఘటనకు వ్యూహం రచించినట్లు పోలీసు వర్గాలు ధ్రువీకరించాయి. బస్తర్‌లో మొత్తం 50 వేల మంది కేంద్ర, రాష్ట్ర జవాన్లు మోహరించి ఉన్నారని.. సాయుధ మావోయిస్టులు కేవలం 800 మంది వరకే ఉన్నట్లు బస్తర్ ఐజీ సుందరరాజ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మావోయిస్టులను ఏరివేయడం విషయమేమి కాదన్నారు. ఇడమపై ఇప్పటికే పలు కేసులున్నాయని.. అతడి తలపై రూ.50 లక్షలకు పైబడి రివార్డు కూడా ఉందని తెలిపారు. కాగా.. బుర్కాపాల్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపట్టింది.

కరోనా మీద యుద్ధం–1

# ముప్పు ముంగిట

కనీవినీ ఎరుగని ఉత్పాతమిది. భూకంపమో సునామీయో వరదలో క్షామమో అయితే అవన్నీ తెలిసినవే, విన్నవే, అనుభవించినవే. ఊళ్ల కుఊళ్లు శ్మశానాలుగా మారిపోయిన మహమ్మారులు, ఉన్న ఊళ్లు వదిలి పరిగెత్తించిన గత్తరలు చరిత్రలో అనేకం. కానీ, ఇది వేరు. ఈ జాతికే చెందిన పూర్వపు ప్రమాదాల కంటె కూడా ఇది వేరు. ఇది లోకాన్ని మొత్తంగా చుట్టేసింది. అభివృద్ధి చెందిన దేశాలనే అల్లల్లాడిస్తోంది. కరోనా అనీ కోవిడ్ 19 అనీ పిలుచుకుంటున్న ఒక రోగక్రిమి మనుషుల శ్వాసకోశం మీద దాడిచేసి ఊపిరి హరిస్తున్నది. బలహీనులను వయోధికులను గురిపెట్టి బాధిస్తున్నది.

మనుషుల మధ్య ఉండే సామీప్యం మీద ఆధారపడి వ్యాపిస్తున్న ఈ వ్యాధికి నివారణ, ఆ సామీప్యాన్ని నివారించడం లేదా శుభ్రీకరించడం. వ్యాధి సోకిన వారి ముక్కు నుంచి, నోటి నుంచి తుమ్ముదగ్గుల ద్వారా వెలువడే తుంపర్లలోని సూక్ష్మభాగాలలో ఈ క్రిమి దాగి, మరొకరికి ప్రసారమవుతుంది. చేతుల మీద వాలిన క్రిమి కరచాలనంతో ఎదుటివారిచేతికి చేరుతుంది, అదే చేతితో ముఖాన్ని ముట్టుకుంటే తన మీద కూడా దాడిచేస్తుంది. ఈ వ్యాధి ఎట్లా వస్తుంది, ఏమేమి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏ దేశంలో దాని తీవ్రత ఎంత ఉన్నది అనే సమాచారం గత కొద్దిరోజులుగా కుప్పలుతెప్పలుగా వస్తున్నది. వాటిలో కొన్ని అబద్ధాలు, అర్థ సత్యాలు, వక్రీకరణలు, దుష్ప్రచారాలు ఉండడం విచారం. వైరస్ మీద చేస్తున్నట్టే, ఫేక్‌వార్తల మీద కూడా యుద్ధం చేయవలసి వస్తున్నది.

చైనాలో మొదలైన ఈ క్రిమి ఇప్పుడు దాదాపు భూప్రదక్షిణం చేసింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణీకులతో భారతదేశంలో మొదట వ్యక్తమైన ఈ వ్యాధికారక క్రిమి, ఇప్పుడు విదేశాల నుంచి వచ్చినవారి కుటుంబీకులకు, సన్నిహితులకు కూడా సోకడం మొదలైంది. అంతూ దరీ చిక్కకుండా, సమూహంలో విస్తృతంగా వ్యాపించే దశను మూడో దశ అనీ, ఆ దశలోకి భారతదేశం ప్రవేశించకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రప్రయత్నాలు చేస్తున్నాయి. ఆ దశలోకి ప్రవేశించడం అంటూ జరిగితే, దానంత దుస్థితి భారతదేశానికి మరొకటి ఉండదు. దేశమంతా వ్యాపించిన వ్యాధి, చాలని ఆస్పత్రులు, వైద్యవసతులు, లెక్కకు మిక్కిలి మరణాలు, మధ్యయుగాల నాటి దుర్భరమైన ఏ మహమ్మారియో పునరావృత్తమైనట్టు ఏర్పడే సన్నివేశం.

ఇటలీ, ఇరాన్, అమెరికా వంటి దేశాలు చేజేతులా జాగు చేసి, పరిస్థితిని విషమింపజేసుకున్నాయని తెలుసుకుంటున్నాము. భారతదేశం సరైన సమయంలో స్పందించిందో లేదో తెలియదు కానీ, స్పందన మాత్రం చురుకుగా ఉన్నది. చర్యలు వేగం పుంజుకున్నాయి. అందరి కంటె ముందే కరోనా స్పర్శ తగిలిన కేరళ తొలిదశలో శీఘ్రచర్యలు తీసుకున్నది. మార్చి మాసారంభం నుంచి తెలంగాణ రాష్ట్రంలో కరోనా ప్రకంపనలు మొదలయ్యాయి. జాతీయ స్థాయిలో ప్రభుత్వం స్పందించి, ప్రధానమంత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించడానికి ఇరవై రోజుల కాలం పట్టింది, కానీ, అంతకుముందే తెలంగాణలో చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రధాని మోదీ సందేశంతో, జనతా కర్ఫ్యూ పిలుపుతో కరోనా వ్యతిరేక ప్రచారం ఉద్యమస్థాయికి చేరింది.

అయోమయంలోను, భీతిలోను ఉన్న ప్రజలకు, విశ్వసనీయమైన, దృఢమైన నాయకత్వం కావాలి. తమ మాట ఆలకిస్తూ, తమను నడిపించే చేయి కావాలి. దేశవ్యాప్తంగా ఒకే నేత ద్వారా ఈ ఆశ్వాసన లభిస్తుందని చెప్పలేము. కానీ, ప్రాంతీయంగా, రాష్ట్రస్థాయిలో ఈ పోరాటానికి గట్టి నాయకత్వం ఇచ్చేవారు కావాలి. అదే సమయంలో రాజకీయాల ప్రతికూల లక్షణాలు కరోనా కట్టడిలో కనిపించకూడదు. కేరళలో సిపిఎం ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రతిపక్ష నేతతో కలిసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అంతటి ఉదారత అన్నిటా ఆశించలేము కానీ, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సకాలంలో రంగంలోకి దిగి, ప్రజలకు ఒక భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. జనప్రియత గల నాయకత్వం ఉన్నచోట, ప్రజలకు అభయం దొరుకుతుంది. దురదృష్టవశాత్తూ, ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ నాయకత్వం స్పందన ఆశించిన స్థాయిలో లేదు. కరోనా ప్రమాదానికీ, స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పడిన వివాదం నేపథ్యంలో, ముఖ్యమంత్రి జగన్ అసలు కరోనా అంశంపైనే విముఖత పెంచుకున్నారు. జనతాకర్ఫ్యూ నేపథ్యంలో ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆయన నిర్లిప్తత కొట్టొచ్చినట్టు కనిపించింది. నిజానికి, తొలిదశలో కేవలం ఆరోగ్యశాఖ యంత్రాంగమే కరోనా జాగ్రత్తలు తీసుకుంటున్నప్పుడు, క్షేత్రస్థాయిలో విదేశాలకు వెళ్లివచ్చినవారి సమాచారసేకరణ వంటి కీలకచర్యలు చేపట్టారు. ఆ మాత్రం చొరవ కూడా ఇకపై ఉండబోదేమోనని నాయకుని నీరసప్రసంగంతో ఆందోళన కలుగుతోంది.

ప్రధానమంత్రి అంతగా చెప్పినా, ముఖ్యమంత్రులు బతిమాలి చెబుతున్నా, ప్రజల నుంచి స్వచ్ఛంద గృహ నిర్బంధానికి పూర్తి మద్దతు దొరకడం లేదు. ఈ అంశంపై ప్రధాని సోమవారం ఉదయం అసహనం ప్రకటించారు. తెలంగాణలో కూడా రాష్ట్ర డిజిపి, ప్రధాన కార్యదర్శి సంయుక్త పత్రికాసమావేశంలో అనేక హితవులు, హెచ్చరికలు చెప్పారు. పెద్దగా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి కర్ఫ్యూ విధించారు కూడా. కరోనా అంశాన్ని తేలికగా తీసుకోగూడదని ప్రజలు గ్రహించాలి. ప్రకటించిన లాక్‌డౌన్‌లు సెలవులు కావు, విహారసమయాలు కావు. ఒక పెనుప్రమాదాన్ని నివారించడానికి చేస్తున్న ప్రయత్నం. ఈ ప్రయత్నంలో కొన్ని ఇబ్బందులు, కష్టనష్టాలు ఉంటాయి. వాటిని తొలగించడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తాయి కానీ, ప్రజలు కూడా కొన్నిటిని భరించడానికి సిద్ధపడాలి. అల్పాదాయ వర్గాల వారికి, రోజువారీ ఆర్జన ఉండే శ్రేణులకు ఇప్పటికే ప్రకటించిన మద్దతుకు తోడు, మరిన్ని సహాయకాలు కూడా ప్రకటిస్తే బాగుంటుంది. ప్రభుత్వం దాన్ని పరిశీలించాలి. అదే సమయంలో, ప్రజలు ఈ సందర్భాన్ని తమ మీద విధించిన నిర్బంధంగా భావించడం పొరపాటు. అనవసరంగా ఇంత ఆర్భాటం చేస్తున్నారన్న అభిప్రాయం ఎవరిలో ఉన్నా దాన్ని వెంటనే తొలగించుకోవాలి. ప్రమాదం మన ముంగిటే ఉన్నది. దాని తీవ్రత ఎట్లా ఉంటుందో ఇటలీని చూస్తే తెలుస్తుంది. మనదాకా రాదన్న నిశ్చింతకు ఎటువంటి ప్రాతిపదికా లేదు. మనం ఆదమరిస్తే, మనదాకా వస్తుంది. మనల్ని కష్టపెడుతుంది.

ప్రజలలో ఎందుకు ఈ లాక్‌డౌన్ భావన ఇంకడం లేదో, వారి శ్రేయస్సుకే ఉద్దేశించిన చర్యలను వారెందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదో ప్రభుత్వం కూడా ఆలోచించాలి. మరింత నిర్బంధ చర్యలు తీసుకోవడం వల్ల ఫలితం ఉండకపోవచ్చు. ప్రజలను అట్టడుగు శ్రేణి దాకా చేరడానికి ఏ మార్గాలను అనుసరించాలో పరిశీలించాలి. కేవలం బ్యూరోక్రటిక్ చర్యల వల్ల, భద్రతాచర్యల వల్ల పూర్తి ఫలితాలు రాకపోవచ్చు.

కరోనాను కట్టడి చేద్దాం. సర్వశక్తులనూ సమాయత్తం చేద్దాం!!

---

**కరోనా సంక్షోభ వేళ 130 కోట్ల మంది భారతీయుల గుండెచప్పుడు ప్రధాని నరేంద్రమోదీ మాటల్లో ప్రతిధ్వనిస్తున్నది. మన జాతిని ముందుకు నడిపిస్తున్న ధీమా ఆయన మాటల్లో వ్యక్తమవుతోంది. ఇవాళ ప్రపంచమంతా మన నాయకుడిని ప్రశంసిస్తోంది. అనేక దేశాలు మోదీని ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ఆయన కాలానికంటే ఒక అడుగు ముందుకు వేసి ఆలోచిస్తున్నారు. మోదీ మాటల్ని మనం పాటిస్తే ప్రస్తుత సంక్షోభాన్ని అవలీలగా గట్టెక్కగలుగుతాం.**

# కాలాన్ని జయిస్తున్న మోదీ

సత్యకాలమ్



■ వై. సత్యకుమార్

ప్రపంచం ఇప్పుడు కరోనా వైరస్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దాదాపు 159 దేశాలను చుట్టుముట్టిన కరోనా వైరస్ 2 లక్షల మందికి పైగా ప్రజలకు సోకింది. 9 వేలమందికి పైగా మరణించారు. ఇలాంటి సంక్షోభ సమయాలు ఎదురైనప్పుడే నాయకత్వ ప్రతిభ బయటపడుతుంది. ప్రజలు సంక్షోభం ఎదుర్కొన్నప్పుడల్లా నాయకుడి వైపు చూస్తారు. ఇవాళ ఈ రెండు పరిణామాలు జరిగాయి. భారత దేశం అనేక ప్రపంచ దేశాల మాదిరే కరోనా వైరస్ ముప్పును ఎదుర్కొంది. అదే సమయంలో ఆ ముప్పు నుంచి సురక్షితంగా బయటపడవేయగలమన్న నమ్మకాన్ని ప్రజలకు కలిగించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకుడంటే ఎలా వ్యవహరించాలో నిరూపించారు.

కరోనా వైరస్ ముప్పు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు తమంతట తాము స్వచ్ఛందంగా కర్ఫ్యూ పాటించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపునకు వచ్చిన ప్రతిస్పందనను బట్టే దేశ ప్రజలు ఆయన మాటలకు ఎంత విలువ ఇస్తున్నారో అర్థమవుతుంది. మొత్తం దేశం ఆయన మాటకు స్పందించి జనతా కర్ఫ్యూ పాటించింది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ప్రజా ప్రతినిధుల నుంచి సామాన్య పౌరుడి వరకు సాయంత్రం 5 గంటలకు కరతాళ ధ్వనులు, ఘంటానాదాలు, తప్పెట్లు, పళ్లేల మోతలు, శంఖారావాలు మొదలైన వాటి ద్వారా వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, పోలీసు అధికారులు, సఫాయీ కర్మచారులు, మీడియాకు తమ సంఘీభావం ప్రకటించారు. కులమతాలు, జాతులు, వర్గాలు, చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా స్త్రీ, పురుషులందరూ ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును పూర్తిగా పాటించారు. మొత్తం దేశం ఆత్మ ప్రతిస్పందించింది. ప్రధాని చప్పట్లు కొట్టమన్నందుకు అవహేళన చేసిన కుత్సిత విమర్శకుల నోళ్లు ప్రజల ప్రతిస్పందన చూడగానే మూతపడ్డాయి. ఇది మోదీ విశ్వసనీయతకు సంకేతం.

నిజానికి ప్రదానమంత్రి నరేంద్రమోదీ కరోనా వైరస్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ఒక పద్ధతి ప్రకారం చర్యలు తీసుకున్నారు. మొదట్లో ఈ వైరస్ కేవలం చైనాకే పరిమితమవుతుందని అనేకమంది భావించారు. చైనాలో కరోనా వైరస్ బీభత్సం సృష్టిస్తున్న సమయంలోనే ఫిబ్రవరి 24 , 25 తేదీల్లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మన దేశంలో పర్యటించారు. అప్పటికి అమెరికాకు కూడా వైరస్ తమ దేశానికి, ఇతర దేశాలకు పాకుతుందన్న అంచనా లేదు. పార్లమెంట్ బడ్జెట్ తొలి విడత సమావేశాల్లో కూడా ఈ విషయం చర్చనీయాంశం కాలేదు. బడ్జెట్ రెండో విడత సమావేశాలు మొదటి పది రోజులు కూడా ఈ వైరస్ వ్యాప్తి గురించి ఎవరూ ఊహించలేకపోయారు. కాని మార్చి మొదటి వారం తర్వాత ఇతర దేశాలనుంచి సమాచారం అందగానే ప్రధానమంత్రి అప్రమత్తమయ్యారు. మార్చి 10న జరగాల్సిన హోలీ మిలన్ కార్యక్రమాలను కూడా రద్దు చేసుకున్నారు. మెల్లగా అధికారిక సమావేశాలన్నింటినీ రద్దు చేయడం ప్రారంభించారు. ఇతర దేశాలనుంచి భారతీయుల ఆర్తనాదాలను పట్టించుకోవడం ప్రారంభించారు. చైనాలో చిక్కుకున్న భారతీయులను ప్రత్యేక విమానాల్లో రప్పించి ఐసోలేషన్ వార్డులకు పంపించారు. మార్చి 10 నుంచే ఇతర దేశాల నుంచి కూడా ఎయిర్ ఇండియా విమానాల ద్వారా భారతీయులను రప్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. తానే స్వయంగా చొరవ తీసుకుని మార్చి 15న సార్క్ దేశాధినేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

ప్రధానమంత్రి తీసుకున్న చర్యలను గత మంగళవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ప్రశంసించింది. భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అద్భుతంగా ఉన్నాయని, ఒక సమస్యను పరిష్కరించేందుకు ఆయన ప్రదర్శించిన నిజాయితీ అపూర్వమని ఈ సంస్థ ప్రతినిధి హెంక్ బెకెడామ్ ప్రశంసల వర్షం కురిపించారు. భారత వైద్య పరిశోధనా మండలి తీసుకుంటున్న చర్యలను కూడా ఈ సంస్థ ప్రశంసించింది. భారత దేశం యుద్ధ ప్రాతిపదికన ఈ వైరస్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం కావడాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థే కాదు, ప్రపంచంలోని అన్నిదేశాలూ ప్రశంసిస్తున్నాయి.



'నేను చాలా సంవత్సరాలుగా భారత ప్రభుత్వాన్ని ప్రతిదానికీ విమర్శిస్తూ వచ్చాను. కాని, ఇటలీలో చిక్కుకుపోయిన నా కూతురును తన స్వంత కూతురులా భావించి నరేంద్రమోదీ మార్చి 14న మిలన్ నుంచి భారత దేశం తిరిగి వచ్చేలా చూశారు' అని ఆ అమ్మాయి తండ్రి సుజయ్ కదమ్ ముంబైలో విలేఖరులకు ఆనంద బాష్పాలతో చెప్పారు.. ఫిబ్రవరి 28 వరకూ ఇటలీలో కూడా ఈ బీభత్సం గురించి ఎవరూ అంచనా వేయలేకపోయారని, మిలన్‌లో తాను కుదుర్చుకున్న అద్దె ఇంటి ఒప్పందం గురించి తనతో ఫోన్‌లో మాట్లాడిందని ఆయన చెప్పారు. కాని, తర్వాత నుంచి పరిస్థితి భీకరంగా మారడంతో మార్చి 10 నుంచే అక్కడ అన్ని మార్కెట్లు మూసేయడం ప్రారంభించారని ఆయన తెలిపారు. తన కుమార్తె భారత దేశం తిరిగి రావాలనుకుంటే అక్కడి అధికారులు అనుమతి ఇవ్వలేదని, మార్చి 12న తాను అక్కడి భారతీయ రాయబార కార్యాలయానికి సమాచారం ఇచ్చిన వెంటనే భారత ప్రభుత్వం వేగంగా ప్రతిస్పందించిందని ఆయన తెలిపారు. ఆ మరునాడే మార్చి 13న భారత రాయబార కార్యాలయ అధికారులు తనతో స్వయంగా మాట్లాడి తాము చేసిన ఏర్పాట్ల గురించి చెప్పారని, మార్చి 14న తన కూతురును చూసుకోగలిగానని ఆయన తెలిపారు.

ఒక విపత్తు పట్ల భారత ప్రభుత్వం ఎంత వేగంగా స్పందిస్తుందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. మార్చి 10 నుంచీ ఇవాళ మార్చి 23న పార్లమెంట్ సమావేశాలు వాయిదా పడే వరకూ నరేంద్రమోదీ ప్రభుత్వం వేగంగా స్పందించిన తీరు దేశ ప్రజల పట్ల, ఈ నేల పట్ల తనకున్న బాధ్యతకు నిదర్శనం. ఇవాళ నరేంద్రమోదీతో పాటు దేశ పరిపాలనా యంత్రాంగం యావత్తూ ఆయన బాటలో నడిచేందుకు సిద్ధపడింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు వరకూ ప్రధానమంత్రితో భుజం భుజం కలిపి ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు నడుం కట్టారు. కరోనా వైరస్‌ను ఎదుర్కోవడం కన్నా స్థానిక ఎన్నికలే ముఖ్యమని మొదట భావించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ పట్లా, ప్రతిపక్షాల పట్లా ఘోరమైన రీతిలో వ్యవహరించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా చివరకు పరిస్థితిని గ్రహించి చర్యలు చేపట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇవాళ దాదాపు అన్ని రాష్ట్రాలూ దిగ్బంధనాన్ని ప్రకటించాయి. మార్చి 22 రాత్రి నుంచే అంతర్జాతీయ విమానాశ్రయాలను మూసివేశారు. విదేశాలనుంచి రాకపోకల్ని అంతకుముందే నిషేధించారు. ఆఖరుకు జైళ్లలో కూడా కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా చర్యల్ని తీసుకున్నారు.

మనం ఎంత సన్నద్ధంగా ఉన్నా ప్రజలు సహకరించకపోతే ఈ మహమ్మారిని ఎదుర్కోలేమని ప్రధానమంత్రికి తెలుసు. అందుకే ఆయన జనంతో నేరుగా సంబంధాలు పెట్టుకున్నారు. సామాజిక దూరం పాటించాలని, ఇళ్లకు పరిమితం కావాలని వారికి పదే పదే బోధించారు. 'ప్రపంచం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇది ఒక దేశానికే పరిమితమైనది కాదు. ఆఖరుకు మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు కూడా అన్ని దేశాలను చుట్టుముట్టలేదు. ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా అంటువ్యాధి ప్రబలకుండా చూసుకోండి.. కరోనాను అరికట్టేందుకు మందు ఏదీ లేనందువల్ల సామాజిక దూరమే మనను కాపాడుతుంది' అని ఆయన చెప్పారు. 'కొవిడ్ మన దేశాన్ని ఏమీ చేయలేదని అనుకోకండి. పట్టుదల, సహనం పాటించి దాన్ని ఎదుర్కోవడానికి సిద్ధపడండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఇవాళ 130 కోట్ల మంది భారతీయుల గుండెచప్పుడు ప్రధాని నరేంద్రమోదీ మాటల్లో ప్రతిధ్వనిస్తున్నది. మన జాతిని ముందుకు నడిపిస్తున్న ధీమా ఆయన మాటల్లో వ్యక్తమవుతోంది. ఇవాళ ప్రపంచమంతా ఆ నాయకుడిని ప్రశంసిస్తోంది. అనేక దేశాలు మోదీని ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ఆయన కాలానికంటే ఒక అడుగు ముందుకు వేసి ఆలోచిస్తున్నారు. ఆయన మాటల్ని మనం పాటిస్తే ప్రస్తుత సంక్షోభాన్ని అవలీలగా గట్టెక్కగలుగుతాం.

***(బిజెపి జాతీయ కార్యదర్శి)***

---

# మాంద్య భారత్‌కు మార్గాంతరం

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

అంటువ్యాధులు మనుషులనే కాదు, ఆర్థిక వ్యవస్థలనూ అవస్థల పాలు చేస్తాయి. కరోనా మహమ్మారి ఇందుకు ఒక తాజా తార్కాణం. దేశ ఆర్థిక వ్యవస్థపై ఇది పెను ప్రభావాన్ని చూపి, మన ఆర్థిక జీవనానికి భారీ నష్టం కలిగించనున్నది. విదేశీ పర్యాటకుల రాక ఇప్పటికే తగ్గిపోయింది. త్వరలోనే పూర్తిగా తగ్గిపోయే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మన ఎగుమతులు తీవ్ర ఒత్తిళ్ల నెదుర్కొంటున్నాయి. ఆటో మొబైల్స్, ఫార్మాస్యూటికల్స్ మొదలైన దేశీయ పరిశ్రమలు చైనా నుంచి ఆటో విడి భాగాలు, ముడి పదార్థాలను దిగుమతి చేసుకోలేక పోతున్నాయి. తత్కారణంగా ఈ పరిశ్రమలు సమీప భవిష్యత్తులోనే తీవ్ర సమస్యలను ఎదుర్కోవలసిరావడం ఖాయం. మరి మార్గాంతరమేమిటి? దిగుమతి ప్రత్యామ్నాయమే (ఇంపోర్ట్ సబ్ స్టిట్యూషన్ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా విదేశీ దిగుమతులను తగ్గించుకునే విధానం). ఇదొక ఆదర్శ పరిష్కారం. మరి స్వదేశీ ఉత్పత్తులు పెంచుకోవాలంటే దేశీయ పరిశ్రమల్లో మదుపులు భారీగా చేయాలి. కరోనా కల్లోలం కారణంగా చైనా నుంచి మనం దిగుమతి చేసుకోలేక పోతున్న ఆటోమొబైల్స్ విడి భాగాలు, ముడి రసాయనాలను దేశీయంగా తయారు చేసే పరిశ్రమలను అభివృద్ధిపరచాలి. ఇందుకు అవసరమైన పెట్టుబడులు వాటికి సమకూరేందుకు ప్రభుత్వం ఇతోధికంగా తోడ్పడాలి.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో మన దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన స్థాయిలో ఏకీకరణ అయింది. ఈ భాగస్వామ్యాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఇందుకు, కరోనా కల్లోలాన్ని మనం ఒక అవకాశంగా మార్చుకోవాలి. మన ఆర్థిక వ్యవస్థకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సంబంధం లేకుండా చేసుకోవాలి. అంతేకాక భవిష్యత్తులో కరోనా లాంటి మహమ్మారుల ప్రభంజనాలే కాకుండా యుద్ధాలు, సునామీలు మొదలైన విపత్తుల పర్యవసానాలను సైతం సమర్థంగా ఎదుర్కొనేందుకు మనం సంసిద్ధమవ్వడం చాలా ముఖ్యం. ఇదే సమయంలో దేశీయ, విదేశీ కార్పొరేట్ సంస్థల నుంచి మన సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమలను పరిరక్షించేందుకు కూడా మనం ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తీరాలి. ఇది ఏకకాలంలో రెండు ప్రభావాలను నెరపుతుంది. ఒకటి మన ఆర్థిక వ్యవస్థను ప్రపంచ సరఫరాల పరంపర నుంచి వేరుపరచి, భవిష్యత్తులో అలాంటి నష్ట దాయక పరిణామాల నుంచి మనకు రక్షణ కల్పిస్తుంది. రెండు అది ఉద్యోగిత, డిమాండ్‌ను సృష్టిస్తుంది ముఖ్యంగా సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమల రంగంలో. అప్పుడే మనం స్వయం సంపూర్ణ ఆర్థికాభివృద్ధి నమూనాను అనుసరించ గలుగుతాము.

నిజానికి దిగుమతి ప్రత్యామ్నాయ విధానం మన ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి వ్యయాల పెరుగుదలకు దారితీస్తుంది. అంతర్జాతీయ విపణిలో ఒక విద్యుత్ బల్బు రూ.100కే లభిస్తుంది. అదే విద్యుత్ బల్బును మన దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రూ.125 ఖర్చుతో ఉత్పత్తి చేస్తాయి. ఉత్పత్తి వ్యయం అధికమే అయినప్పటికీ, మనకొక సానుకూలత సమకూరుతుంది. భవిష్యత్తులో మనకు సదరు సరుకుల సరఫరాలకు అంతరాయమేర్పడదు. ప్రపంచంలో ఎక్కడ ఎటువంటి సంక్షోభాలు సంభవించినా మన స్వయం సంపూర్ణ ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి ప్రమాదం వాటిల్లదు. రెండో ప్రభావం దేశీయ పరిశ్రమల్లో ఉద్యోగాల సృష్టి వల్ల కార్మికుల ఆదాయం పెరుగుతుంది. సహజంగా వారి కొనుగోలు సామర్థ్యమూ అధికమవుతుంది. కొనుగోళ్ళ పెరుగుదల అనివార్యంగా మార్కెట్‌లో మరింత డిమాండ్‌ను సృష్టిస్తుంది. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని అన్ని దిగుమతుల పైన ప్రభుత్వం సుంకాలు పెంచాలి. తద్వారా దేశీయ ఉత్పత్తికి ప్రేరణ కలిగించాలి. అదే సమయంలో, అధునాతన సాంకేతికతలను సమకూర్చుకునేందుకు చిన్న తరహా పరిశ్రమలకు చేయూతనివ్వాలి. ఇది జరిగినప్పుడే కాలం చెల్లిన సాంకేతికతల గుదిబండలను మనం వదిలించుకోగలుగుతాము.



srini

మన పరిశ్రమలు అధునాతన సాంకేతికతలను సమకూర్చుకునేందుకు వీలుగా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు టి ఓ) నుంచి మన దేశం వైదొలగడమే మంచిదని నేను భావిస్తున్నాను. వివిధ రంగాల అభివృద్ధికి దోహదం చేసే అధునాతన సాంకేతికతలను సృష్టించాలని ప్రతిష్ఠాత్మక 'వైజ్ఞానిక, పారిశ్రామిక పరిశోధనా మండలి' (సి ఎస్ ఐ ఆర్), 'భారత వ్యవసాయ పరిశోధనా మండలి' (ఐ సి ఎ ఆర్), భారత వైద్య పరిశోధనా మండలి (ఐ సి ఎమ్ ఆర్) ప్రయోగశాలలు, విశ్వవిద్యాలయాలను ప్రభుత్వం ఆదేశించాలి. దిగుమతి ప్రత్యామ్నాయ వస్తువులకు బదులు దేశీయంగా తయారైన సరుకులకు మనం ప్రాధాన్యమివ్వాలి. ఈ దిశగా ప్రభుత్వ వ్యయాల పెరుగుదల కరోనా మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడుతుంది. అంతేగాక భావి ఆర్థిక పురోతికి పునాది అవుతుంది.

> **కరోనా కల్లోలం మనకు ఒక సువర్ణావకాశాన్ని కల్పించింది. ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణలో పరిపూర్ణ భాగస్వామి కావాలనే ఆరాటంలో మనం గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన తప్పుడు విధానాలను ఇప్పటికైనా త్యజించాల్సిన అవసరమున్నది. ఇందుకు మనం కరోనా సంక్షోభాన్ని సద్వినియోగం చేసుకోవాలి.**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని నేను కోరడం లేదు. మీరు పొరపాటున కూడా అలా అర్థం చేసుకోకూడదు. ప్రపంచీకరణ ప్రక్రియ నుంచి వైదొలగడం కాకుండా నేను కోరుతున్నదల్లా పరిమిత స్థాయిలో మాత్రమే భాగస్వాములం కావాలన్నదే నా వాదన. విశ్వ ఆర్థిక వ్యవస్థ నుంచి ఉపసంహరించుకున్నప్పటికీ మనం ఇంకా సాఫ్ట్ వేర్ మొదలైన సేవల ఎగుమతిని కొనసాగిస్తాం. అలాగే ఫాస్ఫేట్, ఎరువులు, వంటనూనెలు మొదలైన వాటిని దిగుమతి చేసుకుంటాం. ఈ ఎగుమతి దిగుమతులు అనివార్యం. అయితే మనం దేశీయంగా ఉత్పత్తి చేయగల విద్యుత్ బల్బులు మొదలైన వాటి విషయంలో విదేశీ వాణిజ్య లావాదేవీలను తగ్గించుకోవాలి. మన దేశంలో సదరు వస్తువుల ఉత్పత్తి వ్యయం ఎంత అధికంగా ఉన్నప్పటికీ వాటిని మనం విదేశాల నుంచి ఎట్టి పరిస్థితులలోనూ దిగుమతి చేసుకోకూడదు గ్లోబల్ మార్కెట్లలో గట్టి పోటీ నిచ్చేందుకు మన ఎగుమతిదారులకు రాయితీల రూపేణా ఆర్థిక సహాయమందించాలి. అధిక దిగుమతి సుంకాల నుంచి ఆర్జించిన ఆదాయంలో కొంత భాగాన్ని ఎగుమతి సబ్సిడీలు చెల్లించడానికి వినియోగించాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే మనం మన తలుపులు మూసేసుకుని, కొన్ని నిర్దిష్ట కిటికీలు మాత్రమే తెరవాలి.

గత నెలలో సెన్సెక్స్ బాగా పడిపోయింది. అది ఇప్పటికీ స్వేచ్ఛా పతనంలోనే వున్నది. అయితే దీని గురించి భయపడవలసిన అవసరం లేదు. గత కొద్ది సంవత్సరాలుగా స్థూల దేశియోత్పత్తి వృద్ధిరేటు తగ్గిపోతుండగా సెన్సెక్స్ మహా జోరుగా వుంటోంది. కారణమేమిటి? ఆర్థిక వ్యవస్థ మొత్తంగా కుంచించుకు పోతున్నా కార్పొరేట్ కంపెనీలు లాభాలను ఆర్జిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ సంకోచం వృద్ధి రేటు తగ్గుదలకు, కార్పొరేట్ సంస్థల లాభాలు సెన్సెక్స్ పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఇప్పుడు మనం ఈ ప్రక్రియను తలకిందులు చేయాలి. అధిక జీడీపీ వృద్ధిరేటు, సెన్సెక్స్ తగ్గుదలకు దారితీసే విధానాలను మనం అనుసరించాలి. సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా దీన్ని సాధించవచ్చు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేందుకు ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ (ఇది, నిజంగా ఆవశ్యకమని నేను భావించడం లేదు) లో పరిపూర్ణ భాగస్వామి కావాలనే ఆరాటంలో మనం గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన తప్పుడు విధానాలను త్యజించాల్సిన అవసరమున్నది. ఇందుకు, కరోనా కల్లోలం మనకు ఒక సువర్ణావకాశాన్ని కల్పించిందనడంలో సందేహం లేదు. మరి మనం ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలి.

***(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)***

---

# అభ్యుదయవాదుల ఆచార్యుడు

అభ్యుదయ వాదుల మధ్య రాంభట్లగా ప్రసిద్ధిపొందిన రాంభట్ల కృష్ణమూర్తిగారితో నాకు అత్యంత సాన్నిహిత్యం ఉంది. ఆయన భాషలో ఆయన్ను గురించి చెప్పాలంటే ఆయనొక 'నిరక్షర కుక్షి'. అయితే ఆయన అక్షరం కోసం ఆహర్నిశలు పరిశ్రమించారు. పాఠశాలకు, కళాశాలకు, విశ్వవిద్యాలయానికి వెళ్ళి చదవకపోయినా అవన్నీ అందించలేనంత ఎత్తుకు తనకు తానుగా చదువుకొని ఎక్కగలిగారు. విషయగ్రహణం కోసం పడిన తపన ఆయన్ను నడిచే గ్రంథాలయంగా మార్చింది. అభ్యుదయ సాహిత్యోద్యమంతో ఆయనకున్న గాఢమయిన అనుబంధం, దాని కోసం ఆయన చేసిన సేవ అపారమయింది. ఎదుగుతున్న అభ్యుదయ వాదులకు ఆయనే గురువు. చాలామంది అభ్యుదయ దృక్పథంవైపు మొగ్గు చూపడం, ఆ దృక్పథానికి సంబంధించిన లోతయిన అవగాహన ఏర్పరచుకోవడం ఆయన చలవే.

హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్, బర్కత్‌పురా పరిసరాలు రాంభట్ల నడయాడిన ప్రాంతాలు. ఆయనతోపాటు నేను కూడా వెంట నడిచిన స్థలాలు. హిమాయత్ నగర్ చౌరాస్తాలో ఎప్పుడయినా పడిపోవడానికి సిద్ధంగా ఉన్న (తరువాత నిజంగానే పడిపోయింది) ఒక పాత భవనంలో అభ్యుదయ రచయితల సంఘం కార్యాలయం ఉండేది. బర్కత్‌పురాలో ఆయన ఇల్లు. ఆయనకు భాష, సంస్కృతి అన్న రెండు అంశాలమీద చాలా మక్కువ. దానికి సంబంధించిన లోతయిన పరిశోధన చేశారు. భారతీయ భాషలకు ముఖ్యంగా తెలుగుకు సుమేరియా భాషతో, సంస్కృతితో ఉన్న సంబంధాలను గురించి విపరీతంగా చదివారు, పరిశోధించారు. ఆ విషయాలపైన ఆయనకొక నిశ్చితాభిప్రాయం ఉంది. ఈ రెంటికి సాంస్కృతిక సంబంధం ఉందన్నది ఆయన అభిప్రాయం. ఆ తరువాతి కాలంలో కొంత మంది పరిశోధకులు ఆయన పేరు ప్రస్తావించకుండానే దాన్ని అవునని నిరూపించడానికి ప్రయత్నం కూడా చేశారు. సరిగా అలాంటి సమయంలో నేను ఆయనకు పరిచయమయ్యాను.

1989లో నేను నా పరిశోధన ముగించుకొని హైదరాబాదులో ఉద్యోగం కోసం వెళ్ళాను. అప్పటికి రాంభట్ల తన చుట్టూ శిష్యగణాన్ని చేర్చుకొని తిరుగుతూ వాళ్ళకు తను చేసిన పరిశోధనలను గురించి వాగ్రూపంలో వివరిస్తూ ఉండేవారు. ఈ పని ఆయన ఎన్నో ఏళ్ళుగా చేస్తున్నారు. నా కార్యరంగం కూడా హిమాయత్ నగర్‌లోని బూదరాజు రాధాకృష్ణ గారి ఇల్లే కావడంతో నాకు రాంభట్లతో పరిచయం సులభంగా దొరికింది. బూదరాజు గారు ఉన్న హిమాయత్ నగర్ పన్నెండో వీధిలోనే ఏటుకూరి ప్రసాద్‌గారు కూడా ఉన్నారు. వాళ్ళిద్దరితో నాకు అప్పటికే సాన్నిహిత్యం ఉంది కాబట్టి, రాంభట్లతో సాన్నిహిత్యం సులభమయింది. అభ్యుదయ రచయితల సంఘం కార్యాలయంలో రాంభట్ల పిచ్చాపాటి ప్రారంభిస్తే అది ఎప్పటికి ముగుస్తుందో ఎవరికీ తెలియదు. ఏ విషయాన్ని ప్రారంభిస్తారో ఏ విషయంలో ముగిస్తారో ఆయనకుగానీ, మనకుగానీ తెలియదు. ఎందుకంటే ఆయనకు తెలియని విషయం లేదు. అందుకని అన్ని రంగాల విషయాలను స్పృశిస్తూ ఉపన్యాసం కొనసాగుతూ ఉంటుంది. వినేవాళ్ళు వింటూ ఉంటారు, వెళ్ళేవారు వెళుతూ ఉం టారు. మొదటినుంచి చివరిదాకా విన్నవాళ్ళు తక్కువ. అయితే మధ్యలో మధ్యలో పోయి నా, ఎప్పుడు వచ్చి ఎప్పుడు విన్నా ఆయన ఉపన్యాసం నుంచి ఏదో ఒక కొత్త విషయం తప్పకుండా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఆయన ఒకే అంశంమీద మాట్లాడరు. అనేక విషయాలను చెబుతూ ఉంటారు. మనం వెళ్ళినప్పుడు ఏ విషయం గురించి ప్రస్తావిస్తూ ఉంటారో అది అనివార్యంగా మనకు కొత్తవిషయంగానే ఉంటుంది. అందువల్ల ఆయన ఉపన్యాసంలో కొత్త విషయాలు నేర్చుకోకపోవడమన్న విషయం ఉండదు, చర్విత చర్వణం కూడా ఉండదు.



ఇలా రోజూ మొదటినుంచి చివరిదాకా వినడం ఆయన గమనించాడు. అందులోనూ నేను పాజిటివ్ లిజనర్ (సానుకూల శ్రోత). ఆయన పెట్టిన పేరే అది. మొదలు పెట్టినప్పటినుంచి అయిపోయేంతవరకూ ఎలాంటి అభ్యంతరాలు, అడ్డంకులు కలిగించకుండా వినేవాడు పాజిటివ్ లిజనర్ అన్నది ఆయన నిర్వచనం. దానివల్ల ఉపన్యాసకుడికి తను చెప్పదలచిన విషయాలు ధారాళంగా చెప్పడానికి వీలవుతుంది. మధ్యమధ్యలో నచ్చని, అంగీకారం కాని, అవగాహన కాని, వ్యతిరేకమయిన విషయాల ప్రస్తావన వచ్చినా కూడా నువ్వు ఓపిగ్గా వింటావు. కానీ కొంతమంది అక్కడికక్కడే ఆపి దారి మళ్ళిస్తారు అనేవారు. ఆయన చెప్పే విషయాలన్నీ కొత్తవిగా ఉండడంవల్ల అందరూ వాటికి సంబంధించిన అనేక సందేహాలు లేవనెత్తేవారు. అందువల్ల ఆయన వాళ్ళను నెగెటివ్ లిజనర్స్ అనేవారు. వాళ్ళనే ఎక్కువగా మెచ్చుకొనేవారు. వేదాల నుంచి ఆధునిక సమస్యలదాకా అనేక విషయాల గురించి ఆయన అనర్గళంగా మాట్లాడేవారు. అందులో ఒక తార్కికత, మార్మికత దాగి ఉండేది. ఆయన ఉపన్యాసానికి కూడా ఒక శిల్పం ఉండేది. ఉపన్యాసం మధ్య మధ్యలో ఎన్నో ఇతర విషయాలకు వెళ్ళినా అవన్నీ కూడా ఒక చెట్టుకొమ్మలుగానే ఉండేవి. ఆయన ఉపన్యాసాన్ని చాలా జాగ్రత్తగా వినాలి, కొంత సేపు వదిలిపెట్టినా ఏదో ఒక కొత్త విషయాన్ని మనం వదులుకొన్నట్టే. అదే సమయంలో ఎప్పుడు విన్నా ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకొన్నట్టే. సానుకూల శ్రోతనయిన నాకు ఆయన వల్ల అనేక ప్రాపంచిక విషయాలు తెలిశాయి. ఇలా కొన్ని సంవత్సరాలు పాటు విన్న నాకు ఆయన చెప్పే విషయాలన్నీ గాలికి పోతున్నాయనిపించింది. ఎందుకంటే నాబోటి వాళ్ళు విన్నా ప్రయోజనం లేదు. వాటినన్నిటినీ విని గుర్తు పెట్టుకొని ఇతరులకు పంచే అంత జ్ఞానం, సమయానుకూలంగా చెప్పేంత జ్ఞాపకం నాకు లేదు. ఇదే విషయాన్ని ఏటుకూరి ప్రసాద్‌గారితో చెప్పినప్పుడు ఆయన ప్రస్తావనగా ఈ విషయాలన్నిటినీ రాయమని రాంభట్లకు చెప్పా రు. నేను రాయని భాస్కరుణ్ణి, రాయసగాడు ఉంటేగానీ రాయలేనన్నారు. అప్పుడు అదే ఏటుకూరి ప్రసాద్‌గారు అక్క డే ఉన్న నన్ను పురమాయించారు. అంతే అక్కణ్ణించి నేను ఆయనకు రాతపనివాడిగా మారాను.

ఆయన రాసిన పారుటాకులు, జనకథ, వేల్పులకథ మొదలయిన వాటికి నేనే మొదటి శ్రోతను, రాయసగాణ్ణి. ఇంట్లో కూర్చొని ఆయన చెబుతూ ఉంటే నిలుకులేకుండా, అలుపులేకుండా రాసే అవకాశం నాకు కలిగింది. ఆయన ఉపన్యాస ధోరణిలోనే చెబుతూ ఉండేవారు. ఆయా విషయాలను ప్రస్తావిస్తూ, సహజసిద్ధంగానే ఇతర విషయాలకు వెళ్ళిపోయేవారు. ఆయన్ను కట్టడిచేసి మళ్ళీ విషయానికి రప్పించడం చాలా కష్టం. ఎప్పుడు ఆయన విషయం నుంచి పక్కకు పోతారో అప్పుడు నేను రాయడం నిలిపివేస్తాను. ఎందుకాపేశావ్ అంటారు. మనం రాయాల్సిన విషయం మీరు చెప్పడంలేదంటే, మళ్ళీ విషయానికి వస్తారు. తరువాత తరువాత ఇలా నేను రాయడం ఆపేస్తే విషయం దారిమళ్ళిందని గ్రహించి ఆయనే వెనక్కు వచ్చేవారు. శృంగభంగం లాంటి ఎన్నో జాతీయాలను గురించి ఆయన విపులంగా రాశారు. దేవతలను గురించిన అనేక విషయాలను ఆయన ఎంతో తార్కికంగా ఊహించగలిగారు. సుమేరియన్ల సంస్కృతిని గురించి విపులమయిన చర్చ చేశారు. వాటిద్వారా భాషాపరంగా అనేక విషయాలు తెలుసుకోగలిగాను. ఆయనతో తిరగడంవల్ల తలనొప్పి వస్తుంది కానీ కాళ్ళు నొప్పి రాదు. ఒక వెయ్యి పుస్తకాలు చదివినంత విషయాన్ని ఆయన మన బుర్రలోకి ఎక్కిస్తారు. అన్ని విషయాలను శాశ్వతంగా ఉంచుకొన్న ఆయనకేమీ తలనొప్పి లేదుగానీ, వాటిని ఎక్కించుకోలేక మనకు తలనొప్పి వస్తుంది. ఆయనకు తెలిసిన విషయాలు ఎన్నో ఇంకా లోకానికి తెలియజెయ్యకుండానే ఆయన వెళ్ళిపోయారు. ఆయన రాసిన అరడజను పుస్తకాలు కేవలం ఆయన జ్ఞానంలో పదోవంతు కూడా లేదు. శతాధిక గ్రంథకర్త కావలసింది, అందులో శతాంశం కూడా రాయకపోవడం మన దురదృష్టం. గుడ్డిలో మెల్లగా ఆ మాత్రం రాశారు. వాటినయినా నవతరానికి అందించాల్సిన అవసరం ఉంది. ఇప్పుడా గ్రంథాలు ఏవీ దొరకడంలేదు. అన్నీ చిన్న చిన్న గ్రంథాలే. ఈ శతజయంతి సందర్భంగా వాటినన్నిటినీ ప్రచురించి రాంభట్ల దృక్పథాన్ని, రాంభట్లను మరోసారి గుర్తుకు తెస్తున్నందుకు ఆయన శిష్య చూడామణులు ఆర్.వి.రామారావు, మందలపర్తి కిశోర్, అదృష్టదీపక్, వల్లూరు శివప్రసాద్, పెనుగొండ లక్ష్మీనారాయణ, విరియాల గౌతమ్ తదితరులకు అభినందనలు. రాంభట్లతో నా అనుబంధం అన్నది పెద్దమాట. రాంభట్లతో నా శిష్యరికం కూడా చాలా చిన్నదే. తక్కువ సమయంలో ఆయన ఆప్యాయతను, అభిమానాన్ని పొందగలిగాను. ఆయన ద్వారా ఎంతో నేర్చుకోగలిగాను. ఆయన మెప్పు పొందగలిగాను. సొంత దృక్పథాన్ని పొందగలిగాను. ఇదంతా ఆయన చలవ తప్ప నా ప్రతిభ ఏమీ కాదు.

> **రాంభట్లతో నా అనుబంధం అన్నది పెద్దమాట. రాంభట్లతో నా శిష్యరికం కూడా చాలా చిన్నదే. తక్కువ సమయంలో ఆయన ఆప్యాయతను, అభిమానాన్ని పొందగలిగాను. ఆయన ద్వారా ఎంతో నేర్చుకోగలిగాను. ఆయన మెప్పు పొందగలిగాను. సొంత దృక్పథాన్ని పొందగలిగాను. ఇదంతా ఆయన చలవ తప్ప నా ప్రతిభ ఏమీ కాదు.**

♦ మాడభూషి సంపత్ కుమార్

తెలుగు శాఖాధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం

(నేడు రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి)

ఆంధ్రజ్యోతి
# నవ్య
కుటుంబ కదంబం
మంగళవారం • 24 మార్చి 2020




ఎక్కడో చైనాలో తలెత్తిన వైరస్ తీవ్రతను ఆమె ముందుగానే అనుమానించారు. యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. చికిత్సల్లో విజయం వైపు వైద్య వ్యవస్థను నడిపించారు. ఒకప్పుడు టీచర్ అయిన కేరళ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి **శైలజ** ఇప్పుడు కరోనా నియంత్రణలో ప్రపంచానికి పాఠాలు నేర్పుతున్నారు. గతంలో నిఫా వైరస్ విషయంలోనూ ఆమె అందరికీ ఆపద్బాంధవురాలయ్యారు.

# ఆపద సమయంలో ఆచరణవాది

"ప్రశంసించాల్సిన, అనుసరించాల్సిన ఆదర్శ నాయకురాలొకరు ఇన్నాళ్ళకు మనకు దొరికారు. ఇలాంటివారు మరింతమంది రావాలని కోరుకుందాం. అనసరమైన మాటలు లేవు. పనికిమాలిన పరిహాసాలు లేవు. మసిపూసి మారేడుకాయ చేసే వ్యవహారాలు లేవు. రాజకీయ అవకాశవాదాన్ని కప్పిపుచ్చుకుంటూ ఆడే నాటకాలు లేవు. సామాజిక సేవలో స్వచ్ఛమైన, పారదర్శకమైన వ్యక్తి. టీచర్! మీ నాయకత్వాన్ని కొనసాగించండి!" కరోనా విపత్తును ఎదుర్కోవడంలో కేరళ ఆరోగ్య శాఖ మంత్రి కె.కె. శైలజ చేపడుతున్న సమర్థమైన చర్యలను అభినందిస్తూ మలయాళ నటుడు అనూప్ మీనన్ ఇటీవల చేసిన ట్వీట్ ఇది.

ఆయనే కాదు, అనేక మంది సినీ ప్రముఖులూ, వైద్య రంగ నిపుణులూ ఇప్పుడు శైలజపై ప్రశంసలు కురిపిస్తున్నారు. విదేశాల్లో పనిచేస్తున్న ప్రవాస భారతీయ మలయాళీలు పంపే డబ్బే ఆర్థిక వ్యవస్థకు ఇరుసుగా పని చేస్తున్న కేరళలో కరోనా వైరస్ కట్టడికి ఆమె ఆధ్వర్యంలో సాగుతున్న కృషి మిగిలిన ప్రాంతాలకు ఆదర్శంగా



నిలుస్తోంది. దేశంలోని మొదటి మూడు కరోనా వైరస్ పాజిటివ్ కేసులు ఆ రాష్ట్రంలోనే బయటపడ్డాయి. అయితే శైలజ మార్గదర్శకత్వంలో వైద్య బృందాలు ఆ వ్యాధి వ్యాప్తిని నియంత్రించగలుగుతున్నాయి. కరోనా పాజిటివ్‌గా తేలిన రోగుల చికిత్స విషయంలో అనేక దేశాలు తల్లడిల్లిపోతున్న తరుణంలో, ఈ వైరస్ సోకిన ముగ్గురికి కేరళ వైద్యులు సమర్థంగా చికిత్స చేశారు.

"కరోనా లాంటి అంటువ్యాధులతో పోరాడాలంటే శాస్త్రీయ దృక్పథం, మానవత్వం, గట్టి పరిశోధన కావాలి. అవసరమైతే సంస్కరణలు చేపట్టాలి. మూఢవిశ్వాసాలు, నిర్ధారించుకోకుండా ప్రతీదీ నమ్మేయడం, భావోద్వేగాలకు గురి కావడం, హేతుబద్ధత లేకపోవడం లాంటివి మొత్తం ప్రక్రియను పట్టాలు తప్పిస్తాయి, శాస్త్రీయంగా వ్యాధి ముప్పును నివారించడానికి పాటుపడుతున్న నిపుణులు, వైద్య కార్యకర్తల ఆత్మవిశ్వాసాన్ని నీరుకారుస్తాయి. అందుకే వైరస్ గురించి మూర్ఖమైన వాదాలను వ్యాప్తి చేసే వారి మీద కఠినమైన చర్యలు తీసుకుంటున్నాం" అంటారు శైలజ.

**❖ వైద్యం గురించి నాకేం తెలీదు!**

ఇంతకూ అరవై మూడేళ్ళ శైలజ వైద్యురాలేమీ కాదు. ఆమె మంత్రి పదవిని చేపట్టడం కూడా ఇదే తొలిసారి. కేరళ రాష్ట్రంలోని కన్నూరు జిల్లా కూతుపరంబాలో జన్మించిన శైలజ సైన్స్ పట్టభద్రురాలు. కన్నూరులోని శివపురం హైస్కూల్‌లో సైన్స్ టీచర్‌గా పని చేశారు. కాలేజీలో చదువుతున్నప్పుడే సీపీఐ (ఎం) భావజాలం పట్ల ఆమె ఆకర్షితురాలయ్యారు. ఆ పార్టీ విద్యార్థి విభాగంలో చేరి చురుగ్గా పని చేశారు. ఉపాధ్యాయినిగా ఉద్యోగవిరమణ తీసుకొని ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆమె సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు కూడా! నాలుగేళ్ళ కిందట కేరళ ఆరోగ్య, సాంఘిక సంక్షేమ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. "ఆ పదవిలోకి వచ్చేసరికి వైద్య శాస్త్రం గురించి నాకున్న అవగాహన అంతంత మాత్రమే. భౌతిక, రసాయన శాస్త్రాల బోధన, వామపక్ష కార్యకర్తగా ఉన్న అనుభవం కలిసి విషయాలను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా అర్థం చేసుకోవడానికి దోహదం చేస్తున్నాయి" అని అంటారామె. ఆ అవగాహనే విపత్కర సమయాల్లో సత్వరం స్పందించేలా చేస్తోంది.




**❖ నిఫా వైరస్ సమయంలోనూ...**

2018, 2019 సంవత్సరాల్లో... రెండుసార్లు నిఫా వైరస్ కేరళను కుదిపేసినప్పుడు శైలజ చురుగ్గా స్పందించారు. వైద్యులతో కలిసి ఆమె చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఆ అనుభవం కరోనా వైరస్ విషయంలో పనికొచ్చింది. కొత్త వైరస్ చైనాలో తలెత్తిందన్న వార్తలు చూడగానే దాని లక్షణాలేమిటో శైలజ, ఆమె బృందం గమనించడం ప్రారంభించారు. ఆ వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుందో తెలుసుకున్నారు. ఆ లక్షణాలు కేరళ ఒకరికి కనిపించగానే ఆలస్యం చెయ్యకుండా రంగంలోకి దిగారు.

"మంత్రులు తమకు కేటాయించిన శాఖల సబ్జెక్టుల్లో నిష్ణాతులు కాకపోవచ్చు. కానీ కళ్ళూ, చెవులూ తెరుచుకొని ఉంటే ఒక మార్పు తేగలుగుతారు. నేను శాస్త్రవేత్తలనూ, నిపుణులనూ అనుసరిస్తాను. అంతే తప్ప... గోమూత్రం, ఆవు పేడ ప్రయోజనాల గురించి చెప్పేవాళ్ళను కాదు. కరోనా వైరస్ పేరు వినగానే అదేమిటో అర్థం చేసుకోవడానికి ఇంటర్నెట్‌లో శోధించాను. ఆ తరువాత రోజూ కొన్ని గంటల సేపు కథనాలు చదివి, తాజా సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాను. దీనికి కావలసిందల్లా విషయాలను గ్రహించే సామర్థ్యం" అని చెబుతారు శైలజ.

**❖ ముందు చూపే ఫలితాలిచ్చింది!**

చైనాలోని వూహాన్‌లో కరోనా వైరస్ వ్యాధి తలెత్తిందన్న వార్తాకథనాలు చూడగానే ఆమె అప్రమత్తం కావడానికి ఆ సామర్థ్యమే కారణం. నిజానికి సమయానికి చైనా కూడా ఈ వైరస్ వల్ల తలెత్తే ప్రమాదాల గురించి పూర్తిగా అప్రమత్తం కాలేదు. కానీ ఇలాంటి వాటిని తేలిగ్గా తీసుకోరాదన్న పాఠాన్ని నిఫా వైరస్ అనుభవం ఆమెకు నేర్పింది. "వూహాన్‌లో వైద్యం, ఇంజనీరింగ్ చదువుతున్న కేరళ యువతకు ఆ వైరస్ సోకి, వారు స్వరాష్ట్రానికి తిరిగి వస్తే, అది ఇక్కడ వ్యాప్తి చెందే ప్రమాదం గురించి నేను ఆలోచించాను. వెంటనే కేరళ ఆరోగ్య కార్యదర్శికి ఫోన్ చేసి, నా ఆందోళన వ్యక్తం చేశాను" అని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆమె ఆందోళన సరైనదేనని గ్రహించిన ప్రభుత్వం వెంటనే చర్యలకు నడుం బిగించింది. క్షేత్రస్థాయిలో వైద్య వర్గాలన్నిటినీ మోహరించడం మొదలుపెట్టింది. కరోనా బాధిత దేశాల నుంచి వచ్చినవారికి కరోనా లక్షణాలు ఉంటే వెంటనే వారికి పరీక్షలు చేశారు. విమానాశ్రయాలను అప్రమత్తం చేశారు. మిగిలిన రాష్ట్రాల్లో క్వారంటైన్ పీరియడ్ 14 రోజులుంటే కేరళలో 28 రోజులు. దాదాపు 4,800 మందిని ఐసొలేషన్ వార్డుల్లో, లేదా ఇంట్లో క్వారంటైన్‌లో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. ఈ చర్యలన్నీ మంచి ఫలితాలను ఇస్తున్నాయి. అందుకే ఇప్పుడు శైలజను అందరూ వర్గాలకు అతీతంగా అభినందిస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమెపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

అయితే వాటిని తాను పెద్దగా పట్టించుకోనని చెబుతారు శైలజ. "ఇవన్నీ నీటి బుడగల్లాంటివి, శాశ్వతం కాదు. అంతా బాగా చేసినా ఒక చిన్న పొరపాటు జరిగితే అంతా కుప్పకూలిపోతుంది. ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అగ్రశ్రేణి ఆటగాడిపై ఉండే ఒత్తిడి లాంటిదిది. అతను స్కోర్ చేసినప్పుడు అంతా బాగుందంటారు. చెయ్యలేకపోతే, అంతకు ముందు అతను చేసినదాన్ని ఎవరు గుర్తుంచుకుంటారు?" అని ప్రశ్నిస్తారు శైలజ. ప్రతిపక్ష నేత



చెన్నితలై రమేశ్ లాంటి కొందరు శైలజకు 'మీడియా మేనియా' ఉందంటూ చేసిన విమర్శలను ఆమె దృష్టిలో పెట్టుకొని ఆమాట అని ఉండొచ్చు. అలాంటి విమర్శల మాట ఎలా ఉన్నా ఆపత్సమయంలో ఆచరణాత్మకవాదిగా ఆమెను కేరళ ప్రజలు గుర్తుంచుకుంటారు.

## ఆ టీచరంటే అంత గౌరవం!

2018లో కేరళలో నిఫా వైరస్ విజృంభణ మీద 'వైరస్' (2019) అనే సినిమా వచ్చింది. ఇందులో శైలజను పోలిన పాత్రను తెరపై చూపించడం విశేషం. ఆ పాత్రను నటి రేవతి పోషించారు. 'టీచర్' అంటూ ఇంత గౌరవాన్నీ, అభిమానాన్నీ శైలజ పొందడానికి ప్రధాన కారణం ఆమె వ్యవహారశైలి. ఉన్నతాధికారి నుంచి చిరుద్యోగి వరకూ అందరితో ఆమె కలిసిపోతారు. వ్యాధుల నియంత్రణకు పని చేసిన కార్యదర్శుల నుంచి సామాజిక ఆరోగ్య కార్యకర్తల వరకూ అందరి పేర్లనూ ఆమె తన ప్రసంగాల్లో ప్రస్తావిస్తారు. అనవసరమైన విమర్శలు చేసి సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతియ్యవద్దని కోరుతూ ఉంటారు. పాలనలో సామాన్య ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొనే పనితీరును ఆమె ప్రవేశపెట్టారు. ప్రజలు నేరుగా తనతో మాట్లాడి సందేహాలు తీర్చుకొనే వీలు కల్పించారు. కేరళలో కరోనా వైరస్ నిర్ధారణ అయిన తొలి వ్యక్తిని శైలజ స్వయంగా కలిసి ధైర్యం చెప్పారు. "ఆమె నన్ను పలకరించడంతో ఎంతో ఊరట కలిగింది" అని ఆ విద్యార్థి ఆమెకు కృతజ్ఞత తెలిపాడు. "రోగులను కలవడానికి ఐసొలేటెడ్ వార్డుల్లోకి రావద్దని చాలామంది నాకు సలహా ఇచ్చారు. కానీ అది నా బాధ్యత" అని ఆమె అంటారు.



మానవాళికి కునుకు లేకుండా చేస్తున్న కరోనా భయం... ప్రాణం లేని ఈ బొమ్మలోనూ మొదలైనట్టుంది కదూ! న్యూజిలాండ్ క్రైస్ట్‌చర్చ్‌లోనిదీ 'చిత్రం'. విజృంభిస్తున్న కోవిడ్19 దెబ్బకు అత్యవసర సేవలు తప్ప అన్నింటినీ బంద్ చేస్తున్నట్టు ఆ దేశ ప్రధాని సోమవారం ప్రకటించిన నేపథ్యంలో... మాస్క్ తొడిగిన ఈ విగ్రహం అక్కడ అందరినీ ఆకర్షించింది.

## ఇల్లే... ఆఫీసు అయినప్పుడు...




కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో భాగంగా తెలుగు రాష్ట్రాలు లాక్‌డౌన్ ప్రకటించాయి. కార్యాలయాలు, సంస్థలు మూతబడినా కొన్ని కంపెనీలలో ఉద్యోగులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' చేస్తున్నారు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఈ వసతి ఇస్తున్నారు. ఇంట్లో ఆఫీసులో మాదిరి యూనిఫామ్, షూ, టై వేసుకోవాల్సిన అవసరం ఉండదు. అంతవరకు ఓకే. అయితే ఆఫీసులో ఉన్నన్ని సౌకర్యాలు ఇంటి వద్ద ఉండవు. అలాంటప్పుడు ఇంట్లోనే ఆఫీసు వాతావరణాన్ని కల్పించుకోవాలంటే...



**సరైన స్థలం ఎంపిక:** ఇంట్లో ఉండి ఆఫీసు పని చేయడంలో ఉండే వెసులుబాటు ఏమంటే మీకు నచ్చిన చోట కూర్చోవచ్చు. గాలి, వెలుతురు చక్కగా ఉండే గదిని ఎంచుకోవాలి. గెస్ట్‌రూమ్ లేదా లివింగ్ రూమ్ అయితే మీకు ప్రైవసీ లభిస్తుంది. సౌకర్యంగా ఉండడంతో చక్కగా పనిచేసుకోగలుగుతారు. రాత్రి వేళ ఎక్కువ సమయం పనిచేయాలనుకునే వారు డైనింగ్ టేబుల్‌ను డెస్క్‌గా వాడుకోవచ్చు.

**ఆఫీస్ ఫీల్ కోసం:** సౌకర్యంగా ఉండే కుర్చీ, టేబుళ్లను ఎంచుకోవాలి. లేదంటే పని ముగిసే సరికి వెన్నునొప్పి, అలసట వచ్చే అవకాశం ఉంది. టేబుల్ మీద కాఫీ మగ్స్, ట్రెండీ నోట్‌ప్యాడ్స్, స్టికీ నోట్స్ వంటివి ఉంచుకోవాలి. ఇవి హోమ్ ఆఫీస్ ఫీల్‌ను పెంచుతాయి. దాంతో ఉత్సాహం తగ్గకుండా పనిచేస్తారు.

**బ్రేక్ తీసుకోండి:** ఆఫీసులో మధ్యమధ్యలో టీ, కాఫీ బ్రేక్ తీసుకుంటారు కదా! ఇంట్లో కూడా అలానే బ్రేక్ తీసుకొని పని మొదలెట్టండి. కొద్దిసేపు హాలులో అటూ ఇటూ నడవండి.



**బ్యాకప్ ఉండాలి:** ఇంట్లో పనిచేసే వాళ్లు ఎదుర్కొనే సమస్య విద్యుత్ అంతరాయం. దీంతో పనిలో ఆలస్యమవడంతో కొంత ఒత్తిడి పెరుగుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే మీ కంప్యూటర్‌కి పవర్‌బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాలి.

**స్ఫూర్తినిచ్చే సందేశాలు:** ఇంటి దగ్గరనే ఉండి పనిచేయడం కాబట్టి ఒకింత బద్ధకం ఆవరిస్తుంది. దాంతో పనిలో వేగం తగ్గుతుంది. 'టు డు లిస్ట్' సిద్ధం చేసుకుంటే పనిలో వేగం పెరుగుతుంది. పిన్ బోర్డ్ మీద స్ఫూర్తినిచ్చే సందేశాలున్న ఇమేజెస్ ఏర్పాటుచేసుకుంటే మనసు తిరిగి పని మీదకు మళ్లుతుంది.

**అవగాహన**

**కరోనా వైరస్ వ్యాధి (కొవిడ్-19) ఊహించిన దానికన్నా వేగంగా విస్తరిస్తోంది. దీనికి కారణం వస్తువుల ఉపరితలాలపై ఎక్కువ సమయం ఆ వైరస్ జీవించి ఉండడమేనని వైద్యులు అంటున్నారు. అందుకే మనం వ్యక్తిగత శుభ్రతతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలి.**

## ఇంట్లో ఇలా చేద్దాం!

**కనిపించకుండానే...**



❖ ప్లాస్టిక్ వస్తువులపై కరోనా వైరస్ 72 గంటల పాటు సజీవంగా ఉంటుంది.
❖ స్టెయిన్‌లెస్ స్టీల్ ఉపరితలంపై ఉన్న వైరస్ కణాలు నాలుగు గంటల తరువాత క్షీణిస్తున్నాయి. కానీ 48 గంటల వరకు వైరస్ ఉనికి మాత్రం ఉంటున్నట్లు గుర్తించారు.
❖ అట్టపెట్టెలపై కరోనా వైరస్ త్వరగా చనిపోతోంది. అయితే 48 గంటల వరకు పూర్తిగా కనుమరుగు కావడం లేదు.
❖ కరోనా వైరస్ ఉన్న ఏ ఉపరితలాన్నైనా ముట్టుకుని, అదే చేతిని ముఖంపై ముట్టుకుంటే వైరస్ సోకే అవకాశం ఉంది.
❖ అందుకే సామాజిక దూరం పాటించాలి. ఎక్కువ జనం గుమిగూడే ప్రదేశాలకు వెళ్లకూడదు.
❖ చేతులు తరచుగా శుభ్రం చేసుకోవాలి. ముఖంపై చేతులు పెట్టుకోకూడదు. కళ్లు రుద్దడం చేయకూడదు.



**మనం ఏం చేయాలంటే...**

❖ ఇంటిలో ఎక్కువ సార్లు ముట్టుకునే ప్రదేశాలను రోజూ శుభ్రం చేసుకోవాలి.



❖ ఇంట్లో వస్తువులను శుభ్రం చేసే ముందు చే తులను శుభ్రంగా కడుక్కోవాలి. తరువాత గ్లౌజులు ధరించాలి.
❖ పేపర్ టవల్ లేదా స్వైప్స్ తీసుకోవాలి. ఒక స్ప్రే బాటిల్, శానిటైజర్ కూడా అవసరం.
❖ 99.9 శాతం మేర జెర్మ్స్‌ను చంపే ద్రావణాన్ని తీసుకోవాలి. ద్రావణం బాటిల్‌పై ఆ విషయం స్పష్టంగా రాసి ఉన్నదీ లేనిదీ చెక్ చేసుకోవాలి.
❖ ద్రావణాన్ని స్ప్రేబాటిల్‌లో నింపుకొని పేపర్ టవల్‌పై స్ప్రే చేయాలి.
❖ ఆ టవల్‌తో డోర్ హ్యాండిల్స్‌ను తుడుచుకోవాలి.
❖ అన్ని స్విచ్‌లూ శుభ్రంగా తుడవాలి. డ్రాలను కూడా శుభ్రం చేయాలి.
❖ రోజూ భోజనం చేసే టేబుల్‌ను తుడవాలి.
❖ ఫ్రిజ్ డోర్‌ను తుడవడం మరువద్దు.
❖ ఇంట్లో మైక్రో ఓవెన్ ఉంటే దాన్ని కూడా శుభ్రం చేయాలి.



❖ కుర్చీలు, వాటి వెనుక భాగాన్ని సైతం శుభ్రం చేసుకోవాలి.
❖ టీవీ రిమోట్, కంప్యూటర్ కీ బోర్డు, మౌస్‌ను తుడవాలి.
❖ బాత్‌రూమ్, సింక్, వాష్‌బేసిన్ కుళాయిలను తుడుచుకోవాలి.
❖ టాయిలెట్ ఫ్లష్ హ్యాండిల్ కూడా శుభ్రం చేయాలి.
❖ ఇప్పుడు చివరగా గ్లౌజులను శుభ్రంగా ఉతికి ఆరేయాలి.
❖ చేతులను మళ్లీ శుభ్రంగా కడుక్కొని పొడి తువ్వాలుతో తుడుచుకోవాలి.




*'లాక్‌డౌన్'... ఇప్పుడు ఎవరి నోట విన్నా ఇదే మాట. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి ఇప్పుడు ప్రభుత్వాలు ఆశ్రయించిన మార్గం ఇదే! ఇంతకీ లాక్‌డౌన్ అంటే ఏమిటి? ఈ సమయంలో ఏం వేయొచ్చు? ఏం వేయకూడదు? ఇదిగో నిపుణుల మాట...*

'లాక్‌డౌన్' అంటే మూసివేయడం! ఇదొక అత్యవసర నియమం (ఎమర్జెన్సీ ప్రొటోకాల్). ప్రజలను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లకుండా నిరోధించేందుకు ప్రభుత్వాలు లాక్‌డౌన్‌ను ప్రకటిస్తాయి. ఇప్పుడు 'అంటువ్యాధుల నియంత్రణ చట్టం - 1897' కింద మన ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది.

▸ ఈ సమయంలో రాష్ట్రాల మధ్య సరిహద్దులు మూసివేస్తారు. ప్రైవేటు వాహనాలను అనుమతించరు. ప్రజల నిత్యావసర వస్తువులను రవాణా చేసే గూడ్స్ వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.
▸ లాక్‌డౌన్ సమయంలో అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయి. నిత్యావసర వస్తువుల దుకాణాలు, మందుల షాపులు, బ్యాంకులు తెరచి ఉంటాయి.
▸ పబ్లిక్ రవాణా సౌకర్యాలను పూర్తిగా నిషేధిస్తారు. అంటే బస్సులు, రైళ్లు, ఆటోల ప్రయాణం నిషేధంలో ఉంటుంది.
▸ ఆస్పత్రికి వెళ్లడం, మందుల దుకాణానికి వెళ్లడం, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు వెళ్లడం లాంటి అత్యవసరాలకు అనుమతి ఉంటుంది.
▸ జనం గుంపులుగా ఉండకూడదు. పార్కులు, సినిమా హాళ్లు, జనం ఎక్కువగా గుమిగూడే ప్రదేశాలన్నీ మూసి వేస్తారు.
▸ లాక్‌డౌన్ ఉన్న సమయంలో ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి బయటకు వెళితే జరిమానా, సాధారణ జైలు శిక్ష విధించేందుకు అధికారం ఉంటుంది.
▸ కరోనా వైరస్ విస్తరించకుండా ఉండేందుకు ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. ఈ సమయంలో ఇళ్లకు పరిమితమై ఎవరికి వారు స్వీయ నియంత్రణలో ఉండాలి. అప్పుడే కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించగలుగుతాం.

**• కామిక్ కరోనా** కార్టూన్: చారి పి.ఎస్




## మీకు అర్థమవుతోందా?

❖ కరణ్‌కి కరోనా వైరస్ సోకింది. కానీ అతనికి 14 రోజుల వరకు ఆ విషయం తెలియలేదు.
❖ కరణ్ రోజూ పది మందికి కరోనా వైరస్ అంటించాడు.
❖ ఆ పది మంది ఆరోగ్యంగా ఉన్నామని అనుకున్నారు. వాళ్లు తలో పది మందికి, అంటే వందమందికి వైరస్ వ్యాప్తి చేశారు.
❖ ఆ వంద మంది ఆరోగ్యంగా ఉన్నామని అనుకున్నారు. కానీ వెయ్యి మందికి కరోనా సోకేందుకు కారణమయ్యారు.
❖ ఎవరు ఆరోగ్యంగా ఉన్నారు? ఎవరు కరోనా బారినపడ్డారో ఎవరికీ తెలియదు.

అందుకే, ఇంట్లోనే ఉండడం ఎంత ముఖ్యమో మీకు అర్థమవుతోందా?



epaper.andhrajyothy.com







# కరోనాను తరిమేద్దాం!

ఎక్కడ చూసినా, ఎవరిని కదిపినా... కరోనా నుంచి రక్షణ పొందే సలహాలు, సూచనలే! అయితే వీటిలో అపోహలకు పురిగొల్పేవే ఎక్కువ! ఇలాంటి వాటితో మరింత అయోమయానికి లోనవకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి! ఇందుకోసం కరోనా వైరస్ వ్యాప్తి పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలి!

## మాస్క్ ఎవరికి? ఎప్పుడు?



ఇతరుల నుంచి మనకు, మన నుంచి ఇతరులకు కరోనా వైరస్ సోకకుండా ఉండాలంటే మాస్కులు ధరించాలి. అయితే ఇలాగని ప్రతి ఒక్కరూ ఎల్లవేళలా మాస్కులు ధరించి ఉండవలసిన అవసరం లేదు. మాస్క్ ఎవరు వేసుకోవాలంటే....

- లక్షణాలు ఉన్నప్పుడు (దగ్గు, జ్వరం, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది)
- 'కొవిడ్ - 19' సోకిన/సోకిన అనుమానం ఉన్న వ్యక్తి కుటుంబసభ్యులు.
- కరోనా వ్యాధిగ్రస్థులకు చికిత్స చేసే వైద్య సిబ్బంది.

## ఆ ఐదు పనులు!

కరోనా నుంచి రక్షణ పొందడం కోసం అనుసరించవలసిన సామాన్యమైన ఐదు పనుల గురించి గూగుల్ తన హోమ్‌పేజ్‌లో పేర్కొంది. అవేమిటంటే....



**చేతులు:** తరచుగా కడగండి



**మోచేతులు:** వీటితో నోరు మూసి, దగ్గండి



**ముఖం:** చేతులతో తాకకండి



**కాళ్లు:** మూడు అడుగుల దూరం పాటించండి



**సుస్తీ:** ఒంట్లో బాగోలేదా? ఇంటిపట్టునే ఉండండి

ఒంటి మీద ఆల్కహాల్ స్ప్రే చేసుకున్నా, లేదంటే ఆల్కహాల్ తాగినా వైరస్ చనిపోతుందనుకోవడం అపోహ.

ఫ్లూ టీకాలు వేసుకుంటే కొవిడ్ 19 వైరస్ నుంచి రక్షణ లభిస్తుందనే ప్రచారం అర్థరహితమే.

నీళ్ళు బాగా తాగడం వల్ల కరోనా వైరస్ ఒంట్లో నుంచి పోతుందని అనుకోవడం అపోహ. అలాగే, ఐస్ క్రీములు తిన్నంత మాత్రాన వైరస్ స్తంభించిపోతుందని అనుకోవడమూ తప్పే!

వేడి నీళ్లతో స్నానం చేసినా, అలాగే హ్యాండ్ డ్రయ్యర్లు వాడినా వైరస్ చనిపోతుందని అనుకోవడం పొరపాటు. అలాగే, ఎండలో నిలబడినంత మాత్రాన వైరస్ పోదు.

## మాస్క్ వేసుకున్నప్పుడు...

మాస్క్ ధరిస్తున్నారా? అయితే దాన్ని వాడడం, డిస్పోజ్ చేయడం గురించి కూడా మీరు తెలుసుకోవాలి.

- మాస్క్ ముడతలు ఊడదీయాలి. ఆ ముడతలు కింది వైపుకు ఉండేలా చూసుకోవాలి.
- ముక్కు, నోరు, కింది దవడ కవర్ చేసే విధంగా, గాలి చొరబడకుండా ఉండేలా మాస్క్‌ను అడ్జస్ట్ చేసుకుని కట్టుకోవాలి.
- ప్రతి ఆరు గంటలకూ మాస్క్ మార్చాలి. లేదా నీటితో తడిసిన వెంటనే మార్చాలి.
- మాస్క్ తొలగించేటప్పుడు దాని ముందరి భాగాన్ని చేతులతో తాకకూడదు.
- మాస్క్‌లను ముఖం మీద నుంచి తొలగించి, మెడలో వేలాడదీసుకోకూడదు.
- డిస్పోజబుల్ మాస్క్‌లను ఎట్టి పరిస్థితిలోనూ తిరిగి వాడకూడదు. వాడిన మాస్క్‌లను మూత ఉన్న చెత్త డబ్బాల్లో వేయాలి.
- మాస్క్ తొలగించిన తర్వాత చేతులను సబ్బుతో లేదంటే ఆల్కహాల్‌తో కూడిన శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలి.



## డాక్టర్ల ప్రిస్క్రిప్షన్

- కనీసం అరవై శాతానికి పైగా ఆల్కహాల్ కంటెంట్ ఉన్న శానిటైజర్లను వాడాలి. నోవెల్ కరోనా వైరస్ లాంటి వైరస్‌లను అవి పూర్తిగా చంపేయగలుగుతాయి. అయితే, వట్టి శానిటైజర్లు వాడినంత మాత్రాన సరిపోదు. సబ్బు ఉపయోగించి, తరచూ (కనీసం ఇరవై సెకన్ల పాటు) చేతులు కడుక్కుంటూ ఉండాలి. ఇలా చేతులు కడుక్కుంటూ, అలాంటి శానిటైజర్లు వాడితే అది ప్రభావం చూపుతుంది.
- మాటిమాటికీ ముఖాన్ని ముట్టుకోవడం మానేయాలి.
- ఇంట్లో ఎవరికైనా జలుబు, జ్వరంగా అనిపిస్తే, ముందు జాగ్రత్త పడాలి. అందరూ ఒకే పాత్రలు వాడడం మానేయాలి.
- దగ్గుతూ, తుమ్ముతూ ఉన్నవాళ్ళకు దూరంగా ఉండాలి.
- ఇంటా బయటా అందరితో దూరం పాటించాలి.

## వైద్యులను ఎప్పుడు కలవాలి?



**ఈ లక్షణాలు ఉంటే:** దగ్గు, జ్వరం, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది

**ఈ ప్రయాణాలు చేసి ఉంటే:** పై లక్షణాలు ఉన్నా, లేకున్నా కరోనా తీవ్రంగా ఉన్న దేశాలు (ఇరాన్, ఇటలీ, కొరియా, ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) సందర్శించి వచ్చి ఉంటే....

**కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తి:** అలాంటి వ్యక్తితో అంతకన్నా ముందు కలిసి ప్రయాణం చేసి ఉన్నా, కలిసి ఒకే చోట స్వల్ప సమయం గడిపి ఉన్నా...

మీరు ఈ కోవకు చెందిన వారైతే హెల్ప్‌లైన్ నంబరు 011-2397 8046ను సంప్రతించండి. ఈ హెల్ప్‌లైన్ సర్వీస్ మీ వివరాలు నమోదు చేసుకుని, 'కొవిడ్ - 19' టెస్టింగ్ ప్రోటోకాల్‌తో మిమ్మల్ని సంప్రతిస్తుంది. ఒకవేళ ప్రోటోకాల్ ప్రకారం, మీరు 'కొవిడ్ - 19' పరీక్షకు అర్హులని తేలితే మిమ్మల్ని ప్రభుత్వ ఆమోదం పొందిన ప్రయోగశాలలో పరీక్షిస్తారు. మరింత సమాచారం కోసం ఫోన్ ద్వారా 911123978046ను, ఈ-మెయిల్ ద్వారా ncov2019@gmail.com సంప్రతించవచ్చు.

## వ్యాధినిరోధకశక్తిని మందులతో పెంచుకోవచ్చా?

కరోనా వైరస్ నుంచి రక్షణ పొందాలంటే వ్యాధినిరోధకశక్తి మెరుగ్గా ఉండాలి. అయితే ఇందుకోసం మందులూ లేకపోలేదు. అయితే వీటి అవసరం ఎవరికి? ఎంతమేరకు?

ఆరోగ్యకరమైన జీవనశైలిని గడిపే ప్రతి ఒక్కరికీ వ్యాధినిరోధకశక్తి మెరుగ్గానే ఉంటుంది. కాబట్టి వీరికి అదనంగా మందులు వాడవలసిన అవసరం లేదు. అయితే పిల్లల్లో, వృద్ధుల్లో ఇమ్యూనిటీ తక్కువగా ఉంటుంది. అలాగే కేన్సర్ చికిత్సలు తీసుకుంటున్నవారు, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్‌తో బాధపడుతూ స్టెరాయిడ్లు వాడుతున్న వారు, మధుమేహులు, అధిక రక్తపోటు, మూత్రపిండాల వ్యాధులు, ఊపిరితిత్తుల రుగ్మతలు కలిగి ఉన్న వారు, వ్యాధినిరోధక శక్తిని తగ్గించే మందులు వాడే వారిలో రోగనిరోధకశక్తి మరింత బలహీనంగా ఉంటుంది. కాబట్టి వీళ్లు వైద్యుల సూచన మేరకు రోగనిరోధకశక్తిని పెంచే ఇమ్యూన్ బూస్టర్స్ వాడడం ద్వారా కొంతమేరకు కరోనా నుంచి రక్షణ పొందవచ్చు. జీర్ణశక్తి, శరీర సామర్థ్యం కలిగి ఉండి, సమ్మిళిత పౌష్టికాహారం తీసుకుంటూ, ఒత్తిడి తక్కువగా ఉండే ఆరోగ్యవంతులకు ఈ మందులతో అదనంగా ప్రయోజనం కలగదు.



- డాక్టర్ ఎస్.ఎ. రఫీ
కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్,
హైదరాబాద్.













## కరో'నా' సందేశాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు!

- రజనీకాంత్



ప్రధాని నరేంద్రమోదీ పిలుపునకు స్పందించి జనతా కర్ఫ్యూను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలనీ, సాయంత్రం ఐదు గంటలకు కరోనా వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది సహా పోలీసు అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సేవా బృందానికి కృతజ్ఞతలు తెలపాలనీ శనివారం రజనీకాంత్ ఒక వీడియో పోస్ట్ చేశారు. రజనీ ఖాతా నుండి దాన్ని ట్విట్టర్ తొలగించింది. తమ నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా తొలగించామని పేర్కొంది. ట్వీట్ తొలగించడంపై రజనీకాంత్ స్పందించారు. "జనతా కర్ఫ్యూను గౌరవించి 14 గంటలు ఇంట్లో ఉంటే... దేశంలో కరోనా మూడో దశలోకి అడుగుపెట్టకుండా నిరోధించవచ్చని వీడియోలో నేను మాట్లాడాను. ఆదివారం ఒక్కరోజు 14 గంటలు మాత్రమే ఇంట్లో ఉంటే చాలని అర్థం చేసుకున్నారు. చాలామంది షేర్ చేశారు. ఆ కారణంగానే నా పోస్ట్ తొలగించారు" అని రజనీకాంత్ తెలిపారు.



## పూర్తిగా కోలుకున్నా!

- ఓల్గా కురిలెంకో

"కరోనా నుండి నేను పూర్తిగా కోలుకున్నాను" అని బాండ్ గాళ్, 'క్వాంటమ్ ఆఫ్ సోలెస్' హీరోయిన్ ఓల్గా కురిలెంకో తెలిపారు. మాస్క్ ధరించి, కుమారుణ్ణి ఒళ్లో కూర్చోబెట్టుకుని ఫైర్ ప్లేస్ ముందున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఇంకా ఆమె మాట్లాడుతూ "తొలి వారం చాలా కష్టంగా అనిపించింది. తీవ్రమైన తలనొప్పి, జ్వరంతో ఎక్కువసేపు బెడ్ మీదున్నా. రెండో వారంలో జ్వరం తగ్గింది. కానీ, కొంచెం దగ్గు మాత్రం ఉండేది. చాలా అలసటగా అనిపించేది. రెండో వారాంతానికి ఆరోగ్యం మెరుగయ్యింది. దగ్గు దాదాపుగా తగ్గింది" అన్నారు. ఇప్పుడు తన కుమారుడితో ఎక్కువ సమయం గడుపుతున్నానని ఓల్గా పేర్కొన్నారు.



## నితిన్ విరాళం



ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్న కరోనా వైరస్‌ను నియంత్రించడానికి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు శాయశక్తుల కృషి చేస్తున్నాయి. చిత్ర పరిశ్రమ కూడా పలు అవగాహనా కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా కరోనా నియంత్రణకు తన వంతు భాగస్వామ్యం అందించాలని హీరో నితిన్ నిర్ణయించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షలు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 లక్షల రూపాయల విరాళాన్ని ఆయన ప్రకటించారు. ఈ నెల 31 వరకూ ప్రకటించిన లాక్‌డౌన్‌కు ప్రజలు సహకరించాలనీ, అందరూ తమ తమ ఇళ్లల్లోనే ఉండి, కోవిడ్-19 వ్యాప్తిని నిరోధించడంలో పాలు పంచుకోవాలని నితిన్ విజ్ఞప్తి చేశారు.

## ఇంతమంది వితండవాదులా?

- అనసూయ



"అయ్య బాబోయ్.. ఇంతమంది బుర్రలేని వాళ్లు నా ట్విట్టర్ అకౌంట్‌లో ఉన్నారా? కనీస జ్ఞానం లేకుండా కామెంట్లు చేస్తారా? ఇలాంటి వాళ్లను బ్లాక్ చేయడమే మంచిది" అంటూ మండిపడ్డారు యాంకర్, నటి అనసూయ భరద్వాజ్. అంతేకాదు ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో ఆమెను ఫాలో అవుతున్న కొందరిని బ్లాక్ చేశారు. అనసూయ కోపానికి కారణముంది. కరోనా వైరస్ ప్రభావాన్ని తగ్గించడానికి ఆంధ్రా, తెలంగాణ ప్రభుత్వాలు ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ చేసిన సంగతి తెలిసిందే! పనుల్లేక ఇబ్బందులు పడే వారికి బియ్యంతోపాటు రూ.1500 అందజేయనున్నట్టు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో అనసూయ కేటీఆర్‌ను ట్యాగ్ చేసి "సర్.. మీరు మరికొన్ని వృత్తులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నాను. పని లేకపోతే మాకు ఆదాయం ఉండదు. నెలవారీ ఖర్చులైన కరెంట్ బిల్లు, ఇంటి అద్దె, ఈఎమ్ఐలు కట్టాల్సి ఉంటుంది. ఇలాంటివన్నీ మీరు పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నాను" అని ట్వీట్ చేశారు. దీనికి నెటిజన్లు అనసూయపై విమర్శలు గుప్పించారు. 'బోలెడంత సంపాదిస్తూ, ఎంతో బ్యాంక్ బ్యాలెన్స్ ఉండే మీరే ఇలా అంటే.. సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి ఏంటి? ఎందులోనైనా దూకాలి" అంటూ పలువురు నెటిజన్లు ట్రోల్ చేశారు. వారందరికీ అనసూయ సమాధానాలిచ్చారు. "నేను అడిగింది నా కోసం కాదు, మేం పని చేసే రంగంలో రోజు కూలీకి పనిచేసే పేద కళాకారులు, సాంకేతిక నిపుణుల కోసం" అని ఆమె స్పష్టం చేశారు. అయినా ఆమెపై ట్రోలింగ్ ఆగలేదు. వితండవాదం చేసిన వారిని ఆమె ఖాతా నుంచి బ్లాక్ చేశారు.

## ఎవ్వరికీ ఇవ్వొద్దు... ఎవ్వరి నుండీ తీసుకోవద్దు!

- టామ్ హాంక్స్



"కరోనా లక్షణాలు కనిపించిన రెండు వారాల తర్వాత, ఇప్పుడు పరిస్థితి బావుంది. ఫీలింగ్ బెటర్. పని చేసే ప్రదేశాల్లో... దీన్ని (కరోనాను) మీరు ఎవ్వరికీ ఇవ్వొద్దు. ఎవ్వరి నుండీ తీసుకోవద్దు. కామన్ సెన్స్, కాదా? ఒకరి గురించి మరొకరు జాగ్రత్తలు తీసుకుంటే, సహాయం చేసుకుంటే, కొన్ని సౌకర్యాలు వదులుకుంటే... ఇదీ వెళ్లిపోతుంది" అని హాలీవుడ్ నటుడు, కరోనా నుండి కోలుకున్న టామ్ హాంక్స్ ట్వీట్ చేశారు.

- 'మీ టూ' ఉద్యమంలో ప్రపంచవ్యాప్తంగా వినిపించిన పేరు హార్వే వెయిన్‌స్టీన్. అసలు, హాలీవుడ్‌లో ఉద్యమం ఉవ్వెత్తున లేవడానికి కారణం ఆయనే. లైంగిక వేధింపులు, అత్యాచార కేసుల్లో మార్చి 11న ఆయనకు 23 ఏళ్ల జైలు శిక్షను న్యూయార్క్ న్యాయస్థానం విధించింది. ఇప్పుడు ఆయనకు కరోనా రావడంతో జైలు సిబ్బంది స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు. హార్వేనూ జైలులో నిర్బంధంలో ఉంచారట.
- స్పానిష్ ఒపేరా గాయకుడు ప్లాసిడో డొమింగో కరోనా బారిన పడ్డారు. సామాజిక మాధ్యమాల్లో "ఈ విషయాన్ని తెలియజేయడం నా నైతిక బాధ్యత. నేను, నా కుటుంబం స్వీయ నిర్బంధంలోకి వెళుతున్నాం. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండమని ప్రాధేయపడుతున్నా" అని ఆయన పేర్కొన్నారు.
- హాలీవుడ్ నటుడు, సంగీతకారుడు ఇద్రిస్ ఎల్బా నుండి ఆయన భార్య సబ్రీనాకు కరోనా సోకింది. చికిత్స సమయంలో భర్తకు తోడుగా ఉండి, జాగ్రత్తగా చూసుకోవాలని తీసుకున్న నిర్ణయమే ఆమె పాలిట శాపమైంది. "నేను అతనితో ఉండాలనుకున్నా. భార్యగా నా ప్రవృత్తి అది. అతనికి దూరంగా, ప్రత్యేక గదిలో ఉండాలనే నిర్ణయాన్ని తీసుకునే వీలు నాకుంది. కానీ, తీసుకోలేదు. కచ్చితంగా ప్రజలు అటువంటి నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నా" అని సబ్రీనా తెలిపారు.
- కరోనా కాటుకు హాలీవుడ్ నటి సోఫియా మైల్స్ తండ్రి పీటర్ మైల్స్ (67) మరణించారు. పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్న ఆయనకు ఈ మహమ్మారి సోకింది. ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. శనివారం తిరిగిరాని లోకాలకు వెళ్లారు.

## అండగా నిలవాల్సిన తరుణమిది

- ప్రకాశ్‌రాజ్



తన ఇంట్లో పనిచేసేవాళ్లకి, వ్యక్తిగత సిబ్బందికి మే నెల వరకూ ఇవ్వాల్సిన జీతాలను ముందే చెల్లించానని నటుడు ప్రకాశ్‌రాజ్ తెలిపారు. దేశంలో కరోనా మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో వైరస్ నియంత్రణలో భాగంగా సినిమా షూటింగ్‌లను వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన ఓ ట్వీట్ చేశారు. "జనతా కర్ఫ్యూ'తో నా బ్యాంకులో నగదు నిల్వను పరిశీలించాను. నా నివాసం, వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నవారితోపాటు నా వ్యక్తిగత సిబ్బందికి మే నెల వరకూ ఇవ్వాల్సిన జీతాలను ముందే చెల్లించాను. వాయిదాపడిన నా మూడు సినిమాల కోసం పనిచేస్తోన్న వారికి కనీసం సగం జీతమైనా ఇవ్వాలని నిర్ణయించుకున్నా. ఇది ఇక్కడితో పూర్తి కాదు. నేను ఎంతవరకూ సాయం చేయగలనో అంతవరకూ చేస్తాను. మీ చుట్టూ ఉన్నవారి గురించి ఒకసారి ఆలోచించి వీలైనంత సాయం చేయండి. ఒకరికోసం ఒకరూ సహాయం చేసుకోవాల్సిన తరుణమిది" అని ప్రకాశ్‌రాజ్ విజ్ఞప్తి చేశారు.

| రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|
| 76.20 (100 పైసలు) | 25.98 |

**సెన్సెక్స్** నష్టం : 3,934.72 పాయింట్లు ముగింపు : 25,981.24

**నిఫ్టీ** నష్టం : 1,135.20 పాయింట్లు ముగింపు : 7,610.25

## ఎంపిక చేసిన శాఖలే తెరవండి

▸▸ బ్యాంకులకు ఐబీఏ సూచన

న్యూఢిల్లీ : కరోనా వైరస్‌తో పోరాటంలో భాగంగా దేశవ్యాప్తంగా లాక్ డౌన్ ప్రకటించినందు వల్ల ప్రభుత్వాధికారులతో చర్చించి ఆయా ప్రాంతాల్లో తప్పనిసరి లావాదేవీల నిర్వహణ కోసం ఎంపిక చేసిన బ్రాంచీలను మాత్రమే తెరవాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) బ్యాంకులను కోరింది. రాష్ట్రస్థాయి ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ బ్యాంకులు, లీడ్ జిల్లా మేనేజర్లు ప్రస్తుత పరిస్థితులకు దీటుగా వ్యాపార కొనసాగింపు ప్రణాళిక వ్యూహం రూపొందించాలని, దాని అమలుకు ఆర్‌బీఐ అనుమతి తీసుకోవాలని తెలిపింది. ఏ బ్యాంకులు తెరవవచ్చు లేదా మూసివేయవచ్చనే విషయంలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ రీజినల్, జోనల్, సర్కిల్ అధిపతులకు ఇవ్వాలని బ్యాంకు సీఈఓలకు సూచించింది. లావాదేవీలకు వీలైనంత వరకు ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ విధానాలే ఉపయోగించుకోవాలని బ్యాంకు కస్టమర్లందరికీ ఐబీఏ సూచించింది. కాగా ఎస్‌బీఐ శాఖలన్నీ 10 నుంచి 2 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయని ఆ బ్యాంకు తెలిపింది.

# బ్యాంకులకు రూ.లక్ష కోట్లు

## రెపో రేటుతో రెండు విడతలుగా ఆర్‌బీఐ అందజేత



ముంబై: బ్యాంకులకు నిధుల సరఫరా (లిక్విడిటీ) పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరిన్ని చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 16 రోజుల కాలవ్యవధి ఉండే రూ.లక్ష కోట్ల స్వల్పకాలిక రుణాలను 5.16 శాతం రెపో రేటుతో బ్యాంకులకు అందిస్తోంది. ఇందులో రూ.50,000 కోట్ల నిధులను సోమవారమే వేలం వేసింది. మరో రూ.50,000 కోట్లను మంగళవారం వేలం వేస్తోంది. దీనికి తోడు ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా మరో రూ.15,000 కోట్ల ప్రభుత్వ రుణ పత్రాలను మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తోంది.

### వ్యవసాయ రుణాలకు 'ప్రాధాన్యతా' హోదా

ఎన్‌బీఎఫ్‌సీల ద్వారా బ్యాంకులు ఇక వ్యవసాయ, ఎంఎస్‌ఎంఈ, గృహ రుణాలను అందజేయవచ్చు. ఇలా ఇచ్చే రుణాలను ప్రాధాన్యతా రంగ రుణాలుగా పరిగణించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ఈ మేరకు కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ రుణాలు ఆయా బ్యాంకుల మొత్తం వార్షి క రుణాల్లో 5 శాతం మించకూడదు.

- వ్యవసాయ రుణాలైతే ఒక్కో వ్యక్తికి ఇచ్చే రుణం రూ.10 లక్షలు మించకూడదు
- ఎంఎస్ఎంఈలకిచ్చే రుణం రూ.20 లక్షలు మించకూడదు.
- రూ.20 లక్షల వరకు ఉండే గృహ రుణాలు 'ప్రాధాన్యతా' రుణంగా పరిగణన

# ఘోర కలి!

## స్టాక్ మార్కెట్లకు మరో బ్లాక్ మండే

▸▸ సెన్సెక్స్ 3,935 పాయింట్లు డౌన్ ▸▸ దలాల్ స్ట్రీట్ చరిత్రలో అతిపెద్ద పతనం

## రూ.14.22 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: కరోనా రక్కసిని కట్టడి చేసేందుకు పలు రాష్ట్రాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో దలాల్ స్ట్రీట్ బెంబేలెత్తిపోయింది. బేర్ స్ట్రోక్‌కు మార్కెట్ మళ్లీ కుప్పకూలింది. సెన్సెక్స్, నిఫ్టీ మా ర్కెట్ చరిత్రలో అతి పెద్ద పతనాన్ని నమోదు చేసుకున్నాయి. ఒకే ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్ దాదాపు 4,000 పాయింట్లు, నిఫ్టీ 1,100 పాయింట్లకు పైగా పడిపోవడం ఇదే తొలిసారి. ట్రేడింగ్ ప్రారంభమైన తొలి గంటలోనే సూచీలు 10 శాతం పైగా పతనమై లోయర్ సర్క్యూట్‌ను తాకటంతో ఎక్స్ఛేంజీలు ట్రేడింగ్‌ను 45 నిమిషాల పాటు నిలిపివేశాయి. ట్రేడింగ్ పునఃప్రారంభమయ్యాక కూడా నష్టాల పరంపర కొనసాగింది. నష్టాలు మరింతగా పెరిగాయి కూడా.

దీంతో స్టాక్ మార్కెట్ వర్గాల సంపద ఒక్క రోజులోనే రూ.14 లక్షల కోట్లకు పైగా హరించుకుపోయింది. ట్రేడర్లు అమ్మకాలు పోటెత్తించడంతో సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల షేర్లూ నష్టపోయాయి. చిన్న, పెద్దా అనే తేడా లేకుండా అన్ని కంపెనీల షేర్లు చితికిపోయాయి. అన్ని రంగాల సూచీలూ నేలచూపులు చూశాయి. మహా ఆర్థిక మాంద్యం భయాలతో ప్రపంచ మార్కెట్లూ నష్టా ల బాటలోనే పయనించాయి.

### ఈ పతనం ఎందాక?

మార్కెట్ పేకమేడలా కూలుతున్నప్పుడు విధ్వంసం ముగిశాక మొ త్తం నష్టాన్ని బేరీజు వేసుకోవాలే తప్ప ముందుగానే అంచనా వేయలేమని మార్కెట్ వర్గాలన్నాయి. ప్రస్తు తం సూచీల పతనానికి ఏ స్థాయిలో అడ్డుకట్ట పడుతుందని చెప్పడం కష్టమేనని అభిప్రాయ పడుతున్నారు.

### 6,200 స్థాయికి నిఫ్టీ?

మార్కెట్ టెక్నికల్ చార్టులు ఇంకా బేరిష్ ట్రెండ్‌నే కనబరుస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. నిఫ్టీ మరో 1,500-1,600 పాయింట్ల వరకు పతనమై 6,200 స్థాయికి చేరవచ్చంటున్నారు.

నరేంద్ర మోదీ ప్రభుత హయాంలో స్టాక్ మార్కెట్లు ఆర్జించిన లాభాలు కరోనా ధాటికి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేలా ఉన్నాయి. 2014 మే 26న మోదీ భారత ప్రధానిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశారు.

### మోదీ హయాంలో లాభాలు పూర్తిగా హరీ

అంతక్రితం సెషన్‌లో (మే 23) సెన్సెక్స్ 24,693, నిఫ్టీ 7,367 వద్ద ముగిశాయి. ఈ ఏడాది జనవరి 20న నిఫ్టీ 12,430 వద్ద ఆల్‌టైం రికార్డు స్థాయిని నమోదు చేసుకుంది. అంటే, మోదీ హయాంలో సూచీ 69 శాతం వృద్ధిని నమోదు చేసుకుంది. కానీ, కరోనా ధాటికి గడిచిన రెండు నెలల్లో సూచీలు భారీగా పతనమవుతూ వచ్చాయి. ప్రస్తుతం 7,600 స్థాయికి జారుకుంది. మరో 300 పాయింట్లు పడితే మోదీ హయాంలో ఆర్జించిన లాభాలన్నీ తుడిచి పెట్టుకుపోయినట్టే.

### జీవితకాల కనిష్ఠ స్థాయికి రూపాయి

అమెరికా డాలర్‌తో రూపాయి మారకం రేటు వెలవెలబోతోంది. సోమవారం ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి వంద పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ఠ స్థాయి రూ.76.20 వద్ద ముగిసింది. గత ఏడు నెలల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఒకే రోజు ఈ స్థాయిలో ఎన్నడూ పడిపోలేదు. కరోనా భయాలతో స్టాక్ మార్కెట్ కుదేలవడం, రూపాయి మారకం రేటును దెబ్బతీసింది.

**సెన్సెక్స్ టాప్-10 లూజర్స్**

| కంపెనీ | నష్టం(%) |
|---|---|
| యాక్సిస్ బ్యాంక్ | 28.01 |
| బజాజ్ ఫైనాన్స్ | 23.57 |
| ఇండస్ఇండ్ బ్యాంక్ | 23.50 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 17.88 |
| మారుతి సుజుకీ | 17.02 |
| ఎల్ అండ్ టీ | 16.31 |
| టెక్ మహీంద్రా | 14.90 |
| అల్ట్రాటెక్ సిమెంట్ | 14.60 |
| ఏషియన్ పెయింట్స్ | 14.15 |
| బజాజ్ ఆటో | 13.95 |

**రూ.1,01,86,936.28 కోట్లు** బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ

**రూ. 52 లక్షల కోట్లు** కరోనాతో ఈ ఏడాది ఇన్వెస్టర్లు నష్టపోయిన సంపద

# తెలుగు రాష్ట్రాల్లో 'తయారీ' బంద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన కంపెనీలు కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు చేపట్టాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉత్పత్తి కార్యకలాపాలను నిలిపివేశాయి. ఉద్యోగుల ఆరోగ్య భద్రత, నియమనిబంధనలకు అనుగుణంగా వీలైన చోట ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పించాయి. కోరమాండల్ ఇంటర్నేషనల్ హైదరాబాద్‌లోని తన రిజిస్టర్ కార్యాలయం, ప్రభుత్వం నోటీపై చేసిన జిల్లాల్లోని డివిజినల్ కార్యాలయాల్లోని ఉద్యోగులను ఇంటి నుంచి పని చేయమని కోరింది. అలాగే ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లోని ఎరువుల ప్లాంట్లలో పని చేసే వారి సంఖ్యను తగ్గించింది. ఈ నెల 31 వరకూ అమలులో ఉంటుందని కంపెనీ తెలిపింది. జీఓసీఎల్ కార్పొరేషన్ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాన్ని మూసివేసింది. ఇంటి నుంచి పని చేసే వెసులుబాటు కల్పించింది. మరోవైపు ఈ నెల 31 ప్లాంట్లలో వరకూ నిలిపివేస్తున్నట్లు పిట్టి ఇంజనీరింగ్ వెల్లడించింది. హైదరాబాద్‌తో సహా వివిధ ప్రాంతాల్లో ఉన్న యూనిట్లలో అత్యవసరమైన ఉత్పత్తి కార్యకలాపాలను మాత్రమే చేపడుతున్నట్లు భెల్ వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాలు సిమెంట్ ఉత్పత్తికి ప్రధాన కేంద్రంగా ఉన్నాయి. రెండు రాష్ట్రాల్లో సిమెంట్ యూనిట్లు కలిగిన కొన్ని కంపెనీలు ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్‌ను అమలు చేయడానికి వీలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో సహా తమిళనాడు, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని సిమెంట్ ఉత్పత్తి యూనిట్లలో ఉత్పత్తిని ఇండియా సిమెంట్స్ నిలిపివేసింది. సాగర్ సిమెంట్స్, దాని అనుబంధ కంపెనీలు సైతం తెలుగు రాష్ట్రాల్లోని యూనిట్లలో సిమెంట్ ఉత్పత్తిని బంద్ చేశాయి. కాగా తెలంగాణాలోని సిమెంట్ ప్లాంట్‌లో ఉత్పత్తిని 31 వరకూ నిలిపివేస్తున్నట్లు అంజనీ పోర్ట్‌లాండ్ వెల్లడించింది.

### అదే బాటలో సిమెంట్ కంపెనీలు..

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 23వ తేదీకి.. | | విజయవాడ | 330 |
| హైదరాబాద్ | 275 | విశాఖపట్నం | 345 |
| 24వ తేదీకి.. | | వరంగల్ | 278 |
| చిత్తూరు | 253 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 330 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 50 | విజయవాడ | 50 |
| వరంగల్ | 50 | గుంటూరు | 50 |
| మహబూబ్‌నగర్ | 50 | ఒంగోలు | 50 |
| కరీంనగర్ | 50 | చిత్తూరు | 50 |
| కర్నూలు | 50 | నెల్లూరు | 50 |
| విశాఖపట్నం | 42 | అనంతపురం | 41 |
| గోదావరి | 50 | | |

### జీఎస్‌టీ రిటర్న్ ఫైలింగ్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: కరోనా వైరస్‌ను దృష్టిలో ఉంచుకుని వివిధ జీఎస్టీ రిటర్నుల ఫైలింగ్ గడువును ప్రభుత్వం పొడిగించింది. 2020 ఫిబ్రవరి నెలకు సంబంధించిన జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ ఫైలింగ్‌ను ఏప్రిల్ 7 వరకు దాఖలు చేసే వెసులుబాటు కల్పించింది. ఈ నెలాఖరులోగా ఫారం జీఎస్‌టీఆర్-9లో ఫైల్ చేయాల్సిన యాన్యువల్ రిటర్న్, రీకాన్సిలియేషన్ స్టేట్‌మెంట్ల గడువును జూన్ 30 వరకు పొడిగించారు. కాంపోజిషన్ పథకం ఎంచుకునే గడువును ఈ నెలాఖరు నుంచి ఏప్రిల్ 7 వరకు పొడిగించినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

### భారత వృద్ధికి కరోనా ఝలక్

ముంబై: లాక్‌డౌన్‌లు, పలు వ్యాపారాల స్తంభన నేపథ్యంలో వృద్ధిరేటు అంచనాను రేటింగ్ ఏజన్సీలు గణనీయంగా కుదించాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 4 శాతానికే పరిమితం కావచ్చని యూబీఎస్ సెక్యూరిటీస్ ప్రకటించగా 5.2 శాతం ఉండవచ్చని ఎస్ అండ్ పీ ప్రకటించింది.

### కరోనా ఎఫెక్ట్

- కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తమ ప్లాంట్లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు కియా మోటార్స్, బీఎండబ్ల్యూ, మెర్సిడెస్, రెనో, బజాజ్, యమహా, టీవీఎస్ సోమవారంనాడు ప్రకటించాయి.
- కోవిడ్-19 పాలసీ కవర్ కింద ప్రభుత్వ సదుపాయాల్లో క్వారంటైన్ అయిన వారికి బీమా సదుపాయం కల్పించనున్నట్లు ఎడెల్‌వీస్ జనరల్ ఇన్సూరెన్స్ తెలిపింది. కరోనా నిర్ధారణ అయి హాస్పిటల్లో చేరిన వారికే కాకుండా ప్రభుత్వం గుర్తించిన ప్రత్యేక సదుపాయాల్లో ఉన్న వారికీ కవరేజీ ఇస్తున్నట్లు తెలిపింది.
- మార్చి 31 వరకు ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు సామ్‌సంగ్, ఎల్‌జీ, పానసోనిక్, గోద్రెజ్ అప్లయెన్సెస్ ప్రకటించాయి. అనేక రాష్ట్రాల్లో లాక్‌డౌన్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. ప్రభుత్వం నుంచి వెలువడే తదుపరి ప్రకటనలను బట్టి ఉత్పత్తిని ప్రారంభించే అంశంపై సమీక్ష జరపనున్నట్లు కంపెనీలు తెలిపాయి.
- కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే చర్యల కోసం ప్రైవేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ రూ.100 కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. ఈ సొమ్మును కస్టమర్లు, ఉద్యోగులు, వెండార్లు, ప్రభుత్వం ఏజెన్సీలు, కమ్యూనిటీకి మద్దతుగా వినియోగించనుంది.
- కరోనా వైరస్ కట్టడి కోసం కంపెనీలు వెచ్చించే మొత్తాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యకలాపాల కింద పరిగణించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. కంపెనీల చట్టం కింద కంపెనీలు తమ వార్షిక లాభాల్లో రెండు శాతాన్ని సీఎస్ఆర్ కోసం వెచ్చించాల్సి ఉంటుంది.
- దేశంలోని అన్ని బ్రాంచ్‌లను కూడా మార్చి 31 వరకు మూసివేస్తున్నట్లు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) తెలిపింది. అత్యవసరం ఉన్న అంశాలను యాక్టింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షతన సింగిల్ మెంబర్ సారథ్యంలోని ఎన్‌సీఎల్‌టీ - చెన్నై బెంచ్ విచారిస్తుందని, బుధ, శుక్రవారాల్లో మాత్రమే ఈ విచారణ ఉంటుందని పేర్కొంది.

### అమరావతి భూకొనుగోళ్లపై..

# సీబీఐతో దర్యాప్తు!

(మొదటిపేజీ తరువాయి)

తదుపరి దర్యాప్తు కోసం సీబీఐకి అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన పలువురు ప్రముఖుల నేతృత్వంలో భూ అక్రమాలు జరిగాయని గుర్తించినట్లు ఉపసంఘం కొన్ని నెలల క్రితం నివేదిక సమర్పించింది. అమరావతిలో అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న పేద దళిత రైతులను లొంగదీసుకుని, వందల ఎకరాలను గత ప్రభుత్వంలోని కొందరు పెద్దలతోపాటు వారి అండతో మరి కొందరు సొంతం చేసుకున్నారని ఆరోపించింది. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూముల క్రయ విక్రయాలు నిషిద్ధమైనా టీడీపీ నేతలు పెద్దఎత్తున వాటిని తీసుకున్నారని.. తద్వారా భారీఎత్తున లబ్ధి పొందారని పేర్కొంది.

**'పరిశోధన'లో ఏమీ తేలక..**

అమరావతి కోసం చేపట్టిన భూసమీకరణ అత్యంత భారీ భూ కుంభకోణమని, ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని వైసీపీ అధినేత జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచే ఆరోపించారు. ఆయన సీఎం అయ్యాక సీఐడీ సహా వివిధ సంస్థల ద్వారా 'పరిశోధన' చేయించారు. అప్పటి సీఎం చంద్రబాబు, ఆయన మంత్రివర్గ సహచరులు, టీడీపీ నేతల పాత్రపై తాము కోరుకున్న విధంగా నివేదికలు రాలేదు. నెలలు గడుస్తున్నా ఆరోపణలకు రుజువులు చూపించలేకపోయారు. ఈలోపు.. రాజధాని అమరావతిని తరలించేందుకు 3 రాజధానులను తెరపైకి తెచ్చారు. కానీ శాసనమండలిలో దానికి బ్రేకుపడింది. ఈ పరిస్థితుల్లో.. గద్దెనెక్కి నెలలు గడిచిపోతున్నా ఆరోపణలను నిరూపించలేకపోవడం.. రాజకీయ లబ్ధి కోసం, అమరావతిని నిర్వీర్యం చేసేందుకు నిరాధార నిందలు వేశారన్న విషయం బహిర్గమవుతుందని ప్రభుత్వ పెద్దలు భయపడినట్లు సమాచారం. ఆఖరి అస్త్రంగా మంత్రివర్గ ఉపసంఘం నివేదికను ఉపయోగించుకున్నారు. నిజానికి.. రాజధానిలో 4,000 ఎకరాల కొనుగోళ్లకు సంబంధించి పెద్దఎత్తున అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు ఉపసంఘం కనుక్కుందని.. దాని ఆధారంగా తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు జగన్ ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. తదనుగుణంగానే.. తమకు చెందిన భూములను మాజీ మంత్రులు నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు తదితర నేతలు భయపెట్టి గుంజుకున్నారని కొందరు దళితుల నుంచి పోలీసులకు ఫిర్యాదులందాయి. వీటిపై సీఐడీ కేసులు నమోదు చేసింది. ఆ తర్వాత డీఐజీ కొల్లి రఘురాంరెడ్డి నేతృత్వంలో సిట్ ఏర్పాటైంది. ఈ బృందం కొందరు వ్యక్తుల ఇళ్లలో, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. అయితే ఇన్ని చర్యలు తీసుకున్నా.. భూముల క్రయవిక్రయాల్లో కుంభకోణం చోటు చేసుకుందన్న ఆరోపణలను ప్రజల్లో అత్యధికులు విశ్వసించడం లేదని విశ్లేషకులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో తన పరువు కాపాడుకునేందుకే జగన్ ప్రభుత్వం సంబంధిత కేసులను సీబీఐకి అప్పగించాలని నిర్ణయించిందని విశ్లేషకులు చెబుతున్నారు.

# హాలికుని హాహాకారాలు

▸▸ స్తంభించిన రవాణాతో నిలిచిన ఎగుమతులు

▸▸ దారుణంగా పడిపోయిన ధరలు

▸▸ పక్వానికి వచ్చినా పొలానికే పరిమితమైన చీనీ, మామిడి, అరటి



కడప లింగాలలో అరటిని లోడ్ చేస్తున్న కూలీలు

కడప, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి దెబ్బకు సీమ రైతు విలవిలలాడుతున్నాడు. మంచి నాణ్యతతో దేశంలోని వివిధ మెట్రో నగరాలకు, విదేశాలకు ఎగుమతి అయ్యే ఉద్యానవన పంటలకు హఠాత్తుగా గిరాకీ పడిపోయింది. కోవిడ్ 19 దెబ్బకు ఎగుమతులు, దిగుమతులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. అంతర్రాష్ట్ర రవాణా నిలిచిపోయింది. దీనితో కొనేవాడే లేక, ఒక వేళ ఎవడైనా వచ్చినా సగానికి సగం ధరకు అమ్మితేనే అంటూ కండిషన్ పెడుతుండడంతో రైతు అల్లాడిపోతున్నాడు. పొలంలో పంటను కుళ్లబెట్ట లేక, అయిన కాడికి అమ్ముకోవాల్సి రావడంతో కుమిలిపోతున్నాడు. పెట్టుబడులు కూడా రాకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ భోరుమంటున్నాడు. కడప జిల్లా పులివెందుల, రైల్వేకోడూరు, మైదుకూరు, కర్నూలు జిల్లాలో మహానంది ప్రాంతాల్లో అరటి అత్యధికంగా సాగు చేస్తున్నారు. ఒక్క కడప జిల్లాలోనే 20 వేల హెక్టార్లలో సాగవుతోంది. ఇక్కడి నుంచి ఢిల్లీ, గుజరాత్, కలకత్తా, ముంబై. చెన్నై, బెంగుళూరు వంటి ప్రాంతాలకు అరటి ఎగుమతి అవుతోంది. నాణ్యతను బట్టి టన్నుకు రూ.10 వేల నుంచి రూ.14,500 వరకు చెల్లిస్తారు. కరోనా ఎఫెక్ట్ వల్ల రవాణా స్తంభించడంతో టన్ను రూ.3500కు కూడా కొనేవారు లేరు. దీంతో ఎకరాకు సరాసరి రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు అన్నదాత కోల్పోతున్నాడు. జిల్లా నుంచి పులివెందుల, రైల్వేకోడూరు ప్రాంతాల నుంచి రోజుకు 75-100 వెళ్లే అరటి లారీలు ప్రస్తుతం ఒక్కటీ కదలడం లేదు. చీనీ పరిస్థితి దాదాపు ఇదే. గరిష్ఠంగా టన్ను రూ.40 వేలు ధర పలికేది. ప్రస్తుతం రూ.15 - 20 వేలకు కూడా కొనేవారు లేరు. ఎకరాకు రూ.1.20 లక్షలు నష్టపోతున్నామన్నది రైతుల ఆవేదన. మైదుకూరు, కమలాపురం నియోజకవర్గాల్లో దోస (కర్బూజ) అధికంగా సాగు చేస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 5 టన్నులు దిగుబడి వస్తుంది. ఇక్కడ పండించిన పంటను ముంబై, బెంగుళూరు, చెన్నై, ఢిల్లీ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. రవాణా లేక పొలంలోనే పంట కుళ్లిపోతోంది. కడప జిల్లాలో పసుపు విదేశాలకు ఎగుమతి అవుతోంది. జిల్లాలో ఈ ఏడాది 3,573 హెక్టార్లు సాగు చేశారు. 2.50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దీనిలో అధిక శాతం జపాన్‌కు ఎగుమతి అయ్యేది. అయితే కరోనా దెబ్బకి నౌకలు ససేమిరా అంటున్నాయి. ఆ ప్రభావం ధరలపై పడింది. ఐదు రోజుల క్రితం నాణ్యతను బట్టి క్వింటాల్ రూ.5,800 నుంచి రూ.6 వేల దాకా ఉండేది. ప్రస్తుతం రూ.4500 నుంచి రూ.5,300లకు మించి కొనేవారు లేరు. సగటున క్వింటాల్‌కు రూ.1000 దాకా నష్టపోవాల్సి వస్తోంది.

**▸▸ రూ.10 లక్షలు నష్టం**



"ఐదు ఎకరాల అరటి సాగు చేశాను. ఎకరాకు 25 టన్నుల దాకా దిగుబడి వస్తుంది. పంట పక్వానికి వచ్చింది. పంట కోత చేసి అమ్ముదామంటే కరోనా ఎఫెక్ట్‌తో రవాణా లేక వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ఢిల్లీ, గుజరాత్ నుంచి వచ్చిన వ్యాపారులు వెళ్లిపోయారు. స్థానిక వ్యాపారులను అడిగితే టన్ను రూ.3,500లకు మించి కొనుగోలు చేయలేమంటున్నారు. సగటున టన్నుకు రూ.10 వేలు నష్టపోతున్నా. ఐదు ఎకరాలకు రూ.10 లక్షలు నష్టాన్ని భరించాల్సి వచ్చింది. టన్ను రూ.3,500లకు కూడా అమ్ముకోకపోతే పొలంలోనే మాగిపోయి చేలోనే వదిలేయాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

*- దివాకర్‌రెడ్డి, అరటి రైతు, లింగాల, కడప*

**▸▸ పసుపు ఎగుమతి ఆపివేశారు**



'కడప పసుపుకు వివిధ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. జపాన్ క్వాలిటీ పసుపు ఇక్కడ పండిస్తున్నారు. ముంబయి పోర్టు నుంచి నడిచే ఎగుమతులు అన్నీ కరోనా దెబ్బకి నిలిచిపోయాయి. మేము కూడా కొనుగోళ్లు ఆపివేశాం. ఐదారు రోజుల క్రితం కొత్త పసుపు గరిష్ఠంగా క్వింటాల్ రూ.5,800 - రూ.6 వేలు ధర ఉండేది. ప్రస్తుతం రూ.5300లకు పడిపోయింది. రైతులు నష్టపోతున్నారు.

*- గుర్రంకొండ మహేశ్, కోశాధికారి, పసుపు వ్యాపారుల సంఘం, కడప*

## అమరావతిని 'ముంచిన' సలహాకు రూ.7 కోట్లు!

▸▸ బీసీజీకి మంజూరుచేసిన ప్రభుత్వం

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తన ఆదేశానుసారం పరిపాలనా వికేంద్రీకరణ అనే 'వినూత్న కాన్సెప్ట్'తో ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులు ఉండాలని సిఫారసు చేసిన బీసీజీ (బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్) సంస్థకు రాష్ట్రప్రభుత్వం రూ.7.02 కోట్లు మంజూరుచేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. అమరావతికి ముంపు బెడద ఉందంటూ ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రకటనలకు 'సాధికారత' చేకూర్చేందుకు మద్రాస్ ఐఐటీ ఇదే చెప్పిందని బీసీజీ తన నివేదికలో పేర్కొంది. అలాంటి నివేదికేదీ తామివ్వలేదని.. అలాంటి విభాగమే తమ వద్ద లేదని ఆ ఐఐటీ రాజధాని ప్రాంత రైతులకు స్పష్టం చేయడం వేరే విషయం. రాష్ట్ర ప్రణాళికా శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాలు, సంస్థల వద్ద అప్పటికే సిద్ధంగా ఉన్న 'మెటీరియల్'ను తీసుకుని 'కట్ అండ్ పేస్ట్' చేసి, అక్కడక్కడా కొద్దిపాటి మార్పు చేర్పులతో నివేదిక రూపొందించింది. కొన్ని విదేశీ నగరాలతో పోల్చడం ద్వారా 'అంతర్జాతీయ కలరింగ్' ఇచ్చింది. గత ఏడాది నవంబరు 27న బీసీజీని ఎంపిక చేయగా.. రాష్ట్రంలో ఎక్కడా పర్యటించకుండానే రెండు వారాలకే మధ్యంతర నివేదిక ఇచ్చింది. ఆ తర్వాత మూడు వారాల్లోపే తుది నివేదికనూ సమర్పించేసింది. రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే 3 రాజధానులు ఉండాలని.. శాసన రాజధానిగా అమరావతి, పరిపాలనా రాజధానగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలు ఉండాలని అందులో పేర్కొంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే మొదలై ఆయా జిల్లాల్లో అమలవుతున్న పలు కార్యక్రమాలను తన నివేదికలో పొందుపరిచింది. వీటన్నిటినీ అమలు చేయాలని సిఫారసుచేసింది. రాష్ట్ర ప్రణాళికా శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాలు, సంస్థల వద్ద అప్పటికే సిద్ధంగా ఉన్న 'మెటీరియల్'ను తీసుకుని 'కట్ అండ్ పేస్ట్' చేసి, అక్కడక్కడా కొద్దిపాటి మార్పు చేర్పులతో నివేదిక రూపొందించింది. ఈ సంస్థకు అసలు విశ్వసనీయతే లేదని.. కొన్ని దేశాల్లో కేసులు నమోదై ఉన్నాయని.. బ్లాక్‌లిస్టులో పెట్టారని టీడీపీ నేతలు ఆరోపణలు గుప్పించారు. పైగా ప్రస్తుత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడి స్నేహితుడొకరు ఈ సంస్థలో కీలక స్థానంలో ఉన్నారని, అందువల్లే ఈ రిపోర్టును రూపొందించే బాధ్యతను బీసీజీకి ఇచ్చారనీ విమర్శించారు. ఎవరెన్ని అన్నప్పటికీ.. బీసీజీకి అక్షరాలా రూ.7.02 కోట్ల ప్రజాధనాన్ని ఫీజుగా మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చేసింది.

# రాత్రి 8 నుంచి ఉదయం 6 వరకూ అన్నీ బంద్

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లాక్‌డౌన్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. కరోనా వైరస్ నియంత్రణ, లాక్‌డౌన్ అమలుపై సోమవారం విజయవాడలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డీజీపీ గౌతం సవాంగ్, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డితో కలిసి 13 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లాక్‌డౌన్ అమలు, తొలిరోజు ఎదురైన సమస్యలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఏపిడమిక్ డిసీజ్ యాక్ట్-1897 మేరకు విడుదల చేసిన జీవో ఎంఎస్ 209 మేరకు ఈ నెల 31 వరకూ లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. రాత్రి 8 నుంచి ఉదయం 6 వరకూ మెడికల్ షాపులు తప్ప అన్ని దుకాణాలూ మూసేయాలని స్పష్టం చేశారు. విదేశాల నుంచి వచ్చిన వారు విధిగా హోం క్వారంటైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి 6 తర్వాత రాష్ట్రానికి వచ్చిన వారందరినీ త్వరితగతిన గుర్తించి, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ నీలం సాహ్ని సూచించారు. విదేశాల నుంచి తిరిగి వచ్చినవారు తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని డీజీపీ గౌతం సవాంగ్ ఆదేశించారు. చేయించుకోని వారిపైనా, వారి కుటుంబ సభ్యులపైనా కేసు నమోదు చేస్తామన్నారు. నిత్యావసర వస్తువుల రవాణాలో ఎక్కడా ఆటంకం లేకుండా చూడాలని డీజీపీ చెప్పారు. ఇప్పటి వరకూ రాష్ట్రానికి 16 వేల మంది విదేశాల నుంచి వచ్చిన వారు ఉన్నారని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి చెప్పారు.

# నలుగురికి మించి ఉండొద్దు..

▸▸ 8 తర్వాత అన్ని షాపులు బంద్ చేయాలి

▸▸ ప్రజలు సరుకుల కోసం 2 కి.మీ మించి వెళ్లకూడదు

▸▸ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అంటువ్యాధుల చట్టం 1897 నిబంధనల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన ప్రభుత్వం దీనిలో మరికొన్ని కొత్త నిబంధనలు పొందుపరించింది. రాష్ట్రంలో పబ్లిక్ ప్రదేశాల్లో నలుగురికి మించి ఉంచకూడదని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు మాత్రమే నిత్యావసర సరుకుల కోసం రోడ్ల మీదకు రావాలని.. ద్విచక్రవాహనంపై ఇద్దరు, కార్లలో ఇద్దరుకు మించి ప్రయాణం చేయకూడదని, అది కూడా అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని.. రాత్రి 8 తర్వాత మందుల షాపుల తప్ప మరే ఇతర షాపులు తెరిచి ఉంచడానికి వీల్లేదని.. నిత్యావసరాల కోసం వచ్చే వారు వారి ఇంటి దగ్గర నుంచి కేవలం రెండు కిలోమీటర్ల పరిధిలో మాత్రమే వెళ్లాలని పేర్కొన్నారు.



ఈనెల 31 వరకు లాక్‌డౌన్ విధించిన విషయాన్ని విజయవాడలో ప్లకార్డులతో తెలియజేస్తున్న కానిస్టేబుల్

విజయవాడ స్వరాజ్య మైదానంలోని రైతుబజారులో జనం రద్దీ





## సచివాలయంలోకి ప్రవేశం లేదు!

### సందర్శకులెవరూ రావొద్దు

**గేటు బయట నోటీసు.. ఉద్యోగుల హాజరూ తక్కువే**

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కరోనా ప్రభావం అమరావతిలోని సచివాలయంపైనా పడింది. సందర్శకులకు అనుమతి లేదంటూ సెక్రటేరియట్ గేటు బయట నోటీసు పెట్టారు. సందర్శకుల రాకపోకల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇంకోవైపు.. ఉద్యోగుల హాజరు కూడా అంతంత మాత్రంగానే ఉంది. సోమవారం 30 శాతం కంటే తక్కువ మంది హాజరయ్యారు. దీంతో ఐదు బ్లాకులూ బోసిపోయాయి. వారి చాంబర్లు వెలవెలబోయాయి. ఇప్పటికే ప్రభుత్వం 50 శాతం మంది ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోం' ఇవ్వడంతో.. అవకాశం ఉన్న ఉద్యోగులు ఇంటి నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. సచివాలయానికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను నిలిపి వేయడంతో సొంత వాహనాలున్న అధికారులు, ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు.

# లాక్‌డౌన్ బేఖాతర్



విజయవాడలోని రామవరప్పాడు రింగ్ వద్ద సోమవారం లాక్‌డౌన్‌ను అతిక్రమించి రోడ్డెక్కిన వాహనాలు (ఎడమవైపున)

» జనసంచారం యథాతథం

» నేటి నుంచి రాష్ట్రంలో కఠిన చర్యలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునే క్రమంలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చింది. ప్రజలు ఇళ్లకే పరిమితం అవ్వాలని.. కలివిడి కన్నా విడివిడిగా ఉంటేనే వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది. అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగిన జనతా కర్ఫ్యూకు సంపూర్ణంగా సహకరించిన ప్రజలు సోమవారం నుంచి ఈ నెల 31 వరకు విధించిన లాక్‌డౌన్ విషయంలో మాత్రం తొలిరోజే ప్రభుత్వ సూచనలను బుట్టదాఖలు చేశారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాష్ట్రవ్యాప్తంగా జన సంచారం సాధారణంగానే కనిపించింది. రైతు బజార్లు, నిత్యావసర దుకాణాల వద్ద ప్రజలు కిక్కిరిసి కనిపించారు. రోడ్లపై ఆటోలు, కార్లు, వ్యక్తిగత వాహనాలు భారీగానే కనిపించాయి. దీంతో అసలు ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ కొనసాగుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇంతలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు రంగంలోకి దిగి ఎక్కడికక్కడ ప్రజలను నిలువరించే పని చేపట్టాయి. మొత్తంగా చూస్తే రాష్ట్రంలో లాక్‌డౌన్ తొలిరోజు పాక్షికంగానే జరిగినట్టయింది. తిరుపతి, చిత్తూరు నగరాలతో పాటు మదనపల్లె, శ్రీకాళహస్తి, నగరి, పుత్తూరు, పుంగనూరు, సత్యవేడు, పీలేరు, కుప్పం వంటి పట్టణాల్లో కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్లపై జనం గుంపులు గుంపులుగా కనిపించారు. ఆటోలు యథాతథంగా తిరిగాయి. ప్రైవేటు వాహనాల రాకపోకలు కూడా కొనసాగాయి. దుకాణాలు కూ డా చాలా వరకు తెరుచుకున్నాయి. జిల్లా యంత్రాంగం, స్థానిక పోలీసు, మున్సిపల్ యంత్రాంగాలు ఆలస్యంగా స్పందించి, పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. జనం గుంపుగా లేకుండా చూశారు. ఆటోలను అడ్డుకున్నారు. మరోసారి కనిపిస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు పెడతామని హెచ్చరించారు. దుకాణాలు కూడా బలవంతంగా మూయించారు. మంగళవారం నుంచి ప్రజా రవాణా జరిగినా, నిత్యావసర దుకాణాలు మిన హా మిగిలిన షాపులు తెరిచినా కేసులు పెడతామని హెచ్చరించారు.

### తిరుపతిలో స్పందన శూన్యం

లాక్‌డౌన్‌ను తిరుపతి ప్రజలు సీరియస్‌గా పరిగణించలేదు. దీంతో ఉదయం నుంచి రోడ్లన్నీ జనాలతో నిండిపోయాయి. అన్ని దుకాణాలు తెరుచుకున్నాయి. ఈ విషయం తెలిసిన వెంటే ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ గిరీషలు పలు ప్రాంతాల్లో పర్యటించారు. గుంపులుగా జనం కనిపించిన చోట్ల హెచ్చరిస్తూ దుకాణాలు మూయించారు. చిత్తూరులో సైతం ప్రజలు, వ్యాపారులు లాక్‌డౌన్ పాటించడం లేదని, వాహనాలు యథాప్రకారం నడుస్తున్నాయని కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదులు అందడంతో వారు రంగంలోకి దిగారు. మండల కేంద్రమైన కలికిరిలో సోమవారం జరిగిన వారపు సంత కొనుగోళ్లు, అమ్మకందార్లతో కిటకిటలాడింది. బుధవారం ఉగాది కావడంతో సంతలో కొనుగోళ్లకు జనం భారీ ఎత్తున వచ్చారు. దీంతో జనాన్ని నియంత్రించడం పోలీసులకు కూడా సాధ్యం కాలేదు.

### తెలంగాణలోనూ ఇదే పరిస్థితి!

పొరుగు రాష్ట్రం తెలంగాణలోనూ ఆదివారం జనతా కర్ఫ్యూకి సహకరించిన ప్రజలు.. లాక్‌డౌన్ ఆదేశాలను బేఖాతరు చేశారు. నిర్మల్ జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనాలు యథావిధిగా తిరిగాయి. జగిత్యాల జిల్లాలోనూ లాక్‌డౌన్ సరిగా అమలు కాలేదు. హోటళ్లు, టీ కొట్లు, చికెన్ షాపులు, కిరాణ షాపులు అన్నీ తెరిచి ఉంచారు. వరంగల్ అర్బన్ జిల్లాలో లాక్‌డౌన్‌ను ప్రజలు పట్టించుకున్నట్టు కనిపించలేదు. ఉదయమే పెద్ద సంఖ్యలో రోడ్ల మీదికి వచ్చారు. అయితే మధ్యాహ్నం నుంచి డీజీపీ ఆదేశాల మేరకు పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఎక్కడి వాహనాలను అక్కడే ఆపివేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో డొమెస్టిక్ విమాన సర్వీసుల కోసం ప్రజలు బారులు తీరారు. కాగా, రాష్ట్ర సరిహద్దు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం నుంచి వాహనాల రాకపోకలను పోలీసులు పూర్తిగా నిలిపివేశారు. విజయవాడ వైపు వెళ్లేందుకు అనుమతించాలని వాహనదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.



చిత్తూరు జిల్లా కలికిరి సంతలో కొనుగోళ్ల జోరు



గన్నవరంలో కూరగాయల దుకాణం వద్ద మీటరు దూరం కోసం ఇలా ముగ్గులోకి..

### బ్రేకులు పడని ఆటోలు, కార్లు

**లాక్‌**డౌన్ ప్రభావం ప్రకాశం జిల్లాలో పాక్షికంగా కనిపించింది. ప్రజారవాణా వ్యవస్థ ఆగిపోయినా ప్రధాన రహదారులతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఆటోలు, కార్లు ఇతర వాహనాలు విస్తృతంగా తిరిగాయి. ఒంగోలు నగరంలోనూ వాహనాలు సాధారణంగానే తిరిగాయి. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నా జనసంచారం అధికంగానే కనిపించింది. పోలీసులు అక్కడక్కడ దుకాణాలను, ప్రజలను నియంత్రించే ప్రయత్నం చేసినా పెద్దగా ఫలించలేదు. అనంతపురం జిల్లాలోనూ లాక్‌డౌన్ పాక్షికంగా జరిగింది. జనతా కర్ఫ్యూ స్థాయిలో లాక్‌డౌన్‌కు ప్రజలు స్పందించలేదు. 11 గంటల తరువాత జిల్లా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. పోలీసులు ఆంక్షలు విధించారు. రోడ్లపై ఎవ్వరూ తిరగకుండా ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపైకి వచ్చిన వారందరినీ తిరిగి ఇళ్లకు పంపారు. దీంతో మధ్యాహ్నం నుంచి పరిస్థితి మారింది. స్వయంగా జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు, ఎస్పీ సత్యయేసు బాబులు రోడ్లపైకి వచ్చారు. మంగళవారం నుంచి మరింత కఠిన నిబంధనలు అమలు చేసేందుకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సిద్ధమవుతోంది. కాగా, ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ విజయవాడ ప్రజలకు కూడా పట్టలేదు. ఉదయం నుంచి భారీగా రోడ్లపైకి వచ్చారు. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు వారితో వాగ్వివాదానికి దిగారు. రైతు బజార్లకు వినియోగదారులు పోటెత్తారు. దీంతో ఒకానొక దశలో అధికారులు హడలిపోయారు. వెనువెంటనే దుకాణాలను మార్పు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలోనూ లాక్‌డౌన్ పాక్షికంగానే కనిపించింది. కాకినాడ, రాజమండ్రి వంటి కీలక పట్టణాల్లో ప్రజలు భారీ సంఖ్యలో బయటకు వచ్చారు.

### నెల్లూరులో 144 సెక్షన్

నెల్లూరు జిల్లాలో పోలీసులు ప్రజల రాకపోకలను నియంత్రించినా బయట తిరిగేవారి సంఖ్య తగ్గలేదు. దీంతో కలెక్టర్ శేషగిరిబాబు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 31 వరకు 144 సెక్షన్ అమలుకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో సాయంత్రం నుంచి రోడ్లపై తిరిగేవారి సంఖ్య తగ్గింది.



విజయవాడ పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద వాహనదారులకు మైక్‌లో హెచ్చరికలు

## బస్సుల బంద్‌తో బాదుడే!

» మామూలు కన్నా మూడురెట్లు

**అదనంగా ట్యాక్సీల వసూలు**

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సర్కారీ బస్సులు ఆగిపోయాయి. ఒక్కరోజు అనుకున్నది తొమ్మిది రోజులకు పెరగడంతో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. కరోనా తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ లాక్ డౌన్ నిర్ణయం మేరకు పీటీడీ అధికారులు ఈ నెల 31 వరకూ బస్సులు ఆపేశారు. ఇదే అవకాశంగా భావించిన ప్రైవేటు వాహనదారులు చెలరేగిపోతున్నారు. సాధారణ రోజుల్లో ఉండే చార్జీలకు రెట్టింపు వసూలు చేస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారిని టాక్సీలు, పొరుగు ఊళ్లకు జిల్లాలోనే ఇతర పట్టణాలకు వెళ్లే వారిని ఆటోలు పిండేశాయి. తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సిన ప్రయాణికులు ఈ బాదుడును భరించాల్సి వచ్చింది. హైదరాబాద్ నుంచి విజయవాడ, కర్నూలు వైపు వచ్చేవారి నుంచి మూడు రెట్లు అదనంగా వసూలు చేశారు.

### డీజీపీ సవాంగ్ సమీక్ష

రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితిని గమనించిన డీజీపీ గౌతమ్ సవాంగ్ ఎప్పటికప్పుడు వీడియో ద్వారా వీక్షించారు. జిల్లాల ఎస్పీలు, విజయవాడ, విశాఖ కమిషనర్లతో ఆయన సమీక్షించారు. అనవసరంగా రోడ్డుపైకి వచ్చే వాహనాలను వెనక్కి పంపాలని, ప్రభుత్వ జీవో ప్రకారం అందులో ఉన్న నిబంధనలు అమలు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసరాలైన పాలు, కూరగాయల్లాంటివి కొనుగోలు చేయడానికి ప్రజలకు కొంత సేపు సమయం ఇవ్వాలని, ఆ తర్వాత ఎవరినీ రోడ్లపైకి రానీవద్దని సూచించారు. అత్యవసరమైతే కారణాలు కనుక్కుని సహేతుకంగా ఉంటే అనుమతించాలన్నారు. వీలైనంతవరకూ సర్ది చెప్పాలని, వినకుండా విసిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆదేశించారు. వైరస్ వ్యాప్తి చేసే వ్యక్తులపై తీసుకునే ఐపీసీ 269, 270 సెక్షన్లను వివరిస్తూ ఒకటి ఆర్నెళ్లు, మరొకటి రెండేళ్ల శిక్షపడే అవకాశం ఉందని క్షేత్రస్థాయి పోలీసులకు వివరించిన డీజీపీ సవాంగ్.. సెక్షన్లు ఏమి చెబుతున్నాయో వాట్సాప్ ద్వారా పోలీసులకు, విలేకరులకు పంపారు.

### మధ్యాహ్నం తర్వాతే అదుపులోకి.

సోమవారం మధ్యాహ్నం డీజీపీ ఆదేశాలతోపాటు మొబైల్‌కు సందేశాలు రావడంతో పోలీసులు రోడ్లపై బారికేడ్లు అడ్డుపెట్టి రోప్ కట్టేశారు. ప్రభుత్వం అనుమతించిన వాహనాలు మినహా మిగతా వాటిని దాదాపు నిలిపేశారు. ఆటోలను సీజ్ చేశారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

# ఉత్పత్తికి బ్రేక్!

**విశాఖలో కంపెనీలన్నీ షట్‌డౌన్.. ఇంకా నిర్ణయించని స్టీల్‌ప్లాంట్**

**కియ కార్ల పరిశ్రమ లాక్‌డౌన్ ..శ్రీసిటీలో కంపెనీల మూసివేత**

**31 వరకూ షార్‌కు సెలవులు.. చైనా బొమ్మల తయారీ నిలిపివేత**

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కరోనా వైరస్ రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల ఉత్పత్తిపై తీవ్రప్రభావం చూపింది. కొవిడ్-19 నియంత్రణకు ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో.. ప్రధాన కంపెనీలన్నీ ఈ నెలాఖరు వరకూ మూసివేస్తున్నట్టు వెల్లడించాయి. విశాఖ నగరంలో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, హిందూస్థాన్ షిప్‌యార్డు, షిప్ బిల్డింగ్ సెంటర్, నేవల్ డాక్‌యార్డు, బీహెచ్‌పీవీలకు ఈ నెలాఖరు వరకు సెలవులు ప్రకటించేశారు. వీటిలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సుమారు 40 వేల మంది ఉంటారు. విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో 63 పరిశ్రమలు ఉండగా వాటిలో మందులు తయారు చేసే నాలుగు ఫార్మా కంపెనీలు తప్ప మిగిలిన 59 పరిశ్రమలను సోమవారం నుంచే షట్‌డౌన్ చేశామని డెవలప్‌మెంట్ కమిషనర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మందుల తయారీ అత్యవసర సర్వీసు అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో సిబ్బంది కంపెనీలకు వచ్చే అవకాశం లేనందున అనధికారికంగా ఉత్పత్తులు తగ్గించుకుంటున్నట్టు రాంకీ ఫార్మాసిటీలో కంపెనీలు తెలిపాయి.



లాక్‌డౌన్‌తో కియ పరిశ్రమలో నిలిచిపోయిన కార్లు

### రాష్ట్రమంతా అదే పరిస్థితి

అనంతపురంలోని కియ పరిశ్రమ, శ్రీసిటీలోని కంపెనీలతోపాటు శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం కూడా లాక్‌డౌన్ ప్రకటించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కియ యాజమాన్యం సోమవారం నుంచి ఈనెల 31 వరకు కార్ల ఉత్పత్తితో పాటు వాటి అనుబంధ సంస్థలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. కియ లాక్‌డౌన్‌తో 13వేల మంది ఉద్యోగులకు సెలవులు ఇచ్చారు. కియలో రోజుకు 400 కార్లు ఉత్పత్తి అవుతాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో అవన్నీ ఆగిపోనున్నాయి. కాగా.. కరోనా వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా ఈ నెల 31వరకు పరిశ్రమలను మూసివేస్తున్నట్లు శ్రీసిటీ యాజమాన్యం సోమవారం తెలిపింది. తూర్పుగోదావరి జిల్లా కొత్తమూలపేటలోని పాల్స్‌ఫ్లష్ చైనా బొమ్మల పరిశ్రమను ఈ నెల 31 వరకు మూసివేయాలని కొత్తపల్లి ఎస్ఐ పార్థసారధి యాజమాన్యానికి సోమవారం నోటీసులు జారీచేశారు. రొయ్యల ఫీడింగ్ కేంద్రానికి కూడా నోటీసులు ఇచ్చారు. షార్‌ను ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అత్యవసర విభాగాల ఉద్యోగులు మాత్రం పనిచేస్తారని వెల్లడించారు.

## మధ్యాహ్నం 2 దాకే బ్యాంకులు

» **ఏటీఎంల్లో నిధులకు ఢోకా ఉండదు: రాష్ట్ర బ్యాంకర్ల సమితి**

విజయవాడ, గుంటూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ఈ నెల 31వరకు బ్యాంకు పనివేళల్లో మార్పులు చేసింది. దీనిపై సోమవారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు మాత్రమే ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు పనిచేస్తాయి. కొత్త ఖాతాలు తెరవడం, రుణాల మంజూరు వంటి సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు. అన్ని ఏటీఎంల్లో పూర్తిగా నగదు అందుబాటులో ఉంటుంది. కాబట్టి ఏటీఎం కేంద్రాల వద్దకు గుంపులుగా వెళ్లొద్దని బ్యాంకర్ల సమితి ఖాతాదారులకు విజ్ఞప్తి చేసింది.

### » అత్యవసర సర్వీసుగా 'టెన్త్' పరీక్షలు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పరీక్షలను అత్యవసర సర్వీసుల కేటగిరీగా పరిగణిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 31 నుంచి జరగనున్న పరీక్షలకు అవసరమైన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్లు, వెబ్ క్యామ్స్ రవాణాకు అనుమతులిచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

### » లాక్‌డౌన్‌లో పూర్తి వేతనాలు: సీఎస్ ఆదేశం

లాక్‌డౌన్ కాలంలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా ఉద్యోగులకు పూర్తిగా వేతనాలు, జీతాలు చెల్లించాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చే వేతనాలైనా.. నెలవారీ జీతాలైనా పూర్తిగా చెల్లించాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని ఎవరైనా ఉల్లంఘిస్తే అంటువ్యాధుల చట్టం కింద తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. అలాగే లాక్‌డౌన్ సమయంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు, పాలు, గుడ్లు, మాంసం, చేపల వంటి వాటి సరఫరాలో అవరోధాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

### » 31 వరకు మద్యం లేదు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్‌లో భాగంగా మద్యం అమ్మకాలను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీచేశారు. కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా మద్యం షాపులు, బార్లు, కల్లు దుకాణాలు, సీ1 క్లబ్బులు, తాత్కాలిక లైసెన్సులు అన్నీ ఈ నెల 31 వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీంతో మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి.

### » ఏపీ భవన్‌కు తాళం!

న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కరోనా నియంత్రణలో భాగంగా ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లోని అన్ని విభాగాలను మూసివేశారు. ఈ మేరకు రెసిడెంట్ కమిషనర్ భావనా సక్సేనా సోమవారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలకు లోబడి ఏపీ భవన్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులు మంగళవారం నుంచి ఇళ్ల నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించారు. 60 ఏళ్ల పైబడిన కాంట్రాక్టు ఉద్యోగులు కూడా ఇంటి నుంచే విధులు నిర్వహించవచ్చని తెలిపారు. భవన్‌లో అత్యవసర సర్వీసులైన రిసెప్షన్, కరోనా కంట్రోల్ రూమ్ పనిచేస్తాయని చెప్పారు.

### కరోనాపై ఎన్నారైలలో అవగాహన పెంచాలి

» **తానా అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్**



గుంటూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్‌పై ప్రవాసాంధ్రుల్లో అవగాహన పెంచాలని ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్(తానా) అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ సూచించారు. ప్రధానంగా విదేశాల నుంచి తెలుగు రాష్ట్రాలకు వస్తున్న ప్రవాసాంధ్రులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆత్మ రక్షణ, ఆరోగ్య క్రమశిక్షణ అ నే అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు. కరోనా కట్టడికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలకు ప్రవాసాంధ్రులు, తానా సహకరిస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు దేశాల్లో ఉపాధి, ఉద్యోగ, విద్య, ఇతర రంగాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు స్వదేశానికి వస్తున్నప్పుడు ఈ వ్యాధి ప్రబలుతున్నట్లు పరిశోధనల్లో తేలినందున ప్రవాసాంధ్రులు కూడా జాగ్రత్తలు తీసుకొని ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు.

### » కరోనా నియంత్రణకు ఐఏఎస్‌లు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కరోనా నివారణ, నియంత్రణ చర్యలకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెటింగ్ కమిషనర్ ప్రద్యుమ్న, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి కమిషనర్ గిరిజా శంకర్, ఆర్థికశాఖ కార్యదర్శి కార్తికేయ మిశ్రా, విపత్తు నిర్వహణ కమిషనర్ కె.కన్నబాబులను ఆరోగ్యశాఖకు అటాచ్ చేశారు.

### » సీపీడీసీఎల్‌లో సెలవులు రద్దు

సీపీడీసీఎల్ (సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్) సిబ్బందికి సెలవులను రద్దు చేసింది. కరోనా ప్రభావంతో ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సీపీడీసీఎల్ ఎండీ పద్మా జనార్దన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అత్యవసర సేవల్లో ఏప్రిల్ 4వ తేదీ వరకు సంస్థలోని మొత్తం అధికారులు, సిబ్బంది 24/7అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

### » జ్యుడీషియల్ ఉద్యోగులకు సెలవులివ్వాలని వినతి

మంగళగిరి, మార్చి 23: రాష్ట్రంలోని వివిధ కోర్టులలో పని చేస్తున్న జ్యుడీషియల్ ఉద్యోగులకు కొంతకాలం సెలవులు ప్రకటించాలని ఏపీ రాష్ట్ర జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కరోనా నేపథ్యంలో జ్యుడీషియల్ రాష్ట్ర ఉద్యోగులు, న్యాయవాదులు, కక్షిదారుల ఆరోగ్య జాగ్రత్తలను సైతం దృష్టిలో ఉంచుకుని సెలవులు మంజూరు చేయాలని కోరినట్టు అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పీఎన్ మల్లేశ్వరరావు చెప్పారు. ఈ విషయాన్ని సీజే దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని రిజిస్ట్రార్ జనరల్ హామీ ఇచ్చారన్నారు.

### » విద్యార్థులకు బియ్యం, చిక్కీ, గుడ్లు పంపిణీ

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం అమల్లో భాగంగా విద్యార్థులకు బియ్యం, చిక్కీ, గుడ్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరోనా నేపథ్యంలో ఈ నెల 19 నుంచి 31 వరకు పాఠశాలలు మూసివేసిన దృష్ట్యా గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా వీటి పంపిణీకి పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కిలో బియ్యం, 4 చిక్కీలు, 8 గుడ్లు ఇస్తారు.ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కిలోన్నర బియ్యం, 4 చిక్కీలు, 8 గుడ్లు ఇస్తారు.

ఆంధ్రజ్యోతి

కరోనా కల్లోలం

విజయవాడ ● మంగళవారం 24 మార్చి 2020

## ఎంపీ సీఎంగా నాలుగోసారి శివరాజ్!

భోపాల్, మార్చి 23: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ చౌహాన్(61) మళ్లీ ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 15 నెలల్లోపు ఆయన తిరిగి అధికారాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఇప్పటికే ఎంపీ ముఖ్యమంత్రిగా మూడు విడతలు పనిచేసిన శివరాజ్ నాలుగోసారి బాధ్యతలు చేపట్టడం కూడా ఒక రికార్డే. సోమవారం రాత్రి 9 గంటలకు రాజ్‌భవన్‌లో జరిగిన నిరాడంబర కార్యక్రమంలో గవర్నర్ లాల్జీ టండన్ ఆయనచేత ప్రమాణం చేయించారు. వచ్చే వారంలోగా ఆయన తన కేబినెట్‌ను విస్తరించే అవకాశం ఉంది. అంతకముందు శివరాజ్ సింగ్ చౌహాన్ బీజేపీ శాసనసభా పార్టీ నేతగా ఎన్నికయ్యారు. చౌహాన్ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసిన అరగంటకే ప్రమాణం చేయడం విశేషం. ఈ కార్యక్రమానికి మాజీ సీఎం కమల్‌నాథ్(కాంగ్రెస్), బీజేపీ నాయకురాలు ఉమా భారతి హాజరయ్యారు. అంతకుముందు సీనియర్ ఎమ్మెల్యే గోపాల్ భార్గవ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేశారు. చౌహాన్‌కు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అభినందనలు తెలిపారు.

## సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక మూత!

**▸▸ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ**

న్యూఢిల్లీ, మార్చి 23: కరోనా నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రాంగణాన్ని తక్షణమే మూసేశారు. అత్యవసర కేసులు మాత్రమే వీడియో కాన్ఫరెన్స్, స్కైప్ ద్వారా విచారణ చేపట్టనుంది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ ఈ విషయం ప్రకటించాయి. సుప్రీంలో ఒక్క కోర్టు మాత్రమే అత్యంత ముఖ్యమైన కేసులను వారానికి ఒక్కరోజే విచారిస్తుంది. కాగా, కింది కోర్టులు, హైకోర్టులు, ట్రిబ్యునళ్ల నుంచి అప్పీళ్ల దాఖలుకు గడువు పరిమితిని సుప్రీంకోర్టు నిరవధికంగా పొడిగించింది. ఢిల్లీ హైకోర్టు, రాజధానిలోని జిల్లా కోర్టులను కూడా ఏప్రిల్ 4వరకు మూసివేశారు. మరోవైపు కిక్కిరిసిన జైళ్ల నుంచి ఖైదీలను 4 నుంచి ఆరు వారాల పాటు పెరోల్‌పై విడుదల చేసేందుకు ఉన్నతస్థాయి కమిటీలు వేయాల్సిందిగా సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలనూ, యూటీలను ఆదేశించింది.

## జనతా కర్ఫ్యూను 14 రోజులు పెట్టాలి

**▸▸ అప్పుడే వైరస్ కట్టడి.. మోదీకి దేశ్‌ముఖ్ విజ్ఞప్తి**

ముంబై, మార్చి 23: దేశంలో కరోనాకు అడ్డుకట్ట వేయాలంటే జనతా కర్ఫ్యూను కనీసం 14 రోజులు అమలు చేయాలని భారత మైక్రో బయాలజిస్టుల సంఘం(ఎంఎస్ఐ) అధ్యక్షుడు ఏఎమ్ దేశ్‌ముఖ్ అభిప్రాయపడ్డారు. అలాచేస్తే వైరస్ సోకినవారు బయటపడతారని, వారిని ఆస్పత్రుల్లో చేర్చి వైరస్ వ్యాప్తిని నిరోధించవచ్చని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశా రు.

## కనికా స్నేహితుడికి బలవంతపు కరోనా పరీక్షలు

ముంబై, మార్చి 23: బాలీవుడ్ సింగర్ కనికా కపూర్‌తో కలిసి లఖ్‌నవూ వెళ్లి.. మళ్లీ ముంబై వచ్చిన ఆమె స్నేహితుడికి శనివారం రాత్రి బలవంతంగా కరోనా వైరస్ పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలకు ఆయన నిరాకరించడంతో పోలీసుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆదివారం ఆయనకు నెగెటివ్ రావడంతో ఇంటికి పంపించారు.

## లాక్‌డౌన్‌కూ సహకరించండి: వెంకయ్య

న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కరోనాపై పోరులో భాగంగా నిర్వహించిన జనతా కర్ఫ్యూను ప్రజలంతా విజయవంతం చేశారని, అదే స్ఫూర్తితో లాక్‌డౌన్‌కూ సహకరించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. విపత్కర పరిస్థితుల్లోనూ జాతి యావత్తూ ఒకతాటిపై నడిచిదంటూ అభినందించారు. వెంకయ్య ప్రకటనను ఎంపీలంతా బల్లలు చరిచి స్వాగతించారు.

## చైనా అప్పుడే చెప్పి ఉండాల్సింది: ట్రంప్

వాషింగ్టన్, మార్చి 23: కరోనా విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాను మరోసారి విమర్శించారు. 'వారి తీరుతో కొంత అసంతృప్తికి గురయ్యా. వైరస్ గురించి 3 నెలల క్రితమే చెప్పి ఉంటే మేం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాణాలు కాపాడి ఉండేవారం' అన్నారు. కాగా, కరోనా నేపథ్యంలో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీ ప్రతిపాదన సెనేట్ ఆమోదం పొందలేకపోయింది.

## అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి శ్రీకారం

అయోధ్య, మార్చి 23: అయోధ్యలో రామ మందిర నిర్మాణ ప్రక్రియకు సోమవారం శ్రీకారం చుట్టారు. దేవతామూర్తుల విగ్రహాలను తాత్కాలిక కట్టడంలోకి తరలించేందుకు ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. ఆలయ నిర్మాణం పూర్తయ్యేవరకు విగ్రహాలను తాత్కాలిక కట్టడంలో ఉంచుతారు. మంగళవారం కూడా పూజలు కొనసాగుతాయి. బుధవారం ఉదయం విగ్రహాలను తరలిస్తారు. జైపూర్ శిల్పులు తయారుచేసిన 9.5 కిలోల వెండి సింహాసనంపై విగ్రహాలను ఉంచుతారు. అయోధ్యలో కరోనా వైరస్ కట్టడికి విధించిన ఆంక్షల మధ్యే ఈ ఘట్టానికి అంకురార్పణ జరిగింది.

# కరోనా పిడికిలిలో భారత్

## 9 మంది మృతి... 478 కేసులు.. 20 రాష్ట్రాలు లాక్‌డౌన్



పంజాబ్‌లో కర్ఫ్యూ విధించడంతో జనసంచారం లేని అమృత్‌సర్ ప్రధాన కూడలి

న్యూఢిల్లీ, మార్చి 23: చక్రం తిరగలేదు.. దుకాణం తెరుచుకోలేదు.. ఆఫీసు తలుపులు మూసే ఉన్నాయి. తోపుడు బళ్లు కానరాలేదు. చాలా అరకొరగా జనసంచారం. హోటళ్లు, తినుబండారపు స్టాళ్లన్నీ 80% బంద్! జనం ఇళ్లకే పరిమితమయ్యారు. కరోనా ధాటికి భారతావని మొత్తం స్తంభించిపోయింది. ఎక్కడ చూసినా దాదాపుగా కర్ఫ్యూ వాతావరణమే. పరిస్థితి విషమించిన వేళ.. ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో సర్వం మూతపడ్డాయి. అధికారిక సమాచారం ప్రకారం 20 రాష్ట్రాల్లో లాక్‌డౌన్ సంపూర్ణంగా అమలయింది. మరో 6 రాష్ట్రాల్లో పాక్షికంగా షట్‌డౌన్ అమలైంది. కరోనా మృతుల సంఖ్య 9 కి పెరిగింది. తాజాగా పశ్చిమ బెంగాల్‌లో ఉత్తర 24 పరగణాల జిల్లాకు చెందిన డమ్‌డమ్‌లో ఓ 57-ఏళ్ల వ్యక్తి వైరస్ సోకి చనిపోయాడు. ఇతను విదేశీ ప్రయాణాలు చేయకపోయినా వ్యాధిబారిన పడ్డాడు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రాలో ఈ మధ్యే అమెరికా నుంచి తిరిగివచ్చిన, టిబెట్‌కు చెందిన ఓ శరణార్థి కరోనా లక్షణాలతో చనిపోయాడు. ఇక ముంబైలో కరోనా సోకి, నయమై, డిశ్చార్జి అయిన, ఫిలిప్పీన్స్‌కు చెందిన 68-ఏళ్ల వ్యక్తికి మళ్లీ కరోనా సోకి సోమవారం మరణించాడు. అయితే ఇది కరోనా వల్లా కాదా అన్నది కేంద్రం ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. దేశవ్యాప్తంగా కేసుల సంఖ్య 478కు చేరింది. ఒక్క కేరళలోనే 28 మందికి, మహారాష్ట్రలో 15 మందికి తాజాగా కరోనా సోకింది. మహారాష్ట్రలో 8 మందికి పాజిటివ్‌గా తేలడంతో కేసుల సంఖ్య 97కు పెరిగింది. వీరిలో 402 మంది ప్రస్తుతం చికిత్సలో ఉన్నారు. 24 మందికి నయమై డిశ్చార్జి అయ్యారు. మొత్తం కేసుల్లో 41 మంది విదేశీయులు. సోమవారం ఉదయం 10 గంటల దాకా 18, 383 మంది నమూనాలను పరీక్షించినట్లు భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తెలిపింది. కాగా, కేసుల సంఖ్య 497కు పెరిగినట్లు అనధికార వార్తలు సూచిస్తున్నాయి.

### ఠాక్రే వార్నింగ్

పంజాబ్, చండీగఢ్, మహారాష్ట్రల్లో సంపూర్ణంగా కర్ఫ్యూ విధించారు. మహారాష్ట్రలో దేశంలోనే అత్యధిక సంఖ్యాకులకు సోకి- కేసులు 100కు చేరువగా ఉండడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి కర్ఫ్యూ అమలు చేయనున్నట్లు సీఎం ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. రాష్ట్ర సరిహద్దులను మూసేశారు. పంజాబ్‌లో ప్రజలు లాక్‌డౌన్‌ను ధిక్కరించి, ఆంక్షలను పట్టించుకోకపోవడంతో ప్రభుత్వం కర్ఫ్యూను ప్రకటించింది.

### ప్రభుత్వ చర్యలు భేష్: సుప్రీం

సుప్రీంకోర్టు కూడా కేవలం అత్యవసర కేసుల్ని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణకు చేపట్టింది. ఒకటో నెంబరు కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల బెంచ్ కూర్చుని 3 కేసుల్లో వాదనలను ఆలకించింది. ప్రభుత్వ చర్యలపై సీజే బోబ్డే, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ లావు నాగేశ్వరరావుల మరో బెంచ్ కితాబిచ్చింది.

### నేటి నుంచి 'శంషాబాద్' బంద్

దేశీయ విమానాలనూ బంద్ చేయాలని కేంద్రం నిర్ణయించింది. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి దేశంలో నగరాల మధ్య సర్వీసులన్నీ నిలిపేయాల్సిందిగా అన్ని ప్రైవేటు విమానయాన సంస్థలకూ కేంద్రం నిర్దిష్ట ఆదేశాలిచ్చింది. అయితే ఇది కార్గో సర్వీసులకు వర్తించదు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి కూడా దేశీయ సర్వీసులు ఆపేస్తున్నారు. ఆదివారం రాత్రి షికాగోకు చివరి అంతర్జాతీయ సర్వీసు (ఏఐ 127) బయల్దేరి వెళ్లాక మరిక అంతర్జాతీయ విమానాలు గాల్లోకి లేవలేదు. సోమవారం ఒక్కరోజే 122 సర్వీసులు రద్దయినట్లు అధికారులు చెప్పారు. 31వరకూ ఈ పరిస్థితి అమల్లో ఉంటుందని తెలిపారు.

### వాసన, రుచి గుర్తించకున్నా కరోనా?

వాసనలు, రుచులను గుర్తించలేకపోయినా.. అది కరోనా ఇన్ఫెక్షనే కావొచ్చని బ్రిటిష్ రైనోలాజికల్ సొసైటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. కరోనా వైరస్ పంజాకు చిక్కినవారి ముక్కు 'అనోస్మియా' బారినపడుతుందని వారు తెలిపారు. దీనివల్ల తినుబండారాలు, సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసుల సువాసనలతో పాటు కంపు కొట్టే దుర్వాసనలను గుర్తించలేరన్నారు. ఇక కరోనా బాధితుల నాలుకకు కూడా 'యాగ్యూషియా' అనే మరో సమస్య కూడా వస్తుందని పేర్కొన్నారు. ఫలితంగా ఆహార పదార్థాల రుచులను నాలుక మునుపటిలా గుర్తించలేని దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యుల సలహా పొందడంతో పాటు క్వారంటైన్‌లోకి వెళ్లిపోవడం మంచిదని బ్రిటన్ వైద్యులు సూచిస్తున్నారు.



లాక్‌డౌన్ నేపథ్యంలో స్వస్థలాలకు వెళ్తున్న కార్మికులు

## మరో 15 రోజులు తప్పదేమో!

**▸▸ కరోనా ఆంక్షలపై ఎంపీలతో ప్రధాని**

న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు తమ ఇళ్లకు పరిమితం కావడం, సామాజిక దూరం పాటించడం, అన్ని సంస్థలు మూసేయడం, సమావేశాలు రద్దు కావడం వంటివి మరో 15 రోజులు కొనసాగక తప్పదేమోనని ప్రధాని నరేంద్రమోదీ అన్నట్లు తెలిసింది. సోమవారం లోక్‌సభ ముగిసిన తర్వాత స్పీకర్ చాంబర్ లో ఆయనను పలువురు పార్టీల నేతలు కలిశారు. ఎన్నాళ్లు ఈ దిగ్బంధం ఉంటుందని వారు ప్రశ్నించినపుడు మరో 15 రోజుల్లో అంతా సజావుగా మారవచ్చని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం. వైరస్ వల్ల జరిగిన నష్టాన్ని పూరించేందుకు ప్యాకేజీని ప్రకటించాలని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి కోరగా, దానిపై పరిశీలిస్తున్నామని ప్రధాని జవాబిచ్చినట్లు తెలిసింది. లాక్‌డౌన్‌ను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదని ట్వీట్‌లో ప్రధాని ఆక్షేపించారు. లాక్‌డౌన్‌ను మరింత సీరియస్‌గా అమలు చేయాలని కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపిన తాఖీదులో పేర్కొన్నారు.



లోక్‌సభలో చప్పట్లు కొడుతున్న మోదీ, రాజ్‌నాథ్

## భవిష్యత్తులో పెట్రో వాత!

న్యూఢిల్లీ, మార్చి 23: భవిష్యత్తులో పెట్రోలు, డీజిల్ ధరలను భారీగా పెంచేందుకు కేంద్రం ముందస్తుగా ఏర్పాట్లు చేసుకుంది. దీనికి సంబంధించిన చట్టాన్ని సవరించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లును లోక్‌సభ సోమవారం ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించింది. దాంతోపాటే పెట్రోలు, డీజిల్‌పై ప్రత్యేక ఎక్సైజ్ సుంకానికి సంబంధించిన చట్ట సవరణను కూడా సభ ఆమోదించింది. దీని ద్వారా భవిష్యత్తులో ఎప్పుడైనా పెట్రోలు, డీజిల్‌పై ప్రత్యేక ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు 8 రూపాయలదాకా పెంచుకునేందుకు వీలు కలుగుతుంది. చట్టాన్ని సవరించామే తప్ప కొత్తగా ఎక్సైజ్ సుంకంలో ఎలాంటి మార్పు చేయలేదని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. ఆర్థిక బిల్లును మొదట లోక్‌సభ, తర్వాత రాజ్యసభ ఎలాంటి చర్చ లేకుండా కొన్ని గంటల వ్యవధిలో ఆమోదించాయి. తర్వాత 2020-21 ద్రవ్య వినియోగ బిల్లును రాజ్యసభ ఆమోదించి లోక్‌సభకు పంపింది. అక్కడా బిల్లుకు ఆమోద ముద్ర పడింది. కరోనా వైరస్ భయంతో పలువురు ఎంపీలు రాజ్యసభకు హాజరు కాలేదు.

# క్యా..కరోనా?

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కరోనా వ్యాప్తి నియంత్రణ కోసం వైద్యులు, నర్సులు రాత్రింబవళ్లు చేస్తున్న కృషిని చప్పట్లు కొట్టి దేశం అభినందిస్తోంది. సాక్షాత్తూ 'నారాయణుల'ంటూ భుజం తడుతోంది. కానీ, మన రాష్ట్రంలో మాత్రం వైద్యులు, వైద్య సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి! కనీసం తగినన్ని మాస్కులు, శానిటైజర్లు లేకుండానే వారు కరోనాతో తలపడుతున్నారు. దైవంపైనే భారం వేసి వారు ఆస్పత్రుల్లో అడుగుపెడుతున్నారు. కరోనా బాధితులను ఉంచే ఐసోలేషన్ వార్డుల్లో ఆరోగ్యశాఖ కనీస ప్రమాణాలు పాటించడం లేదు. చివరికి మాస్కుల కోసం కూడా వైద్యులు వెతుక్కోవాల్సిన పరిస్థితి. "మాస్కు లేకపోతే ఏమవుతుంది? మాస్కుల వల్ల ఎలాంటి రక్షణ ఉండదు" అంటూ ఉత్తరాంధ్రలోని ఒక ప్రధాన బోధనాసుపత్రి సూపరింటెండెంట్ ఐసోలేషన్ వార్డులో పనిచేస్తున్న ఓ వైద్యుడికి షాక్ ఇచ్చారు. 'మన దగ్గర వెయ్యి మాస్కులే ఉన్నాయి. వాటిని ఆపరేషన్ థియేటర్లలో వాడతారా, లేక ఐసోలేషన్ వార్డులో ఉపయోగించుకుంటారా అనేది మీరు నిర్ణయించుకోండి" అని సెంట్రల్ ఆంధ్రాలోని ఒక ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ పేర్కొన్నారు. 'మీ అందరికి రెండు మాస్కులే ఇస్తాం. వాటినే ఉపయోగించుకోవాలి. అవసరమైతే వాటినే ఉతుక్కొని మళ్లీ మళ్లీ వాడుకోండి. రోజుకొకటి ఇవ్వాలంటే మా వల్ల కాదు." అని కర్నూలు జిల్లాలోని సీహెచ్‌సీ సూపరింటిండెంట్ తన వైద్యులకు తేల్చిచెప్పారు.

### బయటా కటకటే..

ఏపీఎస్ఎంఐడీసీ పరిధిలో ఉండే సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌లో 1.40 లక్షల త్రీ లేయర్ మాస్కులు, 12 వేల పీపీటీలున్నాయిని ఉన్నతాధికారులు వారంరోజులు ఊదరగొట్టారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వం ఇవ్వకపోయినా ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేద్దామన్న మాస్కులు దొరకడం లేదు. వారం రోజుల క్రితం రెండు రోజుల్లో రాష్ట్రంలోని అన్ని మెడికల్ షాపుల్లో 2.60 లక్షల మాస్కులు, అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు భారీగా ప్రకటనలు చేశారు. కానీ మాస్కుల కొరత అలాగే కొనసాగుతోంది. శానిటైజర్లు ఉన్నాయా అంటే.. ఆ పేరే ఎత్తొద్దు వెళ్లిపోండి అంటూ షాపుల యాజమానులు పంపించివేస్తున్నారు. వైద్యుల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ఆరోగ్య శాఖ ఎప్పుడో కొనుగోలు చేసిన పీపీఈ (వ్యక్తిగత రక్షిత పరికరాలు)లను ఇస్తున్నారు. వీటిని గతంలో హెచ్ఐవీ రోగులకు చికిత్స సమయంలో, లేబర్ రూమ్‌లో డెలవరీలు చేసే, ఇతర సర్జరీలు చేసే సమయంలో ఉపయోగించేవారు. వాటినే ఇప్పుడు ఐసోలేషన్ వార్డులలో ఉపయోగిస్తున్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల్లో వైద్యులకు ఫుల్ ప్రొటెక్షన్ ఎక్యూట్‌మెంట్ ( శరీరం మొత్తం కవర్ చేస్తుంది) ఇస్తున్నారు. దీనివల్ల వైరస్ వల్ల వైద్యులకు ఎటువంటి ప్రమాదం ఉండదు. ఇటువంటివే తమకు ఇవ్వాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం వైద్యులు, రోగులు, ఇతర వైద్య సిబ్బందికి సర్జికల్, త్రీలేయర్ మాస్కులను ఇస్తున్నారు. విశాఖలో మరీ ఘోరంగా క్లాత్‌తో తయారు చేసిన మాస్కులను సిబ్బందికి అందిస్తున్నారు. వీటితో లాభం లేదని.. ఎన్-95 మాస్కులు తెప్పించాలని వారు కోరుతున్నారు. ఏపీఎస్ఎంఐడీసీ అధికారులు పూర్తిస్థాయిలో మాస్కులు, పీపీఈలు అందించలేక.. స్థానికంగా కొనుగోలు చేసుకోవాలని సూపరింటెండెంట్లకు ఆదేశాలిచ్చారు. అసలే మార్కెట్‌లో మాస్కులు దొరకడం లేదు.. ఈ సమయంలో వచ్చిన ఆదేశాలు చూసి అవాక్కవుతున్నారు. భవిష్యత్తులో తీవ్ర సమస్యలు వస్తే, తమకు సంబంధం లేదని చెప్పుకోవడానికే ఇలాంటి ఆదేశాలు ఇస్తున్నారని పలువురు వైద్యులు మండిపడుతున్నారు.

## అవును.. అది సరైన మందే!

(మొదటి పేజీ తరువాయి)

సత్ఫలితాలు వస్తున్నాయని 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. "కరోనా అనుమానిత, పాజిటివ్ కేసులతో సన్నిహితంగా ఉండే వైద్య సిబ్బంది ముందు జాగ్రత్త చర్యగా క్లోరోక్విన్‌ను వాడాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి (ఐసీఎంఆర్) సిఫారసు చేసింది. కరోనా పేషెంట్లకు కూడా సిఫారసు అంశంపై ఐసీఎంఆర్ పరిశీలన చేయాల్సిన అవసరముంది" అని ఆయన అన్నారు. క్లోరోక్విన్ లేదా హైడ్రాక్సీక్లోరోక్విన్‌తో పాటు అజిత్రోమైసిన్ తీసుకోవడం ద్వారా కరోనాను నాలుగైదు రోజుల్లో నియంత్రించవచ్చన్నారు. గర్భిణులు హైడ్రాక్సీక్లోరోక్విన్‌ను వాడాలన్నారు. "చైనాలో ఈ మందు వాడినందు వల్లే అక్కడ కరోనా నియంత్రణలోకి వచ్చిందని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. క్లోరోక్విన్‌తో కరోనా నియంతి్రంచవచ్చని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ప్రకటించారు. కానీ, శాస్త్రీయ ఆధారాలు లేవంటూ దీనికి ప్రాధాన్యం ఇవ్వలేదు. ఆధారాలు ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నాయి" అని ఆయన చెప్పారు. వీటి వినియోగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తక్షణం ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## ఇండియాలో 30 కోట్ల మందికి!

**▸▸ పరిస్థితి ఇలాగే ఉంటే కరోనా బాధితుల సంఖ్య: రమణన్**



న్యూఢిల్లీ, మార్చి 23: దేశంలో కరోనా వ్యాప్తి ఇలాగే కొనసాగితే 30 కోట్ల మంది కొవిడ్ బారిన పడతారని సెంటర్ ఫర్ డిసీజ్ డైనమిక్స్, ఎకనామిక్స్ అండ్ పాలసీ(సీడీడీఈపీ) డైరెక్టర్ రమణన్ లక్ష్మీనారాయణన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలు, ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఈ సంఖ్యను 20 కోట్లకు తగ్గించవచ్చన్నారు. అమెరికా, బ్రిటన్‌లో వైరస్ వ్యాప్తిని భారతదేశ పరిస్థితులకు అన్వయించి ఆయన ఈ వివరాలు వెల్లడించారు. భారతీయుల్లో ఏటా కొన్ని కోట్ల మంది ఫ్లూ బారిన పడతారని, కానీ కరోనా వైరస్ కొత్తదని చెప్పారు. ఈ వైరస్‌కు సంబంధించి రోగనిరోధక శక్తి(ఇమ్యూనిటీ) చాలా తక్కువని, అందుకే అది అత్యంత వేగంగా విస్తరించే ప్రమాదం ఉందన్నారు. ఈ 30 కోట్లలో మూడో వంతు కేసులు తీవ్రంగా మారే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్తలు చేపడితే ఇది నెమ్మదిగా వ్యాపించి, వైద్యం అందించడానికి అవకాశం ఉంటుందని, లేకుంటే స్వల్ప వ్యవధిలో లక్షల మందికి సోకి, 25 లక్షల మంది దాకా మృత్యువాత పడొచ్చని హెచ్చరించారు.

## ప్రత్యేకంగా కొవిడ్-19 ఆస్పత్రి

**▸▸ రోజుకు లక్ష మాస్కుల ఉత్పత్తి: ముకేశ్ అంబానీ**



న్యూఢిల్లీ, మార్చి 23: కరోనాపై పోరులో మేము సైతం అంటూ ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) ముందుకొచ్చింది. కొవిడ్-19 రోగుల కోసం ప్రత్యేకంగా దేశంలోనే తొలి ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో ముంబైలోని సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో 100 పడకల సామర్థ్యంతో ఈ ఆస్పత్రిని రెండు వారాల్లోనే సిద్ధం చేశామని ముకేశ్ అంబానీ తెలిపారు. అలాగే మహారాష్ట్రలోని లోధివాలిలో ఐసోలేషన్ కేంద్రాన్ని ప్రభుత్వానికి అందజేశామన్నారు. వైరస్‌కు మందును కనుగొ నేందుకు రిలయన్స్ లైఫ్ సైన్సెస్‌కు చెందిన వైద్యులు, పరిశోధకులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర సీఎం సహాయ నిధికి రూ.5 కోట్లు విరాళంగా అందజేసినట్లు వెల్లడించారు. ఇక రోజుకు లక్ష మాస్కులను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య సిబ్బందికి దుస్తులు, సూట్లు, మాస్కులు వంటి వాటిని కూడా సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

## వెంటిలేటర్లను తయారు చేస్తాం

**▸▸ మా రిసార్టుల్లో ఆరోగ్య కేంద్రాలు: ఆనంద్ మహీంద్రా**



న్యూఢిల్లీ, మార్చి 23: కరోనా మహమ్మారిపై పోరుపై సహకరించేందుకు పారిశ్రామిక దిగ్గజాలు ముందుకొస్తున్నారు. కరోనా బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో ఆస్పత్రుల్లో చోటు కూడా సరిపోవడం లేదు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో యాపిల్ సీఈవో టిమ్ కుక్, టెస్లా మోటార్స్ సీఈవో ఎలాన్ మస్క్, అలీబాబా వ్యవస్థాపకుడు జాక్ మా వివిధ రూపాల్లో విరాళాలు ప్రకటించారు. తాజాగా ఈ జాబితాలో మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా చేరారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు వెంటిలేటర్లను తయారు చేస్తామని, తమ రిసార్టులను తాత్కాలిక ఆరోగ్య కేంద్రాలుగా వాడుకునేందుకు ఇస్తామని వెల్లడించారు. అలాగే చిరు వ్యాపారులను ఆదుకునేందుకు కంపెనీ తరపున నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ నిధికి తన పూర్తి వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోమవారం ట్విటర్‌లో వెల్లడించారు. ఆనంద్ మహీంద్రా ప్రకటనలపై నెటిజన్లు, ఆయన ఫాలోవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 'ఎమర్జెన్సీ'లో ప్రపంచం!

**▸▸ తీవ్ర ఆంక్షలతో పలు దేశాల్లో లాక్‌డౌన్‌లు**

**▸▸ 16 వేలు దాటిన కరోనా మరణాలు**

వివిధ దేశాల్లో కరోనా మరణాలు

| దేశం | మృతులు |
|---|---|
| అమెరికా | 484 |
| ఇరాన్ | 1,812 |
| స్పెయిన్ | 2,207 |
| ఇటలీ | 6077 |
| ఫ్రాన్స్ | 674 |
| చైనా | 3,270 |



ఫ్రాన్స్‌లో కరోనా బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

వాషింగ్టన్, న్యూయార్క్, రోమ్, మార్చి 23: కోరలు చాస్తూ కమ్ముకొస్తున్న కరోనా మహమ్మారికి దేశాలన్నీ వణికిపోతున్నాయి. ముప్పు తీవ్రం కాకుండా జర్మనీ, గ్రీస్, స్పెయిన్, ఫ్రాన్స్.. ఇలా ఒకదానివెంట ఒకటి ఆంక్షలు విధిస్తున్నాయి. న్యూజిలాండ్ 4 వారాల షట్‌డౌన్ నిర్ణయం తీసుకుంది. విదేశీయులను రానివ్వమని హాంకాంగ్ తెలిపింది. జార్జియాలో ఈ వారం ఎమర్జెన్సీ కొనసాగనుంది. ఇటలీలో సాధారణ ప్రయాణాల రద్దు, పరిశ్రమల మూసివేతకు ఆదేశాలిచ్చారు. బంగ్లాదేశ్‌లో ఈ నెల 26 నుంచి సెలవులిచ్చారు. శ్రీలంకలో కర్ఫ్యూ పొడిగించారు. మధ్య ప్రాచ్యంలో ఆంక్షలు కఠినం చేశారు. సౌదీలో 21 రోజుల పాటు రాత్రి కర్ఫ్యూ అమల్లోకి వచ్చింది. ఉల్లంఘిస్తే రూ.లక్షన్నర జరిమానా కఠిన శిక్షలు ఉంటాయని ప్రభుత్వం హెచ్చరించింది. దుబాయ్ విమానాశ్రయాన్ని రెండు వారాలు మూసివేయనున్నారు. అర్జెంటీనా లాక్‌డౌన్ ప్రకటించింది.

### స్పెయిన్‌లో విలయతాండవం

ప్రపంచవ్యాప్తంగా కరోనా మరణాలు 15,189కి చేరాయి. స్పెయిన్‌లో ఒక్క రోజే 462 మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికాలో మరో 471 మంది మృతి చెందారు. రిపబ్లికన్ సెనేటర్ రాండ్ పాల్ వైరస్‌కు గురయ్యారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌కూ కరోనా ప్రబలింది. జర్మనీ చాన్స్‌లర్ మెర్కెల్ క్వారంటైన్‌కు వెళ్లారు. ఇరాన్‌లో కొత్తగా 127 మంది మృతిచెందారు. రోగులకు చికిత్స చేస్తూ పీవోకేలోని గిల్గిట్- బాల్టిస్తాన్‌కు చెందిన వైద్యుడు (26) కరోనాతో చనిపోయాడు. కేసులు 800 దాటడంతో పాక్ సైన్యాన్ని దించింది. దుబాయ్, కౌలాలంపూర్ విమానాశ్రయాల్లో పలువురు భారతీయులు చిక్కుకుపోయారు. కేసుల పెరుగుదల తీరును విశ్లేషిస్తూ కరోనా విస్తృతం అవుతోందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. వైరస్‌పై తక్షణమే యుద్ధానికి దేశాలకు పిలుపునిచ్చింది.

### ఇరాన్.. చేజేతులా

న్యూఢిల్లీ, మార్చి 23: రోజురోజుకూ పెరిగిపోతున్న కరోనా మరణాలతో ఇరాన్ మరుభూమిని తలపిస్తోంది. ఆసియాలో ప్రతి పది కరోనా మరణాల్లో తొమ్మిది ఇక్కడే నమోదవుతున్నాయి. ఇప్పటివరకు 1,812 మరణాలతో చైనా తర్వాత ఆసియాలోనే అత్యధిక మరణాలు సంభవించిన దేశంగా నిలిచింది. ఫిబ్రవరి 19న తొలి కరోనా కేసు నమోదైనా.. ప్రభుత్వం దాచిపెట్టింది. అదెంతటి తప్పిదమో ఇప్పుడు తెలిసొస్తోంది. కరోనా ఇరాన్‌ను ఏమీ చేయలేదని, ప్రజలను నిర్బంధంలో ఉంచడం రాతియుగపు చర్యని దేశ ఆరోగ్యమంత్రి చేసిన ప్రకటన వారి నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. తర్వాత ఆయన సైతం కరోనాతో క్వారంటైన్ అయ్యారు. నష్టమంతా జరిగాక ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది.

### న్యూయార్క్‌లో 2 గంటలకు ఒక కేసు

(న్యూయార్క్ నుంచి కిలారు అశ్విని కృష్ణ)

ప్రపంచంలోనే ప్రముఖ ఆర్థిక, వాణిజ్య నగరంగా పేరుగాంచిన న్యూయార్క్‌ను కరోనా కబళిస్తోంది. ఇక్కడి "టైమ్స్ స్క్వేర్.. శ్మశాన ప్రాంతాన్ని తలపిస్తోంది. ప్రతి రెండు గంటలకు ఒక కరోనా కేసు నమోదుతో ఈ నగరాన్ని అత్యంత కల్లోల ప్రదేశంగా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. సహాయక చర్యలకు ఆర్మీని రంగంలోకి దింపారు. హోటళ్లను మూసివేసి వాటిలోని 10 వేల గదుల్లో కరోనా బాధితులకు చికిత్సకు ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్యం అందించడానికి అవకాశం ఉన్న కాలేజీలు, క్రీడా మైదానాలను సైన్యం గుర్తిస్తోంది. మెట్రో, ట్యూబ్ రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. లక్షలాది తెలుగు కుటుంబాలుండే న్యూజెర్సీ, కనెక్టికట్ తదితర ప్రాంతాల్లో కరోనా కేసులు లేకపోవడం కొంత ఊరట. తెలుగువారి కోసం తానా, నాట్స్, ఆటా హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశాయి.

## పెద్దలకు రక్షణ ఇలా!

**60 ఏళ్లు దాటిన వారిపై వైరస్ ప్రభావం ఎక్కువ**



కరోనా వైరస్ సోకినవారిలో.. మృత్యువాత పడుతున్నవారి సంఖ్య 3 శాతంలోపే! అది ఊరట కలిగించే విషయమేగానీ.. చనిపోతున్న వారిలో అత్యధికులు వృద్ధులే!! ఇది ఆందోళన కలిగించే విషయం. చైనాలో కరోనా సోకిన 72 వేల మందిపై చేసిన అధ్యయనం ప్రకారం.. మృతుల రేటు కేవలం 2.3%. కానీ, వైరస్ బారినపడిన 80ఏళ్లు దాటిన వృద్ధుల్లో 15% మంది ప్రాణాలు కోల్పోయారు. అటు అమెరికాలోనూ నమోదవుతున్న ప్రతి 10 మరణాల్లో.. 8 మరణాలు 65 ఏళ్లు దాటిన వృద్ధులవే. ఎందుకంటే.. వయసు పెరిగే కొద్దీ రోగనిరోధక వ్యవస్థ శక్తిసామర్థ్యాలు తగ్గుతుంటాయి. ఇంట్లో ఉన్న పెద్దలను (60 ఏళ్లు దాటినవారు), అలాగే పిల్లలను (పదేళ్లలోపు) ఎలా కాపాడుకోవాలి? అనే ప్రశ్నలకు సీడీసీ (సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్) వైద్యనిపుణులు చేస్తున్న సూచనలివి...

- 60 ఏళ్లు దాటిన వృద్ధులను ఇంట్లోనే ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ బయటకు వెళ్లినా.. ఇంటికి రాగానే చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- వృద్ధులను రెగ్యులర్ చెకప్‌లు, వైద్యపరీక్షలు చేయించుకోకపోయినా పర్వాలేదు. ఎక్కువగా జనం ఉండే ఆస్పత్రుల వద్ద వైరస్ వ్యాపించే ముప్పు అధికం.
- బయటకు వెళ్లి ఇంటికి వచ్చే తమ పిల్లలను, బయట ఆడుకొని వచ్చే మనవలను వీలైనంతవరకూ తాకకుండా దూరంగా ఉండడానికి వృద్ధులు ప్రయత్నించాలి.
- జలుబు, దగ్గు వంటివాటితో బాధపడేవారికి కనీసం 6 అడుగుల దూరంలో ఉండాలి.
- ఇంట్లో అందరూ తరచుగా తాకే ప్రదేశాలను శానిటైజర్లు, డిస్‌ఇన్ఫెక్టెంట్లతో శుభ్రం చేస్తుండాలి.
- ధ్యానం చేయడం, దీర్ఘ శ్వాస తీసుకోవడాన్ని సాధన చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, ఉన్నచోటే కూర్చోకుండా తేలికపాటి ఎక్సర్‌సైజులు చేయడం, తగినంత నిద్ర పోవడం.. మరింత ఆరోగ్యంగా ఉంచుతాయి.

-సెంట్రల్ డెస్క్

epaper.andhrajyothy.com

# మే తొలి వారంలోనైనా మేం రెడీ!

## ఐపీఎల్‌పై బీసీసీఐ



**ముంబై:** దేశంలో కరోనా తీవ్రత ఆందోళనకర స్థాయికి చేరుకుంటోంది. దీంతో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నిర్వహణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వచ్చే నెలాఖరు వరకు పరిస్థితులు మెరుగైతే మే తొలి వారంలో లీగ్‌ను ఆరంభించాలని బీసీసీఐ భావిస్తోంది. కానీ ఇప్పుడున్న స్థితిలో ఐపీఎల్ భవితవ్యంపై ఏమీ చెప్పలేమని ఓ అధికారి వ్యాఖ్యానించాడు. 'లీగ్ విషయంలో వచ్చే నెలాఖరు వరకు వేచి చూడాలనుకుంటున్నాం. ఒకవేళ మే తొలి వారంలో కూడా నిర్వహించలేకపోతే ఇక ఈ ఏడాదికి ఆశలు వదులుకోవాల్సిందే. పరిస్థితులు అనుకూలిస్తే అప్పట్లో దక్షిణాఫ్రికాలో జరిపినట్టు 37 రోజుల్లో 59 మ్యాచ్‌లు ఆడిస్తాం. అయితే ఇలాంటి సందర్భంలో దేశమంతా పర్యటించలేం. మహారాష్ట్రలో ఉన్న నాలుగు స్టేడియాలను వినియోగించుకుంటే ప్రయాణ భారం తగ్గుతుంది. అయితే అన్నింటికన్నా ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యం' అని బోర్డు అధికారి స్పష్టం చేశారు.

## ఐసీసీ కార్యాలయం మూసివేత

**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కూడా కొవిడ్-19 నివారణ చర్యలు చేపట్టింది. దుబాయ్‌లోని తమ ప్రధాన కార్యాలయాన్ని మూసేసి అధికారులను ఇంటి నుంచే పనిచేయాల్సిందిగా సూచించింది. దీంతో ఐసీసీ అధ్యక్షుడు శశాంక్ మనోహర్, సీఈ మను సహానే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాల్లో పాల్గొనాలనుకుంటున్నారు.

## కర్ఫ్యూ రోజు.. క్రికెట్ ఆడుతున్న 8 మంది అరెస్టు

**ముంబై:** కరోనాను అరికట్టే చర్యల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చి పిలుపు మేరకు ఆదివారం దేశమంతా జనతా కర్ఫ్యూ పాటించింది. ప్రజలెవరూ రోడ్లపైకి రాకుండా స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. అయితే, సామాజిక దూరం పాటించాలన్న ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన కొందరు.. కల్యాణిలోని ఓ మైదానంలో క్రికెట్ ఆడారు. ఈ ఘటనలో పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారిపై విపత్తుల చట్టం కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## రైనా దంపతులకు మగబిడ్డ



**టీమిండియా క్రికెటర్ సురేశ్ రైనా రెండోసారి తండ్రయ్యాడు. అతని భార్య ప్రియాంక సోమవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. వీరికి ఇప్పటికే గ్రేసియా అనే రెండేళ్ల కూతురు ఉంది.**

## బజ్‌రంగ్ ఆరునెలల వేతనం విరాళం

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రభుత్వానికి భారత స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా మద్దతుగా నిలిచాడు. ఇందుకోసం తన ఆరునెలల వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్టు గతేడాది ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అయిన బజ్‌రంగ్ ట్వీట్ చేశాడు. దీంతో బజ్‌రంగ్‌ను కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజు అభినందించారు. 25 ఏళ్ల బజ్‌రంగ్ ప్రస్తుతం రైల్వే శాఖలో స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ (ఓఎస్డీ)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా.. కరోనా వైరస్ నేపథ్యంలో ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలని బజ్‌రంగ్ డిమాండ్ చేశాడు.

## ఇంట్లో ఉంటారా.. జైలుకు వెళ్తారా?



**న్యూఢిల్లీ:** కర్ఫ్యూ విధించినా స్వేచ్ఛగా తిరుగుతున్నవారు భద్రంగా ఉంటారో లేక జైలుకు వెళతారో? నిర్ణయించుకోవాలని ఢిల్లీ ఎంపీ గౌతమ్ గంభీర్ సూచించాడు. ఆదివారం జనతా కర్ఫ్యూలో ఇళ్లకే పరిమితమైన ప్రజలు మర్నాడే రోడ్లపైకి వచ్చారు. 'ఈ పోరాటం బతుకుదెరువు కోసం కాదు.. మన మనుగడ కోసం జరుగుతోంది. దయచేసి ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ నిబంధనలను పాటించండి' అని గంభీర్ కోరాడు. కాగా.. ఢిల్లీలో కరోనా వైరస్ చికిత్స కోసం అవసరమైన వైద్య పరికరాల కోసం తన ఎంపీ నిధుల నుంచి రూ. 50 లక్షలు ఇవ్వనున్నట్టు గంభీర్ తెలిపాడు.

## బెంగాల్ క్రికెటర్లకు 'కరోనా' ఇన్సూరెన్స్

**కోల్‌కతా:** కరోనా బారిన పడిన వారికి కూడా చికిత్సలు అందించేలా తమ ఆటగాళ్లు, మ్యాచ్ అధికారులకు బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ సదుపాయాన్ని కల్పించనుంది. మొత్తం 3200 మందికి దీనిద్వారా రక్షణ లభిస్తుందని క్యాబ్ ప్రకటించింది. బెంగాల్ తరపున ఆడుతున్న మహిళా క్రికెటర్లు, మాజీ క్రికెటర్లకు కూడా ఈ పాలసీ వర్తిస్తుందని క్యాబ్ ప్రకటించింది.




# మేం ఆడం

## ఐఓసీకి షాక్

- ఒలింపిక్స్ నుంచి వైదొలగిన కెనడా, ఆస్ట్రేలియా
- క్రీడల వాయిదా తప్పదేమోనన్న జపాన్ ప్రధాని
- అంత సులువుకాదన్న ఐఓసీ చీఫ్

**టోక్యో:** కరోనా వైరస్ కరాళ నృత్యం చేస్తున్నా.. ఒలింపిక్స్ నిర్వహించి తీరుతామని చెబుతున్న అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి కెనడా, ఆస్ట్రేలియా షాకిచ్చాయి. ఈ ఏడాది జూలై 24నుంచి ఆగస్టు 9వరకు జరిగే ఒలింపిక్స్‌లో తాము పాల్గొనబోమని కెనడా సోమవారం ప్రకటించింది. అనంతరం కొద్దిసేపటికే ఆస్ట్రేలియా కూడా కెనడా బాటలో పయనించింది. ఈ ఏడాది విశ్వక్రీడలు జరిగితే.. వాటికి తాము దూరంగా ఉంటామని ఆస్ట్రేలియా ఒలింపిక్ కమిటీ (ఏఓసీ) తెలిపింది. ఈ రెండు దేశాల నిర్ణయంతో ఐఓసీపై మరింత ఒత్తిడి ఏర్పడింది. విశ్వ క్రీడల వాయిదాపై తక్షణమే నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఒలింపిక్స్‌ను వాయిదా వేయక తప్పదని అంతర్జాతీయ అథ్లెటిక్ సమాఖ్యల సంఘం చీఫ్ సెబాస్టియన్ కో కూడా అభిప్రాయపడ్డాడు.

### ప్రజల ఆరోగ్య సమస్య..

కేవలం అథ్లెట్లేకాదు.. మొత్తం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా తాము ఒలింపిక్స్‌లో పాల్గొనరాదని నిర్ణయించామని కెనడా ఒలింపిక్ కమిటీ (సీఓసీ) వెల్లడించింది. 'అథ్లెట్ల కమిషన్, అన్ని జాతీయ క్రీడా సమాఖ్యలతోపాటు దేశ ప్రభుత్వ సూచనల మేరకు 2020 ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్‌కు మా దేశ క్రీడాకారులను పంపవద్దన్న కష్టమైన నిర్ణయాన్ని తీసుకున్నాం' అని సీఓసీ, కెనడా పారా ఒలింపిక్ కమిటీ (పీఓసీ) తమ ప్రకటనలో వివరించాయి. 'ఏడాదిపాటు ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలని ఐఓసీ, అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ, ప్రపంచ ఆరోగ్య సంస్థలను కోరుతున్నాం. క్రీడలను వాయిదా వేస్తే ఉత్పన్నమయ్యే సంక్లిష్ట పరిణామాలను ఎదుర్కోవడంలో ఐఓసీకి మేం మద్దతుగా నిలుస్తాం' అని కూడా పేర్కొన్నాయి.

### నిర్వహణకే మొగ్గు.. కానీ..



షింజో

ఒలింపిక్స్ నిర్వహణకు తాము ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని జపాన్ ప్రధాని షింజో అబే పార్లమెంట్‌కు సోమవారం తెలిపారు. 'కానీ పరిస్థితులు చూస్తే క్రీడల వాయిదా తప్పదేమో' అని అభిప్రాయపడ్డారు.

### వాయిదాను పరిశీలిస్తున్నాం..



యోషిరో మోరి

పలు దేశాలు, అథ్లెట్లనుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఒలింపిక్స్‌ను వాయిదా వేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని టోక్యో క్రీడల నిర్వాహక కమిటీ చెప్పింది. 'క్రీడల వాయిదాపై మేం నిర్ణయం తీసుకోలేదు. అయితే నిర్ణీత షెడ్యూల్ మేరకే జరుగుతాయని కూడా చెప్పడంలేదు' అని నిర్వాహక కమిటీ అధ్యక్షుడు యోషిరో మోరి అన్నారు.

### ఫుట్‌బాల్ మ్యాచ్‌లా తరలించలేం



బాచ్

పరిస్థితులు ఎంతో సంక్లిష్టంగా ఉన్నా ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్ మాత్రం ఒలింపిక్స్ నిర్వహించాలన్న ఉద్దేశంతోనే ఉన్నారు. 'ఒలింపిక్స్ వాయిదా అంటే ఓ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను తర్వాతి శనివారానికి వాయిదా వేసినంత సులువు కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు.

### '2021'కి సిద్ధంకండి

ఆస్ట్రేలియా ఒలింపిక్ కమిటీ సోమవారం అత్యవసర టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం ఒలింపిక్స్‌నుంచి తప్పు కొంటున్నట్టు ప్రకటించింది. 'తమ ఆరోగ్యంతోపాటు చుట్టు పక్కలవారి ఆరోగ్య పరిరక్షణకు కూడా అథ్లెట్లు ప్రాధాన్యం ఇవ్వాలి. జాతీయ క్రీడా సమాఖ్యలతో చర్చించిన అనంతరం స్వస్థలాలకు వెళ్లిపోవాలి' అని ఏఓసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మాట్ కరోల్ తెలిపారు. ఈ సందర్భంగా 2021లో జరిగే ఒలింపిక్స్‌కు సన్నద్ధమవ్వాలని కరోల్ తమ అథ్లెట్లకు సూచించడం గమనార్హం.

### సమర్థనీయం కాదు..

కరోనా వైరస్ ప్రపంచంలో ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నదని, అందువల్ల ఒలింపిక్స్‌ను ఇప్పుడు నిర్వహించడం సమర్థనీయం కాదని అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్యల సంఘం అధ్యక్షుడు సెబాస్టియన్ కో అన్నాడు. ఈ మేరకు అతడు ఐఓసీ చీఫ్‌కు లేఖ రాశాడు.

### నెల తర్వాత భారత్ నిర్ణయం: ఐఓఏ

**న్యూఢిల్లీ:** ఒలింపిక్స్‌లో పాల్గొనాలా..వద్దా..అనే విషయమై నెల తర్వాత నిర్ణయం తీసుకుంటామని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) పేర్కొంది. 'మా అథ్లెట్లు, అధికారుల ఆరోగ్య భద్రతే అత్యంత ప్రధానం' అని ఐఓఏ చీఫ్ నరీందర్ బాత్రా అన్నారు. ఒలింపిక్స్ సన్నాహకాలు, ఆరోగ్య పరిస్థితిని వారంలో తెలియజేయాలని టోక్యో క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరినీ కోరామని ఆయన తెలిపారు.





కరోనా అనుమానిత కేసు బయటపడిన వెంకటాపురం గ్రామం వైపు ఎవరూ వెళ్లకుండా ఏర్పాటుచేసిన బారికేడ్లు, విజయవాడలో మందు స్ప్రే చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

# కోరలు చాస్తున్న కరోనా!

## విశాఖలో మరో పాజిటివ్ కేసు

- వెంకటాపురం యువకుడికి నిర్ధారణ
- వారం క్రితం లండన్ నుంచి రాక
- జలుబు, జ్వరంతో ఆస్పత్రిలో చేరిక
- పాజిటివ్‌గా నిర్ధారించిన వైద్యులు
- రాష్ట్రంలో ఏడుకు చేరిన కేసులు



సోమవారం కరోనాపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం జగన్

విశాఖపట్నం, కాకినాడ (ఆంధ్రజ్యోతి), గుంటూరు, ఏలూరు, మార్చి 23: రాష్ట్రంలో కరోనా మహమ్మారి కోరలు చాస్తోంది. సాగర నగరంలో ఇది మరింత తీవ్రంగా విజృంభిస్తోంది. ఇప్పటికే విశాఖ నగరంలోని అల్లిపురం ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబంలో ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ కాగా.. సోమవారం మరో కేసు బయటపడింది. దీంతో రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఏడుకి చేరినట్టయింది. విశాఖ జిల్లా పద్మనాభం మండలంలోని రేవిడి వెంకటాపురం గ్రామానికి చెందిన యువకుడు కరోనా బారినపడినట్టు అధికారులు సోమవారం నిర్ధారించారు. బాధిత యువకుడు లండన్‌లో ఎంబీఏ చేస్తున్నాడు. ఈ నెల 17న అక్కడి నుంచి ఢిల్లీ మీదుగా విమానంలో విశాఖ చేరుకున్నాడు. విమానాశ్రయంలో వైద్య సిబ్బంది నిర్వహించిన పరీక్షల్లో ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవడంతో అతన్ని హోమ్ క్వారంటైన్‌లో ఉండాలని సూచించి పంపించేశారు. అయితే ఈ నెల 19న అతనికి జలుబు, జ్వరం వచ్చింది. రెండు రోజులు మందులు వాడినా తగ్గకపోవడంతో.. 21న గాయత్రీ విద్యా పరిషత్ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడి వైద్యులు ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఛాతీ ఆస్పత్రిలో అతని నమూనాలు సేకరించిన వైద్యులు ల్యాబ్‌కు పంపగా పాజిటివ్ అని తేలింది.

### క్వారంటైన్‌కు సన్నిహితులు

కరోనా బారినపడిన యువకుడితో ఈ 4 రోజుల్లో సన్నిహితంగా మెలిగిన 20 మందిని అధికారులు గుర్తించారు. వీరిలో కొంతమందిని హోమ్ క్వారంటైన్‌లో ఉండాలని సూచించారు. మరికొందరిని విమ్స్‌లోని క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వీరిలో కుటుంబ సభ్యులు ఏడుగురు, స్నేహితులు 13 మంది ఉన్నారు. కరోనా బాధిత వ్యక్తి ఇంటి నుంచి 3 కి.మీ. పరిధిలో అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు.

### గోదావరి జిల్లాల్లో 11 మంది అనుమానితులు

తూర్పు గోదావరి జిల్లాలో ఎనిమిది, పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు అనుమానిత కేసులు నమోదయ్యాయి. కాకినాడ, సామర్లకోట, యు.కొత్తపల్లి, తాళ్లరేవు ప్రాంతాలకు చెందిన వారిని కాకినాడ జీజీహెచ్‌లోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ఇప్పటి వరకూ తూర్పుగోదావరిలో కరోనా అనుమానితుల సంఖ్య 45కు చేరింది. వారిలో రాజమహేంద్రవరానికి చెందిన యువకుడికి పాజిటివ్ వచ్చింది. అతని తల్లిదండ్రులకూ కరోనా లక్షణాలు కనిపించడంతో వారిని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో ముగ్గురు కరోనా అనుమానితులను ఏలూరు ప్రభుత్వాస్పత్రిలోని ఐసోలేషన్ వార్డులో చేర్పించారు. గుంటూరు జిల్లాలో ఐదుగురు కరోనా అనుమానిత లక్షణాలతో సోమవారం జ్వరాల ఆస్పత్రికి వచ్చారు. వారికి విదేశాలకు వెళ్లొచ్చిన చరిత్ర ఉండటంతో వారిలో నలుగురి నమూనాలు సేకరించి తిరుపతి పంపారు.

### ఇకపై కాకినాడలోనే పరీక్షలు

ఇప్పటివరకు కరోనా అనుమానితుల శాంపిల్స్‌ను పుణెలోని ల్యాబ్‌కు పంపించేవారు. మంగళవారం నుంచి కాకినాడలోని వైరాలజీ ల్యాబ్‌లోనే కరోనా నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ఇక్కడ తీసిన శాంపిళ్లలో పదింటిని మళ్లీ పుణెకు పంపించగా.. కాకినాడ ల్యాబ్‌లో వచ్చిన ఫలితాలే చూపించాయి. దీంతో ఇకపై ఇక్కడే శాంపిల్స్‌ను పరీక్షించి 24 గంటల్లోనే రిపోర్టులు ఇవ్వాలని నిర్ణయించారు.

### నెల్లూరు యువకుడు డిశ్చార్జ్

నెల్లూరు (వైద్యం), మార్చి 23: రాష్ట్రంలోనే తొలి పాజిటివ్ కేసుగా నమోదైన నెల్లూరు యువకుడు కోలుకోవడంతో వైద్యాధికారులు అతన్ని సోమవారం ఇంటికి పంపించి వేశారు. ఈ నెల 6న ఇటలీ నుంచి వచ్చిన ఈ యువకుడిని 9న కరోనా లక్షణాలతో ఆస్పత్రిలో చేరగా అతనికి పాజిటివ్ అని తేలింది. దీంతో అతన్ని ఐసోలేషన్ వార్డులో ఉంచి 14 రోజులపాటు చికిత్స అందించారు. ఈ నెల 21న మరోసారి అతని నమూనాలు తిరుపతికి పంపగా.. ఫలితం నెగెటివ్ వచ్చింది. దీంతో సోమవారం అతన్ని డిశ్చార్జి చేశారు. అయితే అతన్ని ఇంటి వద్దే క్వారంటైన్‌లో ఉండాలని సూచించారు.

### విజయవాడలో కోలుకుంటున్న బాధితుడు

- కుటుంబ సభ్యులకు నెగెటివ్

విజయవాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో కరోనా తొలి పాజిటివ్ కేసుగా నమోదైన విజయవాడ పాతబస్తీకి చెందిన యువకుడు ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. ఈ యువకుడు ప్యారిస్ నుంచి ఈ నెల 17న ఢిల్లీ, హైదరాబాద్ మీదుగా విజయవాడ చేరుకున్నాడు. కరోనా అనుమానంతో అతన్ని ఈ నెల 20న ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. రిపోర్టుల్లో పాజిటివ్ వచ్చింది. ఆ యువకుడు నాలుగు రోజులు ఇంట్లోనే ఉండడంతో అతని తల్లి, తండ్రి, తమ్ముడిని కూడా అధికారులు ఆస్పత్రిలో చేర్పించారు. వారి రిపోర్టుల్లో నెగెటివ్ అని తేలడంతో సోమవారం వారిని డిశ్చార్జి చేశారు. అయినా వారు 14 రోజులపాటు హోం క్వారంటైన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు.

# ఐటీ కంపెనీలపై ఖాకీ కన్నెర్ర

- అత్యవసర జాబితాలో విశాఖ ఐటీ
- అయినా పోలీసుల వేధింపులు
- వర్క్ ఫ్రమ్..కోసం కంప్యూటర్లను తీసుకెళ్తున్న వారినీ స్టేషన్‌కు



విశాఖలోని ఓ ఐటీ కంపెనీలో పలుచగా ఉద్యోగులు

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఐటీ సంస్థలను నిత్యవసర సేవల కింద రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి నిరభ్యంతరంగా పనిచేసుకోవడానికి ఉత్తర్వులు ఇచ్చినా పోలీసులు మాత్రం అంగీకరించడం లేదు. విశాఖపట్నంలో సుమారు 150 ఐటీ కంపెనీల్లో 25 వేలమంది వరకు పనిచేస్తున్నారు. వీరందించే సేవలు అనేక పెద్ద పెద్ద కంపెనీలకు తప్పనిసరి కావడంతో కరోనా నేపథ్యంలో ఎటువంటి ఆంక్షలు విధించకుండా పనిచేసే అవకాశం ప్రభుత్వం కల్పించింది. అయితే ఐటీ యాజమాన్యాలు ప్రాక్టికల్‌గా వచ్చే కొన్ని సమస్యలను గుర్తించి పలువురు ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే అవకాశం కల్పించాయి. మిగిలిన వారంతా కార్యాలయాలకు రావాలని ఆదేశించాయి. అయితే సోమవారం నుంచి విశాఖపట్నంలో రాకపోకలపై ఆంక్షలు విధించడం, 144 సెక్షన్ విధించడంతో పోలీసులు గీత దాటి వ్యవహరించారు. విధులకు వెళుతున్న ఐటీ ఉద్యోగులను అనుమతించకుండా బారికేడ్లు పెట్టి ఆపేశారు. మిలీనియం టవర్‌లోని కాండ్యుయెంట్ కంపెనీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సోమవారం కారులో కార్యాలయానికి వెళుతుండగా మద్దిలపాలెం జంక్షన్‌లో పోలీసులు ఆపేశారు. తాను ఫలానా అని చెప్పినా వినకుండా కారుతో సహా పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపోయారు. ఇది జరిగిన కొంతసేపటికి మరికొందరు పోలీసులు రుషికొండలోని కాండ్యుయెంట్ కంపెనీకి వెళ్లి పూర్తిగా మూసివేయాలని హుకుం జారీచేశారు. తమ దగ్గర 1400 మంది పనిచేస్తున్నారని, ప్రభుత్వం తమకు మినహాయింపు ఇచ్చిందని చెప్పినా వారు వినలేదు. రుషికొండ ఐటీ పార్కులో ఇతర కంపెనీలకు కూడా వెళ్లి మూసేయాలని ఆదేశాలు జారీచేశారు. కాగా.. ఐటీ కంపెనీలు కొంతమంది ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసుకునేందుకు అవసరమైన కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు, యూపీఎస్‌లు సోమవారం అందజేశాయి. వారంతా వాటిని ఇంటికి తీసుకెళుతుంటే...పోలీసులు ఆపేసి స్టేషన్‌కి తరలించారు. ఐడీ కార్డులు చూపించినా వినకుండా వాటిని కూడా లాక్కున్నారు.

### కుదరదన్నారు



"ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేయాలంటే... అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడానికి అనుమతి కావాలని జీవీఎంసీ కమిషనర్‌ను కోరాం. ఆయన సహాయం చేయలేమని చెప్పేశారు. పోలీస్ కమిషనరైనా సాయం చేయకుంటే సంస్థలను మూసుకోక తప్పదేమో" **- శ్రీధర్ కొసరాజు, రాష్ట్ర ఐటీ అసోసియేషన్**

# 14 వర్సిటీలకు ఈసీల పునర్వ్యవస్థీకరణ

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 14 యూనివర్సిటీలకు పాలక మండళ్ల(ఈసీ)ను రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం(తిరుపతి), ద్రవిడ వర్సిటీ (కుప్పం), జేఎన్‌టీయూ కాకికాడ, జేఎన్‌టీయూ అనంతపురం, యోగి వేమన(కడప), విక్రమ సింహపురి(నెల్లూరు), శ్రీకృష్ణదేవరాయ(అనంతపురం), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ(శ్రీకాకుళం), రాయలసీమ వర్సిటీ(కర్నూలు), కృష్ణా విశ్వవిద్యాలయం(మచిలీపట్నం), ఆంధ్రా యూనివర్సిటీ (విశాఖపట్నం), ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(గుంటూరు), ఆదికవి నన్నయ యూనివర్సిటీ(రాజమహేంద్రవరం)లకు కొత్త పాలక మండళ్లను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ స్పెషల్ సీఎస్ సతీశ్‌చంద్ర సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాలకమండళ్ల పదవీకాలం మూడేళ్లు. పాలకమండలిలో 14 మంది సభ్యులుంటారు.

### వీసీల కోసం సెర్చ్ కమిటీలు

రాష్ట్రంలోని 4 విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న వైస్ చాన్సెలర్(వీసీ) పోస్టుల భర్తీకి ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించింది. ఆంధ్రా విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, రాయలసీమ విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించాల్సి ఉంది.

# ఎంసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

- ఈసెట్, ఐసెట్‌లకు కూడా..

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో ఎంసెట్, ఈసెట్, ఐసెట్ ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి బి.సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. పరీక్షల తేదీలు, హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్‌లో మాత్రం ఎలాంటి మార్పులూ లేవని సోమవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఎంసెట్ ఆలస్య రుసుం లేకుండా ఏప్రిల్ 5 వరకు, రూ.500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 10 వరకు, రూ.1000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 15 వరకు, రూ.5 వేల ఆలస్య రుసుంతో ఏప్రిల్ 17 వరకు, రూ.10 వేల ఆలస్య రుసుంతో ఏప్రిల్ 19 వరకు పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈసెట్‌కు ఆలస్య రుసుం లేకుండా ఏప్రిల్ 9 వరకు, రూ.500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 10 వరకు, రూ.1000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 16 వరకు పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐసెట్‌కు ఆలస్య రుసుం లేకుండా ఏప్రిల్ 9 వరకు, రూ.2,000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 16 వరకు, రూ.5,000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 22 వరకు, రూ.10 వేల ఆలస్య రుసుంతో ఏప్రిల్ 25 వరకు పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*

epaper.andhrajyothy.com